ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 30.08.2025 | సంపుటి : 12 సంచిక : 41 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.APTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

### కాళేశ్వరం, బిసి రిజర్వేషన్లపైనే ప్రధాన చర్చ

**నిర్వాహణ, ఏర్పాట్లపై స్పీకర్ ముందస్తు మీటింగ్**



**హైదరాబాద్,ఆగస్టు 29 (జనంసాక్షి) :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై చర్చించ నున్నారు. తొలిరోజు దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కు సంతాపం ప్రకటిస్తారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో నిర్వాహణ, వసతు లు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముందస్తు సమావేశం నిర్వహించారు. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ- చైర్మన్ శ్రీ బండా ప్రకాష్ ముదిరాజ్ ,లెజిస్లేటివ్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సెక్రటరీ రఘునందన్ రావు, అడిషనల్ సెక్రటరీ (ఫైనాన్స్)- రాయ రవి, డైరెక్టర్ (ప్రోటోకాల్)- శివలింగయ్య హాజరయ్యారు. హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ- రవి గుప్తా, మహే ష్ భగవత్, విక్రమ్ సింగ్ మాన్, సైబరాబాద్,రాచకొండ కమిషనర్లు సుధీర్ బాబు, అవినాష్ మహంతి, ఇంటెలిజెన్స్ ఐజి- కార్తికేయ, అసెంబ్లీ ఛీఫ్ మార్షల్- కర్ణాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవ రెడ్డిలు హాజరయ్యారు.

## విద్యార్థులకు, సిబ్బందికి ఫేషియల్ రికగ్నైజ్ తప్పనిసరి



### ముఖగుర్తింపుతో హాజరుశాతం మెరుగవుతుంది

### అన్నివిద్యాసంస్థల్లో అమలుకు సర్కార్ చర్యలు

- ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు
- మెరుగైన బోధన దిశగా ప్రమాణాలు పెంచుతున్నట్టు వెల్లడి
- మధ్యాహ్నభోజన బిల్లుల చెల్లింపులు గ్రీన్‌చానల్‌లో..
- ఐసీసీలో విద్యాశాఖపై సీఎం రేవంత్ సమీక్ష



**హైదరాబాద్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని.. విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషనల్ కోర్సులు బోధించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించారు. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు మరింత పెంచాలని రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు- ప్రొఫెషనల్ విద్యాసంస్థల్లో లోటు-పాట్లను అరికట్టవచ్చన్నారు. విద్యాశాఖపై ఐసీసీలో సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వేర్వేరు విభాగాలు చేపట్టడం సరికాదని సీఎం అభిప్రాయపడ్డారు. నిర్మాణాల నాణ్యతా ప్రమాణాలు, పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనం కోసం ఒకే విభాగం కింద ఉండాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని.. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. కం-టైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. కంటైనర్లపై సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సూచించారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అవసరమైతే కాంట్రాక్టు పద్ధతిలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సీఎం ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని... ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సీఎం అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. కం-టైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని.. కం-టైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సీఎం తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని మిగతా 2లో..

## జీఎస్టీ నష్టాలను కేంద్రమే భరించాలి

- జిఎస్టీ రేట్ రేషనైలేజేషన్‌తో రెవెన్యూపై ప్రభావం
- రాష్ట్రాలు బలపడితేనే దేశం పటిష్టంగా ఉంటుంది
- ఆదాయాలు దెబ్బతినకుండా చూడాలని ఆర్థిక మంత్రుల డిమాండ్




**న్యూఢిల్లీ, ఆగస్టు 29 (జనంసాక్షి) :** కేంద్రం వస్తు సేవల పన్ను జిఎస్‌టి రేటు నిర్మాణాన్ని సవరించడంతో ఆదాయ నష్టాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు పరిహారం చెల్లించాలని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు శుక్రవారం డిమాండ్ చేశాయి. జిఎస్‌టి రేటు నిర్మాణ సవరణ ప్రతిపాదనతో రాష్ట్రాలకు సుమారు రూ. 1.5కోట్ల నుండి రూ. 2 లక్షల కోట్ల వరకు ఆదాయ నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నాయి. ఎనిమిది రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్నాటక, కేరళ, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ పశ్చిమబెంగాల్ రాష్ట్రాల ఆర్థికమంత్రులు సెప్టెంబర్ 3 మరియు 4 తేదీల్లో జరిగే తదుపరి జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో తమ ప్రతిపాదనను సమర్పించాలని నిర్ణయించారు. రేటు- నిర్మాణ సవరణ, ఆదాయ నష్టాన్ని సమతుల్యం చేయడానికి అల్ట్రా లగ్జరీ, సిగరెట్ వంటి వస్తువులపై ప్రతిపాదిత 40శాతం రేటుతో పాటు అదనపు సుంకాన్ని విధించాలని సూచించాయి. ఈ లెవీ నుండి వచ్చే ఆదాయాన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాలని ప్రతిపక్షపాలిత రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆదాయ భద్రతను లెక్కించడానికి మిగతా 2లో..

## జపాన్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం

- చంద్రయాన్ మిషన్ కోసం కలిసి పరిశోధనలు
- ప్రధాని పర్యటన సందర్భంగా రెండు దేశాల అంగీకారం

2



## అమెరికాకు జపాన్ షాక్

9

## సరిహద్దు గోడ కట్టాలా?

### అక్రమ వలసలపై సుప్రీం సంచలన ప్రశ్న

- కేంద్ర వైఖరి స్పష్టం చేయాలని సుప్రీం ఆదేశం
- బెంగాలీ మాట్లాడే వారిపై బలవంత నిర్బంధం
- వలసదారుల నిర్బంధంపై విమర్శపై సుప్రీం ప్రశ్న



**న్యూఢిల్లీ ఆగస్టు 29 (జనంసాక్షి) :** అక్రమ వలసలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అమెరికా తరహాలో భారత్‌లో సరిహద్దు గోడ కట్టాలని ఆలోచిస్తున్నారా అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం మిగతా 2లో..

## రామసేతుపై సుబ్రమణ్యస్వామి పిటిషన్

- విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు
- కేంద్రానికి నోటీసులు జారీ

2



ఎంపీలందరికీ లేఖ రాస్తా..

## ఎంపీలందరికీ లేఖ రాస్తా.. వ్యక్తిగత మద్దతు అభ్యర్థిస్తా..

### ముంబైలో ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి

- మహావికాస్ అఘాడి నేతలతో భేటీ
- ఇది రాజ్యాంగ విలువలను కాపాడే పోరాటంగా పిలుపు

**ముంబై, ఆగస్టు 29 (జనంసాక్షి) :** ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి శుక్రవారం ముంబైలో ముమ్మరంగా పర్యటించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు కోరేందుకు మహా వికాస్ అఘాడి నాయకులతో సమావేశాలు నిర్వహించారు. శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే, ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ పాల్గొనగా.. ఇండియా కూటమి ఐక్యతను ప్రతిబింబించేలా నేతలు స్పందించారు. రాజ్యాంగ విలువలను కాపాడేందుకు తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు జస్టిస్ బీఎస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం మిగతా 2లో..



ముంబైలో మహారాష్ట్ర వికాస్ అఘాడి నాయకులతో సమావేశమైన ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి

## పీఎం షినవత్రాపై అనర్హత వేటు

### థాయ్‌లాండ్ ప్రధాని పదవి నుంచి తొలగిస్తూ రాజ్యాంగ కోర్టు తీర్పు

### ఫోన్ కాల్ వివాదంతో ప్రధానికి పదవీ గండం



**బ్యాంకాక్ (జనంసాక్షి) :** థాయ్‌లాండ్ ప్రధాని పెటంగటార్న్ షినవత్రాకు గట్టి షాక్ తగిలింది. కాంబోడియా నాయకుడితో జరిపిన ఫోన్ సంభాషణలో ఆమె చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. కాంబోడియా మాజీ నాయకుడు హున్‌సేన్‌ను 'అంకుల్' అని సంబోధించి, తమ దేశ సైనిక కమాండర్‌ను విరోధిగా పేర్కొనడం ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తించింది. కాంబోడియాతో సరిహద్దు ఉద్రిక్తతల నడుమ ఈ వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన థాయ్‌లాండ్ రాజ్యాంగ కోర్టు, ఆమె నైతిక నియమాలను ఉల్లంఘించారని, దౌత్య వ్యవహారాల్లో తప్పిదం చేశారని తేల్చింది. గత నెలలో ఆమెను ప్రధాని పదవి నుంచి సస్పెండ్ చేస్తూ తీర్పు వెలువరించిన కోర్టు, శుక్రవారం ఆమెను పదవి నుంచి పూర్తిగా తొలగిస్తూ సంచలన తీర్పు చెప్పింది. రాజ్యాంగం ప్రకారం ఆమె ప్రధాని పదవికి అనర్హురాలని కోర్టు స్పష్టం చేసింది. మాజీ ప్రధాని తక్సిన్ లోపలి పేజీలో



## కామారెడ్డికి అపార నష్టం

- రోడ్లు ధ్వంసమై జనజీవనానికి బ్రేక్
- గంటల కొద్దీ నిలిచిపోతున్న వాహనాలు
- ఇంకా నీళ్లలోనే పట్టణంలోని పలు కాలనీలు

**కామారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 29 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా చరిత్రలోనే ఎప్పుడూ చూడని అతి భారీ వర్షం స్థానికులను కుదిపేసింది. జిల్లా చరిత్రలోనే ఎన్నడూ చూడని విధంగా కురిసిన అతి భారీ వర్షం ఈ ప్రాంతాన్ని అతలాకుతలం చేసింది. ఒక్కసారిగా కురిసిన కుండపోత వర్షానికి ప్రజల జీవితాలు తలకిందులయ్యాయి, వారి కలలన్నీ నీటిలో కొట్టుకుపోయాయి. ఈ విపత్తు కేవలం ఒక రోజులో సంభవించలేదు, ఏకధాటిగా 24 గంటల పాటు కురిసిన వర్షం, జిల్లా మొత్తాన్ని మిగతా 2లో..

## ఉత్తరాఖండ్‌లో మరోమారు క్లౌడ్ బరస్ట్

- కుండపోత వర్షాలతో పలు గ్రామాలు అతలాకుతలం

2

## వాళ్లు ఎస్టీలు కాదు..!

- లంబాడీ, సుగాలీ, బంజారాలను జాబితా నుంచి తొలగించాలని పిటిషన్
- విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

2

## సుప్రీం జడ్జిలుగా జస్టిస్ అరాధే, జస్టిస్ పంచోలీలు

- నూతన జడ్జిలతో ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్
- కొలిజీయం నిర్ణయంపై జస్టిస్ బివి నాగరత్న భిన్నాభిప్రాయం



## రెండ్రోజుల్లో యూరియా

### రాష్ట్ర సర్కారు ఒత్తిడి ఫలించింది

- రైతులకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల శుభవార్త



**హైదరాబాద్,ఆగస్టు 29 (జనంసాక్షి) :** యూరియా కోసం ఎదురు చూస్తోన్న రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు శుభవార్త చెప్పారు. యూరియా సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన మిగతా 2లో..

వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు..

## రాష్ట్ర రుణభారం పెంచుతున్నరు

### ఆర్థిక పరిస్థితిపై తప్పదోవ పట్టిస్తున్న ప్రభుత్వం

### ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. రాష్ట్రం ప్రతి నెలా రూ. 7,000 కోట్ల రుణ వడ్డీ చెల్లిస్తోందని మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org | శనివారం 30 అగస్టు 2025

# జీఎస్టీ నష్టాలను కేంద్రమే భరించాలి




బేస్ ఇయర్‌ను 2024-25గా నిర్ణయించాలని ఎనిమిది రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. ప్రతిపాదిత అదనపు లెవీ విధించిన తర్వాత కూడా లోటు ఉంటే, కేంద్ర ప్రభుత్వం అదనపు లెవీ భవిష్యత్ రసీదులకు బదులుగా సెక్యూరిటీ- కల్పించబడిన రుణాలను సేకరించాలని రాష్ట్రాలు తమ ప్రతిపాదనలో పేర్కొన్నాయి. సమావేశం అనంతరం ఎనిమిది రాష్ట్రాల ఆర్థికమంత్రులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను కాపాడాలని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలకు నష్టం కలిగితే.. ప్రజలు, అభివృద్ధి పనులు ప్రభావితమవుతాయని, రాష్ట్ర స్వయం ప్రతిపత్తికూడా దెబ్బతింటుందని అన్నారు. ప్రతి రాష్ట్రం ప్రస్తుత జిఎస్‌టి ఆదాయంలో 15-20శాతం నష్టపోతున్నట్లు- అంచనా వేశామని కర్నాటక ఆర్థికమంత్రి కృష్ణబైరె గౌడ తెలిపారు. 20శాతం ఆదాయనష్టం దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక నిర్మాణాన్ని తీవ్రంగా అస్థిరపరుస్తుందని అన్నారు. ఆదాయం స్థిరీకరించే వరకు రాష్ట్రాలకు ఐదేళ్ల పరిహారం చెల్లించాలని సూచించారు. జిఎస్‌టి అమల్లోకి వచ్చినపుడు ఆదాయ తటస్థ రేటు 14.4శాతం ఉందని, తర్వాత పన్ను రేటు నిర్మాణ సవరణ తర్వాత నికర పన్ను రేటు 11శాతానికి తగ్గింది. జిఎస్‌టి రేట్లను తగ్గించడం, స్లాబ్‌లను సవరించడం అనే కేంద్ర ప్రభుత్వ ప్రస్తుత ప్రతిపాదనతో నికర పన్ను రేటు- 10శాతానికి పడిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రేటు నిర్మాణ సవరణకు తాము అంగీకరిస్తున్నామని, అయితే రాష్ట్రాలకు పరిహారం చెల్లించాలని హిమాచల్ ప్రదేశ్ సాంకేతిక విద్యమంత్రి రాజేష్ ధర్మాని పేర్కొన్నారు. రేటు- నిర్మాణ సవరణ ప్రయోజనాలు సామాన్యులకు చేరేలా, లాభాలను గుర్తించేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని పంజాబ్ ఆర్థికమంత్రి హర్పాల్ సింగ్ చీమ డిమాండ్ చేశారు.

**సెప్టెంబర్ 3న మరోసారి డిమాండ్లు : భట్టి**

రేషనలైజేషన్‌ను ఆహ్వానిస్తూనే రాష్ట్రాలకు జరిగే నష్టానికి..పరిహారం చెల్లించే మార్గాలను కేంద్రం ఆలోచించాలని తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క కోరారు. సెప్టెంబర్ 3న మరోసారి ఢిల్లీలో 8 రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, జిఎస్టి కౌన్సిల్ సమావేశంలో తమ డిమాండ్లు లేవనెత్తాలని కేంద్రం నిర్ణయం తీసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. జీఎస్టీ సంస్కరణలతో తెలంగాణ రాష్ట్రానికి రూ.7వేల కోట్లు నష్టం వస్తుందని అంచనా ఉన్నట్లు మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దిల్లీలో జరిగిన 'జీఎస్టీ సంస్కరణలపై ప్రతిపక్ష పార్టీ పాలిత రాష్ట్రాల సమావేశం'లో ఆయన పాల్గొన్నారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఝార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరయ్యారు.



# 2లక్షల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

**భారీ వర్షాలపై అధికారులన నివేదికలు**

**హైదరాబాద్,ఆగస్టు 29 (జనంసాక్షి) :** తెలంగాణలో భారీ వర్షాల కారణంగా 270 మండలాలు, 2,463 గ్రామాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడిరచింది. వర్షాలతో వరి, పత్తి, మొక్కజొన్న, టమాట, కంది పంటలకు నష్టం వాటిల్లినట్లు- పేర్కొంది. మొత్తం 2,20,443 ఎకరాల్లో పంటలు దెబ్బతినట్లు- ప్రాథమికంగా అంచనా వేశామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు జిల్లాలవారీగా పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు- వెల్లడిరచారు. నివేదిక ప్రకారం.. 1,09,626 ఎకరాల్లో వరి, 60,080 ఎకరాల్లో పత్తి, 6,751 ఎకరాల్లో సోయాబీన్, 639 ఎకరాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

## విద్యార్థులకు, సిబ్బందికి ఫేషియల్ రికగ్నైజ్ తప్పనిసరి

పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సీఎం సూచించారు. విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాక పెట్టు-బడిగా చూస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లతో పాటు- విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని సీఎం తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దు గోడ కట్టాలా?

కేంద్రాన్ని అడిగింది. జాతీయ భద్రత, దేశ సమగ్రతకు సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నప్పటికీ, భారతీయులు పొరుగు దేశాలతో భాష, సాంస్కృతిక వారసత్వాన్ని పంచుకుంటున్నారని, సరిహద్దులు వేరైనా ఒకే భాష మాట్లాడే విషయాన్ని గుర్తుంచుకోవాలని కోర్టు పేర్కొంది. అక్రమ వలసదారులను బలవంతంగా బంగ్లాదేశ్‌కు పంపిస్తున్నారని ఆరోపిస్తూ పశ్చిమ బెంగాల్ వెల్ఫేర్ బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదిస్తూ, బెంగాలీ మాట్లాడే వలసదారులను జాతీయత నిర్ధారణ కాకముందే బలవంతంగా నిర్బంధిస్తున్నారని, వారికి ఉపశమనం కల్పించాలని కోరారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఈ ఆరోపణలపై కచ్చితమైన ఫిర్యాదులు లేవని, రాజకీయ పార్టీలు ఈ విషయంలో కోర్టును ఆశ్రయించలేదని వాదించారు. దీనికి స్పందించిన ధర్మాసనం, వలసదారులు భయం కారణంగా కోర్టును ఆశ్రయించకపోవచ్చని, అటువంటి వారికి సామాజిక స్ఫూర్తి కలిగిన వ్యక్తులు సహాయం చేస్తారని పేర్కొంది. అక్రమ వలసలను అడ్డుకోవడానికి అమెరికా తరహా సరిహద్దు గోడ నిర్మాణం గురించి ఆలోచిస్తున్నారా అని మెహతాను ప్రశ్నించగా, అటువంటి ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు. కేంద్రం తన వైఖరిని, వలసదారులను వెనక్కి పంపే ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాలను స్పష్టం చేయాలని, ఈ విషయంలో గుజరాత్, ఎన్‌ఆర్‌సీ ప్రక్రియల గురించి వివరించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కూడా ఈ కేసులో పార్టీగా చేర్చాలని ధర్మాసనం పేర్కొంది.

# రెండ్రోజుల్లో యూరియా

ప్రయత్నాలు ఫలిస్తున్నాయని.. ఇందులో భాగంగానే వచ్చే రెండు రోజుల్లో గద్వాల, పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్, సనత్ నగర్, జడ్చర్ల, కరీంనగర్, పందిళ్లపల్లి, గజ్వేల్, మిర్యాలగూడ, నాగిరెడ్డిపల్లికి 21,325 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని తెలిపారు. 2025, సెప్టెంబర్ మొదటి వారంలోగా గంగవరం, దామ్ర, కరాయికల్ పోర్టుల నుంచి మరో 29,700 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని చెప్పారు. పోర్టుల నుంచి ఆదిలాబాద్, జడ్చర్ల, గద్వాల, వరంగల్, మిర్యాలగూడ, పందిళ్లపల్లి, సనత్ నగర్, గజ్వేల్ ప్రాంతాలకు యూరియా చేరుకుంటుందని.. అక్కడి నుంచి డిమాండ్ పరంగా జిల్లాలకు పంపిణీ చేస్తామని తెలిపారు. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షం కురిసిన విషయం తెలిసిందే. ఈ వర్షానికి రాష్ట్రంలోని చాలా జిల్లాలో తీవ్రంగా పంట దెబ్బతిన్నది. ఈ క్రమంలో శక్రవారం సాయంత్రంలోగా పంట నష్టంపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. బృందాలుగా ఏర్పడి జిల్లాలలో పర్యటించి, పంట నష్టం వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు వరద ప్రభావిత జిల్లా కలెక్టర్లతోమంత్రి తుమ్మల మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల ఒత్తిడి వల్ల కేంద్ర ప్రభుత్వం యూరియాను సరఫరా చేసిందని పేర్కొన్నారు. యూరియా కొరతతో కొంతమంది రాజకీయలు చేశారని మండిపడ్డారు. యూరియాను త్వరలోనే అన్ని జిల్లాలకు సరఫరా చేస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా సాయంత్రం వరదల పంట నష్టంపై సమావేశం నిర్వహిస్తారని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

### ఎంపీలందరికీ లేఖ రాస్తా..

# వ్యక్తిగత మద్దతు అభ్యర్థిస్తా..



ముంబై విమానాశ్రయంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి నాయకులు ఘనంగా స్వాగతించారు. ముంబై కాంగ్రెస్ అధ్యక్షురాలు వర్షా గాయక్వాడ్, మాజీ మంత్రి అస్లాం షేక్, రాజ్యసభ సభ్యుడు నాసిర్ హుస్సేన్ తదితరులు ఆయనను స్వాగతించారు. "ఈ ఎన్నికలు మాత్రమే కాదు, రాజ్యాంగ విలువలను కాపాడే పోరాటం" అని వర్షా గాయక్వాడ్ పేర్కొన్నారు. మధ్యాహ్నం 12:15 గంటలకు జస్టిస్ రెడ్డి శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరేను మాతోశ్రీలో కలిశారు. ఈ సమావేశంలో ఆదిత్య థాకరే, సంజయ్ రౌత్, అనిల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు. ఉద్ధవ్ థాకరే ఆయన అభ్యర్థిత్వానికి పూర్తి మద్దతు ప్రకటించారు. "ఇండియా కూటమి ఐక్యతతో రాజ్యాంగాన్ని కాపాడుతాం" అని నాసిర్ హుస్సేన్ తెలిపారు. ఈ సమావేశం ఫెడరలిజం, ప్రజాస్వామ్య విలువలపై చర్చలకు వేదికగా మారింది. తదనంతరం జస్టిస్ రెడ్డి ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్‌ను వైబీ చవాన్ సెంటర్‌లో కలిశారు. సుప్రియా సూలే, జితేంద్ర అవ్హాడ్, ఫౌజియా ఖాన్ తదితరులు హాజరయ్యారు. పవార్ ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపారు. "ఇండియా కూటమి ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉంది" అని పవార్ అన్నారు.

**కట్టుబడి ఉన్నా : జస్టిస్ సుదర్శన్ రెడ్డి**

నేను అన్ని పార్టీల ఎంపీలకు లేఖలు రాసి మద్దతు కోరతా. ఉపరాష్ట్రపతి పదవి రాజకీయేతరమైనది. రాజ్యాంగాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉన్నా. ముంబైని ఛత్రపతి శివాజీ మహారాజ్, బాబాసాహెబ్ అంబేద్కర్ భూమిగా ప్రశంసించారు. ఇండియా కూటమి 64-65% ప్రజల మద్దతును తెలియజేస్తోంది.







# ఉత్తరాఖండ్‌లో మరోమారు క్లౌడ్ బరస్ట్

**న్యూఢిల్లీ,ఆగస్టు 29 (జనంసాక్షి) :** ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలతో వాగులు, వంకలు, నదులు పొంగిపొర్లు తున్నాయి. ఉత్తరాఖండ్ లోని రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాల్లో కురుస్తున్న కుండపోత వర్షం పలు గ్రామాలను ముంచెత్తుతోంది. ఉత్తరాఖండ్‌లో తాజాగా మరోసారి క్లౌడ్ బరస్ట్ సంభవించింది. ఈ విపత్తులో పలువురు ప్రాణాలు కోల్పోగా పలుచోట్ల ఇళ్లు కూలడంతో పదుల సంఖ్యలో ప్రజలు శిథిలాల కింద చిక్కుకున్నారు. మోపాటా ప్రాంతంలో భారీ వరదల్లో ఇద్దరు కొట్టుకుపోగా.. పశువుల కొట్టం కూలడంతో దాదాపు 20 పశువులు జలసమాధి అయ్యాయి. మేఘ విస్ఫోటం కారణంగా రుద్రప్రయాగ్‌లోని అలకనంద, మందాకిని నదుల నీటి మట్టాలు భారీగా పెరుగుతున్నాయి. రుద్రప్రయాగ్‌లోని హనుమాన్ ఆలయం పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో 180కి పైగా రోడ్లు మూసుకుపోయాయి. కేదార్‌నాథ్ లోయలోని లారా గ్రామాన్ని పట్టణంతో కలిపే వంతెన కొట్టుకుపోవడంతో ఆ గ్రామానికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాల దృష్ట్యా, రుద్రప్రయాగ్, బాగేశ్వర్, చమోలి, హరిద్వార్ మొదలైన జిల్లాలోని విద్యాలయాలను మూసివేశారు. ఉత్తరాఖండ్‌లో భారీ వరదలు సృష్టిస్తున్న కల్లోలంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందిస్తూ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. రుద్రప్రయాగ్‌లోని బాసుకేదర్ తహసీల్, చమోలి జిల్లాలోని దేవల్ ప్రాంతంలో మేఘ విస్ఫోటం కారణంగా అనేక కుటు-ంబాలు వరదల్లో చిక్కుకుపోయాయన్నారు. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయన్నారు. వరద ప్రవాహం ప్రమాదస్థాయికి చేరువలో ఉండటంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి అధికారులు తగిన చర్యలు తీసుకుంటు-న్నారని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని అంచనా వేస్తూ లోతట్టు- ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని తెలిపారు. వరద ప్రవాహ ధాటికి ప్రజలు, అడవుల్లోని మూగజీవాలు సైతం భారీస్థాయిలో మృతిచెందుతున్నట్లు- అటవీ అధికారులు పేర్కొన్నారు. వరదల్లో గల్లంతైన వారి గురించి కచ్చితమైన సమాచారం లేకపోయినా చాలామంది ఆచూకీ తెలియడం లేదని అధికారులు తెలిపారు. ఆకస్మిక వరదలతో తప్పించుకొనే మార్గం లేకపోయిందని వివరించారు. ఇటీ-వల ఉత్తరాఖండ్‌లోని రాంనగర్ పెద్ద కాలువలో వరద నీటి ధాటికి చిరుత పులి కొట్టు-కుపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గ్రామాలలోని జంతువులు, పశువులు సైతం భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నాయి.

# రామసేతుపై సుబ్రమణ్యస్వామి పిటిషన్

**న్యూఢిల్లీ,ఆగస్టు 29 (జనంసాక్షి) :** రామసేతు'ను జాతీయ వారసత్వ స్మారక చిహ్నంగా ప్రకటించాలని కోరుతూ గతంలో కేంద్ర మాజీ మంత్రి సుబ్రమణ్యస్వామిదాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. దీనిపై స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. రామసేతుకు సకాలంలో జాతీయ స్మారక చిహ్నం హోదా కల్పించాలని, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాతో సర్వే చేయించాలని గతంలో సుబ్రమణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా విచారణ చేపట్టారు. సుబ్రమణ్య స్వామి తరపున సీనియర్ న్యాయవాది విభా మఖిజా వాదనలు వినిపించారు. రామసేతును కాలుష్యం నుంచి కాపాడటంతో పాటు- దాని పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందని సుబ్రమణ్యస్వామి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ప్రదేశం పలువురి నమ్మకాలతో ముడిపడి ఉందని తెలిపారు. మరోవైపు 'సేతు సముద్రం షిప్ ఛానెల్ ప్రాజెక్టు' కోసం ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంపిక చేసుకోవాలని, తద్వారా రామసేతుకు ఇబ్బంది కలగకుండా ఉంటు-ందని పేర్కొంటూ సుబ్రమణ్య స్వామి మరో పిటిషన్ కూడా దాఖలు చేశారు. ప్రస్తుతం అది సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మన్నార్, పాక్ జలసంధిని కలుపుతూ 83 కి.మీ మేర పూడిక తీసి..ఛానెల్‌ను ఏర్పాటు- చేయాల్సి ఉంటు-ంది. ఇది కార్యరూపం దాల్చితే రామసేతుపై తీవ్ర ప్రభావం ఉంటు-ందన్న ఆరోపణలు ఉన్నాయి. రామసేతును జాతీయ వారసత్వ స్మారక చిహ్నంగా ప్రకటించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రి సుబ్రమణ్య స్వామి సుప్రీంకోర్టులో గతంలోనే ఓ పిల్ దాఖలు చేశారు.

# పీఎం షినవత్రాపై అనర్హత వేటు

షినవత్ర కుమార్తె అయిన పెటంగటార్న్, గత ఏడాది ఆగస్టులో 37 ఏళ్ల వయస్సులో ప్రధాని బాధ్యతలు చేపట్టారు. థాయ్‌లాండ్ చరిత్రలో అతి పిన్న వయస్కురాలిగా, రెండో మహిళా ప్రధానిగా గుర్తింపు పొందారు. అందం, ఫ్యాషన్‌లో స్టైల్ ఐకాన్‌గా నెట్టింట పాపులర్ అయిన ఆమె, ఈ ఫోన్ కాల్ వివాదంతో ఏడాదిలోనే పదవి కోల్పోయారు. గతంలో నైతిక ఉల్లంఘనల కారణంగా 62 ఏళ్ల ప్రధాని స్రెట్టా థావిసిన్ పదవి నుంచి దిగిపోగా, షినవత్రా కూడా ఇప్పుడు అదే బాటలో నిలిచారు.

# జపాన్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం


**న్యూఢిల్లీ, ఆగస్టు 29 (జనంసాక్షి) :** అంతరిక్షరంగంలో గొప్ప విజయాలు సాధిస్తోన్న భారత్ కీలక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. చంద్రుడిపై పరిశోధనల కోసం చేపట్టే చంద్రయాన్-5 మిషన్ కోసం జపాన్‌తో కలిసి పనిచేయనుంది. ఇందుకోసం ఇరుదేశాల అంతరిక్ష సంస్థలు కలిసి పనిచేస్తాయని ప్రధాని మోదీ వెల్లడించారు. రెండు ఆసియా దేశాల మధ్య పెరుగుతోన్న వ్యూహాత్మక, శాస్త్రీయ భాగస్వామ్యానికి ఈ ప్రకటన నిదర్శనంగా కనిపిస్తోంది. ఆర్థిక సహకారం, ఆరోగ్యం, ఏఐ, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడంపై ఇరు దేశాల ప్రధానులు ఈ పర్యటనలో భాగంగా ప్రధానంగా దృష్టిసారించారు. చంద్రయాన్-5 మిషన్ చంద్రుడి ఉపరితలం, పర్యావరణంపై శాస్త్రీయ అవగాహనను పెంచుతుందని భావిస్తున్నారు. జపాన్ తో కలిసి పనిచేయడం ద్వారా అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించుకునే వీలు కలగనుంది. ఇదిలాఉంటే.. చంద్రుడిపై పరిశోధనల కోసం చేపట్టే చంద్రయాన్-5 మిషన్‌కు కొన్నినెలల క్రితం కేంద్రం ఆమోదం తెలిపింది. 2023లో ప్రయోగించిన చంద్రయాన్-3లో భాగంగా 25 కిలోల ప్రజ్ఞాన్ రోవర్‌ను జాబిల్లిపై దించామని ఆ సందర్భంగా ఇస్రో ఛైర్మన్ పేర్కొన్నారు. చంద్రయాన్-5లో మాత్రం 250 కిలోల రోవర్‌ను చంద్రుడి ఉపరితలంపై ల్యాండ్ చేస్తామన్నారు. జపాన్‌తో కలిసి ఈ ప్రాజెక్టును చేపడతామని వెల్లడించారు. ఇప్పుడు దీనిపై మోదీ స్వయంగా ప్రకటన చేశారు. ఇక, జాబిల్లి నుంచి నమూనాలను భూమికి రప్పించేందుకు ఉద్దేశించిన చంద్రయాన్-4 మిషన్‌ను 2027లో ప్రయోగించనున్నారు.

## సుప్రీం జడ్జిలుగా జస్టిస్ అరాధే, జస్టిస్ పంచోలీలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 29 (జనంసాక్షి) :**జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీలు సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణస్వీకారం చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ శుక్రవారం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇద్దరు కొత్త జడ్జీల నియామకంతో కోర్టులో పూర్తి స్థాయి జడ్జీల సంఖ్య తిరిగి 34కి చేరుకుంది. 2025 నవంబర్ 23న సిజెఐ బి.ఆర్.గవాయ్ పదవీవిరమణ చేసే వరకు సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ విధులు నిర్వహించనుంది. అయితే జస్టిస్ పంచోలీని సుప్రీంకోర్టుకు ఎంపిక చేస్తూ కొలిజీయం తీసుకున్న నిర్ణయంపై ఆసభ్యుల్లో ఒకరైన జస్టిస్ బి.వి.నాగరత్న భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. భారత హైకోర్టు జడ్జీల సీనియారిటీ- జాబితాలో జస్టిస్ పంచోలి 57వ స్థానంలో ఉన్నారని, ఆయనకంటే సీనియర్లుగా ఉన్న పలువురు ప్రతిభావంతులైన జడ్జీలు ఉన్నారని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. జస్టిస్ పంచోలికి పదోన్నతి కల్పించాలన్న నిర్ణయం జ్యుడీషియల్ నిర్వహణకు ప్రతికూలంగా ఉందని, ఇది సుప్రీంకోర్టు కొలిజియం విశ్వసనీయతను ప్రమాదంలో పడేస్తుందని అన్నారు. 4:1 మెజారిటీ-తో కొలిజియం ఆగస్ట్ 25న జస్టిస్ అరాధేతో పాటు- జస్టిస్ పంచోలిని సిఫారసు చేసింది. సుప్రీంకోర్టుకు వారి నియామకాన్ని 48 గంటల్లోనే, ఆగస్ట్ 27న ప్రకటించారు. జస్టిస్ పంచోలీ 1968, మే 28న అహ్మదాబాద్‌లో జన్మించారు. 2016 జూన్‌లో గుజరాత్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2023 జులైలో ఆయన పాట్నా హైకోర్టుకు బదిలీ కాగా 2025 జులై 21న పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

# వాళ్లు ఎస్టీలు కాదు..!

న్యూఢిల్లీ, (జనంసాక్షి) : లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కాగా, దీనిపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చటంపై గతంలో తెలంగాణ హైకోర్టులో తెల్లం వెంకట్రావు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ తెల్లం వెంకట్రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలంటూ సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. లంబాడీ, సుగాలీ, బంజారాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మెరుగైన స్థానంలో ఉన్నారని పిటీషన్‌లో తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. వారిని ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల కోయ సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. శుక్రవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎస్టీ జాబితా నుంచి వారిని తొలగించాలని కోరుతూ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరపున సుప్రీం కోర్టులో సీనియర్ అడ్వకేట్ అల్లంకి రమేష్ పిటిషన్ దాఖలు చేశారు. బంజారా, లంబాడాలు, సుగాలీలు గిరిజనులు కారని, 1976 వరకు ఉమ్మడి ఏపీలోని తెలంగాణ జిల్లాల్లో వారిని ఎస్టీలుగా పరిగణించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి వారు తెలంగాణకు వచ్చి, అప్పటి నుంచి గిరిజనుల హక్కులను కొల్లగొడుతున్నారని పిటిషనర్లు తమ పిటిషన్ లో పేర్కొన్నారు. వాస్తవానికి మొదట బంజారా, లంబాడా, సుగాలీలు బిసి జాబితాలో ఉన్నారని కోర్టులో వేసిన పిటిషన్ లో తెలిపారు. పిటిషన్ విచారణ జరిపిన సుప్రీంకోర్టు జస్టిస్ జె కె మహేశ్వరి, జస్టిస్ బిష్ణోయ్ ధర్మాసనం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీ-సులు జారీ చేసింది. పూర్తి వివరాలతో రిజైండర్ దాఖలు చెయ్యాలని ఆదేశాలు జారీ చేసింది.



# కామారెడ్డికి అపార నష్టం

వణికించింది.

భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలోని 44వ నంబరు జాతీయ రహదారి పై భారీగా ట్రాఫిక్ జామ్ శుక్రవారం కూడా కొనసాగింది. పోలీసులు రంగంలోకి దిగి వాహనాలు మెల్లగా కదిలేలా చర్యలు చేపట్టారు. రోడ్డు కోతకు గురికావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు నెమ్మదిగా కదిలాయి. సుమారు గంటకు పైగా ఈ పరిస్థితి నెలకొంది. సదాశివనగర్ మండలం నుంచి భిక్కనూర్ టోల్‌గేట్ వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. బుధవారం, గురువారం కురిసిన వర్షాలకు టెక్రియాల్, సారంపల్లి వద్ద బ్రిడ్జి కోతకు గురైంది. మరోచోట రోడ్డు కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలోనే బుధవారం నుంచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గురువారం రాత్రి కూడా వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోవడంతో పరిస్థితిని ఎస్పీ రాజేశ్ చంద్ర పర్యవేక్షించారు. ట్రాఫిక్ జామ్ సమస్యలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. త్వరగా రహదారులకు మరమ్మతులు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలావుంటే కామారెడ్డి జిల్లాను భారీ వర్షం కకావికలం చేసింది. దీనినుంచ ఇప్పట్లో తేరుకునేలా లేదు. కామారెడ్డి పట్టణంతో పాటు రాజంపేట, భిక్కనూరు, దోమకొండ మండలాల్లో జనజీవనం స్తంభించింది. రాజంపేట మండలంలోని ఆర్గొండ గ్రామంలో 24 గంటల్లో అత్యధికంగా 44 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మరికొన్ని మండలాల్లో 20 సెం.మీ. మేర వర్షం కురిసింది. కామారెడ్డి పట్టణంలోని పెద్దచెరువు అలుగు ఉధృతంగా ప్రవహించడంతో హైదరాబాద్‌కు వెళ్లే మార్గంలోని పైవంతెన మీది నుంచి నీరు ప్రవహించింది. సిరిసిల్ల మార్గంతోపాటు- నిజాంసాగర్ మార్గంలోనూ రోడ్లు ధ్వంసమవడంతో పట్టణానికి మూడు వైపులా రాకపోకలకు ఆటంకం కలిగింది. పెద్దచెరువు అలుగుతో కిందనున్న జీఆర్ కాలనీలో ఇళ్లలోకి నీళ్లు చేరాయి. పదుల సంఖ్యలో కార్లు, ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. భిక్కనూరు- తలమడ్ల స్టేషన్ల మధ్యలో రామేశ్వరపల్లి గ్రామశివారులో వరద ఉధృతికి రైల్వేకట్ట తెగింది. రైల్వేట్రాక్ కింద కంకర, మట్టి కొట్టుకుపోయాయి. దీంతో నిజామాబాద్-హైదరాబాద్ మార్గంలో రైళ్లు నిలిచాయి. జాతీయ రహదారి 44పై భిక్కనూరు టోల్‌గేట్ వద్ద ఎడ్లకట్ట వాగు ప్రవాహం చేరడంతో పాక్షికంగా రోడ్డు దెబ్బతింది. భిక్కనూరు వద్ద రహదారిపై 20 కి.మీ.కు పైగా వాహనాలు గంటల తరబడి నిలిచాయి. అధికారులు వారికి ఆహారంతోపాటు- తాగునీరు సమకూర్చారు. కామారెడ్డి మండలం క్యాసంపల్లి వద్ద నిజామాబాద్ వెళ్లే మార్గంలో గురువారం జాతీయ రహదారి కుంగిపోయింది.

**నిజామాబాద్ జిల్లాలో..**

భారీ వర్షాలతో పలుచోట్ల చిక్కుకు పోయిన వారిని రెండు ఎన్డీఆర్‌ఎఫ్, ఆరు ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు కాపాడాయి. జిల్లాలో 14 ఆపరేషన్లు నిర్వహించి 775 మందిని కాపాడాయి. రాజంపేట మండల కేంద్రానికి చెందిన ఇప్పకాయల వినయ్‌కుమార్(28) ఇంటి గోడ కూలి మృతిచెందారు. అతను గుండారంపల్లె దవాఖానాలో వైద్యుడిగా పని చేస్తున్నారు. తన ఇంట్లోకి నీళు రావడంతో.. రంధ్రం చేస్తుండగా గోడకూలి పైన పడటంతో అక్కడికక్కడే మృతిచెందారు. బీబీపేట జనగామ గ్రామానికి చెందిన కప్పెర రాజిరెడ్డి(60) బుధవారం సాయంత్రం ఎడ్లకట్టవాగులో గల్లంతయ్యారు. మృతదేహాన్ని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం వెలికితీశారు. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామంలోని ఎడ్లకట్ట వాగులో ఓ వ్యక్తి గల్లంతయ్యారు.

# వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు..రాష్ట్ర రుణభారం పెంచుతున్నరు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అయితే, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక ఈ వాదన తప్పు అని తేల్చిందని స్పష్టం చేశారు. వాస్తవానికి, గత నాలుగు నెలల్లో సగటు- నెలవారీ వడ్డీ చెల్లింపు కేవలం రూ.2,300 కోట్లు-మాత్రమేనని (4 నెలల్లో రూ.9,355 కోట్లు-) పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర రుణభారాన్ని ఎక్కువ చేసి చూపిస్తుందని విమర్శించారు. తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టించే ఈ దుష్ప్రచారాన్ని వెంటనే ఆపాలని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రజల జీవనం స్తంభించిపోయిందని కెటిఆర్ అన్నారు. ఈ వర్షాల వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తినష్టం జరిగిందని, ప్రజలు సహాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల కష్టాలను పట్టించుకోకుండా, విలాసవంతమైన, లాభదాయకమైన ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. రూ.3,50,000 కోట్ల 2036 ఒలింపిక్స్ నిర్వహణ, రూ.1,50,000 కోట్ల మూసీ సుందరీకరణ, రూ. 225 కోట్ల హైదరాబాద్ బీచ్ ప్రాజెక్టుల గురించి చర్చలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల గోడును గాలికొదిలేసి, డబ్బు సంపాదించే పనులపైనే రేవంత్ అండ్ కో దృష్టి పెట్టిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గు లేకుండా వ్యవహరిస్తుందని, ఇది ప్రజా పాలన కాదని ట్వీట్ చేశారు. కష్టాలను అధిగమించి మనకు స్ఫూర్తినిచ్చిన అద్భుతమైన క్రీడాకారులను మనం గౌరవించుకోవాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్ చంద్ జయంతిని గుర్తు చేసుకుంటూ కెటిఆర్ ట్వీట్ చేశారు. ఆటలు మనకు సహకారం, పోరాట స్ఫూర్తిని నేర్పిస్తాయని అన్నారు. 'మనం కిందపడితే అది ముఖ్యం కాదు, మళ్లీ ఎలా పైకి లేచామన్నదే ముఖ్యం' అని పేర్కొన్నారు.

# సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై 'ప్రగతి'కి కొత్తదారులు

ఉపాధికి భరోసా లేని రోజులన్నీ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను తీవ్ర భయాందోళనలో ముంచి వేసిన పరిస్థితులు. రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను 'ప్రగతి' పథంలో నడిపేందుకు వేస్తున్న కొత్తదారులు ఇటీవల సాక్షాత్తు చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తోపాటు జిల్లా ఇంచార్జ్ మంత్రి వడ్లూరి లక్ష్మణ్, ఇచ్చిన మాట భరోసాతో నేతన్నల్లో ఆశలు చిగురుస్తున్నాయి. ఇటీవల సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని పరిణామాలపై 'జనంసాక్షి' ప్రత్యేక కథనం..

- కార్మికుల జీవనంలో వెలుగు నింపనున్న 'థ్రిఫ్ట్' పథకం
- నేత కార్మికులకు రుణమాఫీ
- బ్యాక్ బిల్లింగ్ పై ఊరట
- నేతన్నల నిరంతర ఉపాధి కోసం సర్కారు ఉపాయం



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి) :** టెక్స్ టైల్ రంగంలోని దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో సిరిసిల్లకు ప్రత్యేక స్థానం ఉంది. అత్యధిక మరమగ్గాలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాలతో అనేక మంది కార్మికులకు ఉపాధికి కేంద్రంగా ఉంది. మరమగ్గాల తో పాలిస్టర్, కాటన్ తో పాటు సైజింగ్ డైయింగ్ అనుబంధ పరిశ్రమలతో పలువురు ఉపాధి పొందుతున్న విషయం తెలిసిందే. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అనేక గండాలను దాటుకుంటూ వస్తుందనే చెప్పాలి. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలు కొన్నాడు 40 వేల పై చిలుకు మరమగ్గాలతో కలకల్లాడిన సిరిసిల్ల ప్రస్తుతానికి సుమారు 25వేల మరమగల స్థాయికి పడిపోయింది. డైయింగ్, సైజింగ్ పరిశ్రమలు ఉనికి కోసం పోరాడుతున్నాయి. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చేయూత ఇవ్వాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం అందించిన "బతుకమ్మ చీరల ఆర్డర్ "కొంత మేరకు కార్మికులకు ఉపాధి దొరికినా పూర్తిస్థాయిలో పరిశ్రమకు భద్రత అందించలేక పోయింది.

ప్రభుత్వం మారిన క్రమంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో అన్ని రంగాల పరిస్థితి రోజురోజుకు సంక్షోభాల దెబ్బతో ఉనికిని కాపాడుకోలేని దశకు చేరుకున్నాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కూడా తమ వైపు ఆలోచించడం లేదన్న ఆందోళన పరిశ్రమను కొంతకాలం వెంటాడింది. అనూహ్యంగా ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ , కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కే.కే. మహేందర్ రెడ్డిలు సిరిసిల్ల నేతనుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వానికి నివేదిస్తూ రావడం రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై దృష్టి సారించడంతో, పరిశ్రమకు జీవ సత్వాలు అందించేందుకు ప్రయత్నించడం పట్ల సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు సంబంధించిన అన్ని వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

**కొత్త చూపుతో..**

రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభాలకు తావు లేకుండా చేయాలన్న ఉద్దేశం కాగా ప్రధానంగా పరిశ్రమలో ఉన్న మధ్యతరగతి దిగువ తరగతి శ్రేణులు లబ్ధి పొందాలనే ఉద్దేశంతో మార్పుకు శ్రీకారం చుట్టింది. రానున్న రోజుల్లో ఫలితాలు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రగతి వైపు నడిచేందుకు దోహదం చేస్తాయన్న నమ్మకం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని అన్ని వర్గాల్లో కనిపిస్తుంది. గతంలో రాష్ట్రంలోని పాలకులు బకాయిలు పెట్టి పోయిన బతుకమ్మ చీరల బకాయి బిల్లులు సుమారు వెయ్యి కోట్ల రూపాయలను దశలవారీగా ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వం చెల్లించినట్లు చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిరిసిల్ల లో పర్యటించిన సందర్భంగా ప్రస్తావించిన విషయం తెలిసిందే.

**నూలు బ్యాంక్ ఏర్పాటుతో చిగురించిన ఆశలు..**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సహకార సంఘాల సభ్యులకు ప్రత్యేకంగా నూలు అందించేందుకు 50 కోట్లతో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని హనుమాజీపేట లో ప్రత్యేకంగా నూలు బ్యాంకు ఏర్పాటు చేసింది. ప్రధానంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో మూడంచెల వ్యవస్థలో పై మెట్టులో యజమానులు, రెండవ మెట్టులో ఆసాములు (యజమానులపై ఆధారపడ్డ చిరు వ్యాపారులు) చివరి మెట్టు లో కార్మికులు ఉంటారు. మొత్తంగా వ్యవస్థ కొంతమంది పెట్టుబడి దారుల చేతుల్లో ఉండిపోవడాన్ని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం "నూలు బ్యాంకు" ఏర్పాటు ద్వారా ప్రభుత్వ ఆర్డర్లను ఇవ్వడమే కాకుండా నూలు బ్యాంకు ద్వారా మర మగ్గాల సహకార సంఘాలకు నూలు అందుబాటులో ఉంచడం ద్వారా భవిష్యత్ రీత్యా పరిశ్రమలో పెనుమార్పులు వచ్చేందుకు దోహదం చేయనున్నాయి. ఈ పరిణామాలతో సిరిసిల్ల నేతన్నల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

**'బ్యాక్ బిల్లింగ్'పై ఇచ్చిన మాట భవిష్యత్తుపై భరోసా..**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు గతంలో ప్రభుత్వాలు ఉమ్మడి రాష్ట్రంలోని పరిశ్రమకు అవసరమైన విద్యుత్తు 50% సబ్సిడీతో ప్రభుత్వాలు కొనసాగిస్తూ వస్తున్నాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేసిన కొన్ని మార్పులు పరిశ్రమకు శాపంగా మారాయని కొందరు వస్త్ర పారిశ్రామికులు తెలిపారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల, పరిశ్రమకు సంబంధించిన విద్యుత్ మీటర్ల విషయంలో కేటగిరి మార్పు చేయడం వల్ల అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పరిశ్రమలోని అనేకమందికి భారంగా మారాయి. అప్పటినుండి ఇప్పటిదాకా విద్యుత్ భారం విషయంలో ప్రభుత్వాలకు నేతన్నలు మొరపెట్టుకుంటూ వస్తూ ఉన్నారు. కొంత సమయం వెసులుబాటు కల్పించినా బిల్లులభారం మాత్రం అలాగే పేరుకుంటూ పోతూ వస్తుంది. ఇప్పటికే సుమారు 30 కోట్లకు పైగా "బ్యాక్ బిల్లింగ్"భారం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను వెంటాడుతుంది. ఈ విషయంలో ప్రభుత్వంతో చర్చించి మాఫీ చేసేలా చూస్తామని సాక్షాత్తు చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇవ్వడం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ భవిష్యత్తుకు భరోసా ఇచ్చినట్ల యింది.

**'రుణమాఫీ' విషయంలో..**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో రైతు రుణమాఫీ మాదిరిగానే నేతన్నలకు రుణమాఫీ చేస్తామంటూ ఇటీవల సిరిసిల్ల పర్యటనలో మంత్రి హామీ ఇవ్వడం వస్త్ర పరిశ్రమలోని అన్ని వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతుంది. అన్ని రంగాల కార్మికులకు సంబంధించి ఈ మేరకు బ్యాంకులలో రుణాలు ఏ మేరకు ఉన్నాయో లెక్కలు తీయాలంటూ, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వంతో చర్చిస్తానంటూ మంత్రి హామీ తో నేతన్నల్లో మరింత భరోసాను అందించినట్టయ్యింది.

**థ్రిఫ్ట్ పథకంలో వెలుసుబాటు...**

ప్రధానంగా మూడు సంవత్సరాల పరిమితి గల థ్రిఫ్ట్ స్కీములో సిరిసిల్ల నేత కార్మికుల కోసం ప్రత్యేకంగా రెండు సంవత్సరాలు కాల పరిమితిలోనే పూర్తయ్యేలా త్వరలో పథకాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్ ప్రకటించడం ప్రధానంగా వస్త్ర పరిశ్రమలో కింది మెట్టులో ఉన్న నేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్న పరిస్థితి.

**ఇక సిరిసిల్ల నేతన్నలకు చేతినిండా పని..**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నిరంతరం వెంటాడుతున్న ఉపాధి పట్ల నేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా అందించింది. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రాన్ని సిరిసిల్ల నేత కార్మికుల నుంచి తయారు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సిరిసిల్ల పర్యటనలో మంత్రి తెలియజేశారు. ఇకనుండి అన్ని ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రాన్ని అధికారికంగా అందించి కార్మికులకు ఉపాధి పట్ల గ్యారంటీ కల్పించనున్నట్లు మంత్రి తెల్పడం ఆదిశగా ఇప్పటికే పనులు ప్రారంభం కావడం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రగతి వైపు అడుగులు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త దారులు వేసిందనే ఆశాభావం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని అన్ని వర్గాల్లో వ్యక్తం అవుతుంది.

# సీఎం ప్రజావాణిలో 235 దరఖాస్తులు

- దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 235 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 112, రెవెన్యూ శాఖకు సంబంధించి 42, విద్యుత్ శాఖకు 10, ఇందిరమ్మ ఇండ్ల కోసం 33, దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 38 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.



# ఆకట్టుకుంటున్న కర్ర వినాయకుడు

**నిర్మల్ రూరల్, ఆగస్టు29 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పట్టణ విశ్వబ్రాహ్మణ కర్ర పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి కర్ర వినాయకుడు నిత్యం ఘనంగా పూజలు అందుకుంటున్నారు.ప్రతి సంవత్సరం వినాయక చవితిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో కర్ర వినాయకునికి అత్యంత ఘనంగా వినాయక నవరాత్రులు నిర్వహిస్తున్నారు.తొమ్మిది రోజులపాటు నిత్యం స్వామి వారికి పూజలతో పాటు యజ్ఞాధి కార్యక్రమాలు,నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.కర్ర వినాయకుడిని దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు.కర్ర పారిశ్రామిక సంఘం పట్టణ అధ్యక్షులు చిలమంతుల రాజలింగం,ప్రధాన కార్యదర్శి కొలిపాక అంజయ్య లు మాట్లాడుతూ పాలాజ్ గ్రామంలో వెలిసినటువంటి కర్ర గణపతి విగ్రహం స్ఫూర్తిగా ప్రకృతి సిద్ధమైన టేకు కర్రతో భారీ సింహాసనం పై ఆరు అడుగుల కర్ర గణపతిని 2016లో చేయించడం జరిగిందని వారు తెలిపారు.ఆనాటి నుండి ప్రతి సంవత్సరం వినాయక నవరాత్రులలో కర్ర వినాయకునికి భక్తులు విశేషంగా పూజలు నిర్వహిస్తున్నారని తెలిపారు.భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారంగా కర్ర వినాయకుడు విరాజిల్లుతున్నారని తెలిపారు.ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా నియామకమైన కర్ర పారిశ్రామిక సంఘం గౌరవ సభ్యులు,కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం డైరెక్టర్ వన్నెపని శివకుమార్ ను శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కర్ర పారిశ్రామిక సంఘం సభ్యులు బ్రహ్మయ్య,వంశీ,తదితరులు ఉన్నారు

# సరూర్‌నగర్‌లో మరో భర్త హంతకురాలు

## ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య

**హైదరాబద్, ఆగస్ట్29 (జనంసాక్షి) :** ఈ మధ్యకాలంలో ప్రియుడితో కలిసి భర్తలను హతమారుస్తున్న భార్యల కేసుల సంఖ్య పెరుగుతోంది. తాజాగా అలాంటి ఘటన మరోటి చోటుచేసుకుంది. కొందరు పెళ్లికి ముందు ప్రేమ వ్యవహారం కారణంగా భర్తలను హత్య చేస్తుంటే.. మరికొందరు పెళ్లి తర్వాత వివాహేత సంబంధం పెట్టుకొని భర్తలను కడతేరుస్తున్నారు. తాజాగా నగరంలోని సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇలాంటి దారుణమే చోటు-చేసుకుంది. కోదండరామ్‌నగర్‌లో ప్రియుడు హరీశ్‌తో కలిసి భార్య.. భర్తను చంపేసింది. నాగర్‌కర్నూల్‌కు చెందిన శేఖర్, చిట్టిలకు 16 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. బతుకుదెరువు కోసం వీరిద్దరు హైదరాబాద్.. సరూర్‌నగర్‌కు వలస వచ్చి జీవిస్తున్నారు. శేఖర్ ప్రైవేటు- డ్రైవర్ కాగా.. చిట్టి ఇళ్లలో పని చేసేది. తాజాగా భర్త శేఖర్ వివాహేతర సంబంధం గురించి చిట్టిని నిలదీయడంతో అతన్ని హత్య చేయాలని కుట్ర పన్నింది. అర్ధరాత్రి ప్రియుడు హరీశ్‌ని ఇంటికి పిలిపించి నిద్రలో ఉన్న భర్తను హత్య చేసింది. ఆ తర్వాత 100కు ఫోన్ చేసి నిద్రలోనే భర్త చనిపోయాడని భార్య చెప్పింది. అయితే పోలీసులకు భార్యపై అనుమానం రావడంతో తమదైన శైలిలో ప్రశ్నించారు. దీంతో విచారణలో భార్య చిట్టి నేరం అంగీకరించింది. దీంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న చిట్టి ప్రియుడు హరీశ్ గురించి పోలీసులు గాలిస్తున్నారు.

# మూసీనదికి పెరిగిన వరద

- మంచిరేవుల వద్ద బ్రిడ్జిపై నుంచి ప్రవాహం
- ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మూసివేత



**హైదరాబాద్, ఆగస్ట్29 (జనంసాక్షి) :** ఎగువ నుంచి జంట జలాశయాలకు భారీగా వరద వస్తున్నది. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు పూర్తిస్థాయిలో నిండటంతో జలమండలి అధికారులు ఉస్మాన్‌సాగర్ 8 గేట్లు ఎత్తారు. మూసీ నదిలో వరద ఉధృతి పెరగడంతో మంచిరేవుల బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహిస్తున్నది. ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ.. నార్సింగి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మూసివేసారు. మూసీ నదిలో వరద ఉధృతి పెరగడంతో మంచిరేవుల బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహిస్తున్నది. అప్రమత్తమైన అధికారులు నార్సింగి వద్ద ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డును మూసివేశారు. సర్వీస్ రోడ్డు ఎంట్రీ, ఎగ్జిట్‌ను మూసివేడంతో మంచిరేవుల-నార్సింగి మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు ఇతర మార్గాల ద్వారా వెళ్లాలని అధికారులు సూచించారు. ఉస్మాన్‌సాగర్ జలాశయానికి 900 క్యూసెక్కుల వరద వస్తున్నది. దీంతో ఎనిమిది గేట్లు- ఎత్తి 4,096 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఉస్మాన్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1790 అడుగులు. ప్రస్తుతం 1789.45 అడుగుల వద్ద ఉన్నది. అదేవిధంగా హిమాయత్‌సాగర్ జలాశయానికి 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో 3 గేట్లు ఎత్తి 2,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1763.50 అడుగులు. కాగా, ప్రస్తుతం 1762 అడుగులు నీటిమట్టం ఉన్నది.

# సెప్టెంబర్ 1 నుంచి రేషన్ డీలర్ల ఆందోళన!

- కమీషన్ చెల్లింపులో నిర్లక్ష్యంతో నిర్ణయం




**హైదరాబాద్, ఆగస్ట్ 29 (జనంసాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్లకు రావలసిన కమిషన్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉచిత బియ్యం పథకాన్ని విజయవంతం చేసినట్లు గొప్పలు చెప్పకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం డీలర్ల కమిషన్ డబ్బులు ఇవ్వడంతో తీవ్ర జాప్యం చేస్తోందని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు ఆరోపించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని రేషన్ షాప్‌ల బంద్ నిర్వహిస్తున్నట్లు, సెప్టెంబర్ 4వ తేదీన అసెంబ్లీ ముట్టడిస్తామని ఆయన గురువారం సివిల్ స్లపై భవన్ వద్ద ఆయన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు నెలల నుంచి డి రేషన్ డీలర్లకు కమిషన్ డబ్బులు, రెండు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న గన్ని బ్యాగ్స్ డబ్బులు రావడంలేదన్నారు. దీంతో రేషన్ డీలర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆగస్టు 31వ తేదీ వరకు రేషన్ డీలర్లకు కమిషన్ డబ్బులు విడుదల చేయకుంటే సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రేషన్ షాపులు మూసివేసి తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నాలు చేస్తామన్నారు. రెండో తేదీన ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా, మూడో తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. చివరకు సెప్టెంబర్ నాల్గొవ తేదీన రాష్ట్రంలోని రేషన్ డీలర్లతో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు, కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వంగరి నాగరాజు, మల్లికార్జున్ గౌడ్, వైకుంఠం, అజిజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఓరియంట్ అదాని సిమెంట్ ఎన్నికల్లో సత్యపాల్ రావు ఘనవిజయం



**కాసిపేట ఆగస్టు 29 (జనం సాక్షి) :** కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ అదాని సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో సత్యపాల్ రావు ఘన విజయం సాధించారు ప్రత్యర్థి అభ్యర్థి విక్రం రావు పై 33 ఓట్ల తేడాతో గెలుపొందారు. హోరా హోరీగా సాగిన ఈ పోరులో మొత్తం 266 ఓటర్లకు గాను 265 ఓట్లు పోలవగా, 9 మంది సీల్డ్ కవర్ ఓటర్ల అవసరం లేకుండానే ఫలితం వెలువడింది. ముందస్తుగానే ఓటర్లను క్యాంపుకు తరలి వెళ్ళిన వర్గాలు ఉదయం ఓటర్లను ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకువచ్చారు. ఒకేసారి మూడు ప్రత్యేక బస్సుల్లో తీసుకొని రాగా విక్రమ్ రావు వర్గం అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎవరిని వారు చేదరవేసి ఓటర్లను పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకెళ్లారు. ఉదయాన్నే కార్మిక శాఖ పోలింగ్ సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి ఇబ్బందులు లేకుండా ఒకరినో కరుగా పోలింగ్ కేంద్రంలోకి అనుమతిచ్చారు. ఏలాంటి అవంచనీయమైన సంఘటన జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం మూడు గంటలకు ముగియగా లెక్కింపు ప్రక్రియ చేపట్టిన కార్మిక శాఖ ఐదు గంటలకు ఫలితం వెలువడింది. విజయం సాధించిన అభ్యర్థి సత్యపాల్ రావు వర్గం నాయకులు బాణా సంచాలు కాలుస్తూ ర్యాలీ చేస్తూ సంబరాలు చేసున్నారు. ముందు నుంచే ఈ ఎన్నికను జిల్లా మంత్రి గడ్డం వివేక్,ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వెడ్మా బొజ్జు, ఒక వర్గంగా ఏర్పడి ఉమ్మడి అభ్యర్థిని విక్రమ్ రావు ను దించగా.. వీరికి పోటిగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తన సోదరుడు కొక్కిరాల సత్యపాల్ రావును పోటీలో ఉంచారు. ఎట్టకేలకు ఈ ఫలితాల్లో ప్రేమ్ సాగర్ రావు వర్గం విజయం సాధించి జిల్లా రాజకీయాల్లో మరో మరు సత్తా చాటారు.

# బీజేపీ జూబ్లీహిల్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, ఆగస్ట్ 29 (జనంసాక్షి) :** రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు నేడు ఐదుగురు సభ్యులతో కూడిన మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. బిజెపి శాసనసభ పక్ష ఉప నాయకులు పాయల్ శంకర్, పార్లమెంట్ సభ్యులు ఎం రఘునందన్ రావు, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు పార్లమెంట్ సభ్యులు గరికపాటి మోహన్ రావు, మాజీ శాసనసభ్యులు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి, బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు తదితరులతో కమిటీని ఏర్పాటు చేశారు.

# ఏసీబీకి పట్టుబడ్డ తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి



**వరంగల్/కరీంనగర్, ఆగస్ట్ 29 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లా ఖిలావరంగల్ తహసిల్దార్ బండి నాగేశ్వర్ రావు ఇంటిపై అవినీతి నిరోధక శాఖ ఏసీబీ అధికారులు దాడులు చేశారు. హనుమకొండ ప్రశాంత్ నగర్ లోని ఆయన ఇంటిపై వరంగల్ ఏసీబీ అధికారులు ఉదయం నుంచి సోదాలు చేపట్టారు. తహసిల్దార్ నాగేశ్వరరావు సొంత జిల్లా ఖమ్మంలో సైతం ఏసీబీ సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. సోదాల్లో భారీగా నగలు పట్టుబడినట్లు సమాచారం.

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూర్ గ్రామం లో ఇంటి నెంబర్ అలాట్ చేయడానికి ఇరువై వేల రూపాయలు లంచం డిమాండ్ చేశాడు పంచాయతీ కార్యదర్శి నాగరాజు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు బాధితుడు. చెప్పిన టైం లో డబ్బులు ఇవ్వాల్సిందిగా చెప్పిన అధికారులు.. బాధితుడి నుంచి రూ. 25 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హండెడ్ గా పట్టుకున్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రజా పాలన ద్వారా ప్రజల సంక్షేమానికి కృషి
- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 29 (జనంసాక్షి) :** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రజా సంక్షేమానికి ప్రజా పాలన ద్వారా కృషి చేయడం జరుగుతుందని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల గోదావరి నది తీరంలో వరద నీటి పరిస్థితి, మాతా శిశు ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ ....ప్రభుత్వం ప్రజా పాలన ద్వారా ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని అన్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు లోనికి 7 లక్షల నుండి 8 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరిందని తెలిపారు. నది తీర ప్రాంతాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో రక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వరదల కారణంగా ప్రతి సంవత్సరం మాత శిశు ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న గర్భిణీలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిసారి వారి సంక్షేమం కోసం ఇతర ఆసుపత్రులకు తరలించడం బాధాకరమని తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్మాణం అవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి పూర్తి అయిన తర్వాత మాతా శిశు ఆసుపత్రిని తరలించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాతా శిశు ఆసుపత్రి నుండి తరలిస్తున్న గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు వస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో వరద పరిస్థితులపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు స్పందిస్తూ అవసరమైన ప్రజా రక్షణ చర్యలు చేపడుతున్నారని, ఇందులో భాగంగా ఎయిర్ సర్వే నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో అవసరమైన నిధులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ ఆర్ ఎస్ పి ప్రాజెక్ట్ నుండి 5.50 లక్షల క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుండి 50 వేల క్యూసెక్కుల వరద నీటితో పాటు జిల్లాలోని వాగులు, చెరువుల నుండి అదనంగా దాదాపు 2 లక్షల క్యూసెక్కుల నీటిని కలుపుకొని 8 లక్షల క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టులోనికి ఇన్ ఫ్లో అవుతుందని తెలిపారు.

అనంతరం జిల్లాలోని జైపూర్ మండలం కిష్టాపూర్, వేలాల గ్రామాలలో వరద నీటి కారణంగా ముంపుకు గురైన పంట పొలాలను పరిశీలించారు. భారీ వర్షాలతో వరద నీటి కారణంగా నీట మునిగిన పంటల వివరాలు, సంబంధిత రైతుల వివరాలతో పూర్తి స్థాయి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. నివేదికలో అర్హులైన రైతుల వివరాలు మాత్రమే ఉండాలని, నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో యూరియా, ఇతర ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని, కార్యాచరణ ప్రకారం అందించడం జరుగుతుందని, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలిపారు. వేలాల గ్రామ సమీపంలోని గోదావరి నది తీరాన్ని పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ టారిఫ్ దెబ్బకు ఆర్థిక వ్యవస్థ కుదేలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ నుంచి దిగుమతులపై 50 శాతం టారిఫ్‌లు విధించడం, భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బగా మారింది. రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నందుకు శిక్షగా ఈ టారిఫ్‌లు విధించారు. మునుపటి 25 శాతం టారిఫ్‌లను రెట్టింపు చేయడం ద్వారా, అమెరికా-భారత్ వాణిజ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతులు సుమారు 87 బిలియన్ డాలర్లు ఉంటుంది. ఇందులో 55 శాతం వరకు ప్రభావితమవుతుందని ఎక్స్‌పోర్టర్ సంఘాలు అంచనా వేస్తున్నాయి. జెఫరీస్ ఆర్థిక విశ్లేషకుడు క్రిస్ వుడ్ ప్రకారం, ఈ 'డ్రాకోనియన్' టారిఫ్‌ల వల్ల భారత ఆర్థిక వ్యవస్థకు 55-60 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లవచ్చు. అమెరికా ఎగుమతులు భారత జీడీపీలో 2.2 శాతం వాటా కలిగి ఉండటంతో, ఈ టారిఫ్‌లు జీడీపీ పెరుగుదలను 0.6-1 శాతం తగ్గించవచ్చని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం సంఖ్యల సమస్య కాదుబీ లక్షలాదిమంది ఉద్యోగాలు, చిన్న వ్యాపారాలు, ఆర్థిక స్థిరత్వం ప్రమాదంలో పడతాయి.

ట్రంప్ టారిఫ్‌లు భారత్‌లోని పలు రంగాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా లేబర్-ఇంటెన్సివ్ రంగాలు అత్యంత ఎక్కువగా దెబ్బతింటాయి. టెక్స్‌టైల్స్ మరియు అప్పారెల్ రంగాలకు అతి పెద్ద దెబ్బ తగులుతుంది. భారత్ నుంచి అమెరికాకు టెక్స్‌టైల్ ఎగుమతులు సుమారు 12 బిలియన్ డాలర్లు, ఇందులో మిలియన్ల మంది కార్మికులు పని చేస్తున్నారు. టారిఫ్‌లు 5.8 శాతం నుంచి 55.8 శాతానికి పెరగడంతో, కంపెనీలు లాభాలు తగ్గి, కార్మికుల ఉద్యోగాలు కోల్పోవచ్చు. ఉదాహరణకు, తిరుపూర్, బెంగళూరు ప్రాంతాల్లోని చిన్న ఫ్యాక్టరీలు ఇప్పటికే ఆర్డర్లు తగ్గుతున్నాయని రిపోర్టులు చెబుతున్నాయి. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) అంచనాల ప్రకారం, ఈ రంగంలో 5-7 లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నాయి.

జెమ్స్ అండ్ జ్యువెలరీ రంగానికి కూడా పెద్ద మొత్తంలో నష్టం జరగనుంది. సురత్, ముంబై, జైపూర్‌లలో మిలియన్ల మంది డైమండ్ కట్టర్లు, జ్యువెలరీ మేకర్లు ఉన్నారు. టారిఫ్‌లు 2.1 శాతం నుంచి 52.1 శాతానికి పెరగడంతో, 8-10 బిలియన్ డాలర్ల ఎగుమతులు ప్రభావితమవుతాయి. కంపెనీలు లాంటి టైటాన్, గోల్డ్ స్టార్ జ్యువెలరీ వంటివి షేర్ మార్కెట్‌లో దెబ్బతిన్నాయి. సీఫుడ్ మరియు లెదర్ రంగాలు కూడా తీవ్రంగా దెబ్బతింటాయి. ష్రింప్ పీలింగ్ యూనిట్లలో లక్షలాది మహిళా కార్మికులు ఉద్యోగాలు కోల్పోవచ్చు. కెమికల్స్, ఆటో పార్ట్స్ రంగాల్లో 4-5 బిలియన్ డాలర్ల నష్టం అంచనా. అయితే, స్టీల్, అల్యూమినియం,కాపర్ వంటివి 25 శాతం వద్దే ఉండటం కొంత ఊరట. స్మార్ట్‌ఫోన్స్, ఫార్మా, ఎనర్జీ రంగాలు మినహాయింపు పొందాయి. ఇవి భారత్ నుండి 20 బిలియన్ డాలర్లకు పైగా ఎగుమతులు ఉంటాయి.

విశ్లేషణాత్మకంగా పరిశీలించి చూస్తే, ట్రంప్ టారిఫ్‌లు అమెరికా ప్రొటెక్షనిజం యొక్క క్రూరత్వం కనపడుతుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ తటస్థతను శిక్షించడం ద్వారా, ట్రంప్ అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని దెబ్బతీశారు. భారత్ అమెరికాపై అతిగా ఆధారపడి ఉండటం వల్ల మన ఎగుమతుల్లో 18 శాతం వాటాగా ఉండి ఈ సమస్యను తీవ్రతరం చేసింది. విమర్శనాత్మకంగా చూస్తే, మోదీ ప్రభుత్వం ముందుగా ఈ ప్రమాదాన్ని గుర్తించి, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సింది. అయితే, ఈ టారిఫ్‌లు అమెరికా వినియోగదారులకు కూడా భారమవుతాయి. భారత్ నుంచి చౌకైన వస్తువులు కాస్త ఇప్పుడు ఖరీదవుతాయి. అమెరికాలో కూడా ఇన్‌ఫ్లేషన్ పెరుగుతుంది. భారత్‌లో బెంగాల్ బేసిన్, అండమాన్ ప్రాంతాల్లో సీఫుడ్ రంగం బాగా దెబ్బతింటున్నప్పుడు, స్థానిక ఆర్థిక వ్యవస్థలు కూడా కుదేలు కాక తప్పదు. ఇప్పటికే ఈ నష్టం ఆందోళన కలిగిస్తోంది. మొత్తంగా, ఈ టారిఫ్‌లు గ్లోబల్ ట్రేడ్‌ను విచ్ఛిన్నం చేసి, ఆర్థిక మాంద్యానికి దారితీస్తాయి.

**కొన్ని ఉపశమన పరిష్కార మార్గాలు:**

నష్ట నివారణా చర్యలు అత్యవసరంగా తీసుకోవాలి. ముందుగా, "ఆత్మనిర్భర్ భారత్" ను బలోపేతం చేయాలి. దేశీయ డిమాండ్‌ను పెంచడానికి జీఎస్‌టీ రేట్లను 5 శాతం లేదా 18 శాతానికి తగ్గించాలి. ఇది వినియోగాన్ని పెంచి, ఎగుమతి నష్టాన్ని కొంత మేరకు భర్తీ చేస్తుంది. రెండవది, ఎగుమతి వైవిధ్యీకరణ: చైనా, రష్యా, బ్రెజిల్ వంటి కొత్త మార్కెట్లను వేగంగా అన్వేషించాలి. మూడవది, అమెరికాతో చర్చలు: మినహాయింపుల కోసం డిప్లమాటిక్ ప్రయత్నాలు కొనసాగించాలి. మినీ ట్రేడ్ డీల్‌లు కుదుర్చుకోవాలి. నాలుగవది, రంగాల వారీగా సబ్సిడీలు: టెక్స్‌టైల్, జ్యువెలరీ రంగాలకు ప్రోత్సాహకాలను ఇవ్వాలి, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లతో కార్మికులను రీస్కిల్ చేయాల్సి ఉంటుంది. చివరగా, దీర్ఘకాలికంగా భారత్ తన ఆర్థిక విధానాన్ని సమీక్షించి, సింగిల్ మార్కెట్ ఆధారిత విధానాన్ని తగ్గించు కోవాలి. ఈ సవాలు భారత్‌ను మరింత బలోపేతం చేసే అవకాశంగా మార్చుకోవాలి. భారత్ ఆర్థికంగా కొంత పుంజుకున్న తర్వాత అమెరికా పై ప్రతీకార చర్యలు తీసుకోవాలి



డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్
9849328496

# ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు క్రిమిలేయర్ కత్తి

*అసమానతలతో కూడిన భారతీయ సమాజంలో దళిత, గిరిజనులు తీవ్ర వివక్షతకు గురయ్యారు. ఈ క్రమంలో చారిత్రకంగా సమానత్వం కోసం అంబేద్కర్, పూలే ఉద్యమాలు చేశారు. సమాన అవకాశాలకు నోచుకోని ఆ వర్గాలకు భారత రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారు. ఇవీ సానుకూల వివక్షత కింద ఎస్సీ, ఎస్టీల ప్రాతినిధ్యానికి తోడ్పడతాయి. కానీ ప్రభుత్వ విధానాలు, కోర్టు తీర్పులు రిజర్వేషన్ల స్ఫూర్తినీ దెబ్బతీస్తున్నాయి.*

ఇటీవల సుప్రీంకోర్టులో దళిత, గిరిజనుల రిజర్వేషన్లలో క్రిమిలేయర్(సంపన్న శ్రేణి) తీసుకురావాలని ఎస్సీ, ఓబీసీ వర్గాలకు చెందిన పిటిషనర్లు సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేశారు. రిజర్వేషన్లు పొందే వర్గాల్లో ఆర్థికంగా నిలదొక్కుకున్న వారే లబ్ధి పొందడం వల్ల, అట్టడుగు స్థాయిలోని వారికి ఎదిగే అవకాశమే రావడం లేదని పిటిషనర్లు పేర్కొన్నారు. అందరికీ సమానమైన, న్యాయమైన రిజర్వేషన్లు దక్కేందుకు విధానాలు తీసుకురావాలని వారు కోరారు. ఓబీసీల మాదిరిగా ఆదాయం ప్రాతిపదికన రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అక్టోబర్ 10లోగా వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. గత ఏడాది సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై దేవేందర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ తీర్పులో క్రిమిలేయర్ వర్తింపచేయాలని సూచించింది. ఇక్కడ కోర్ట్ ను ఎస్సీ ఉప వర్గీకరణ అడుగుతే ఉపవర్గీకరణతో పాటు క్రిమిలేయర్ అనే కత్తిని మెడపై వేలాడదీసింది. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ ఉప వర్గీకరణ చేయడానికి నియమించిన జస్టిస్ శమీమ్ అక్తర్ కమిషన్ సైతం క్రిమిలేయర్ ను సిఫార్సు చేసింది. ఎస్సీ, ఎస్టీలను సంపన్న శ్రేణి కింద వర్గీకరించడం వలన ఆ వర్గాల భావి రిజర్వేషన్లపై ప్రభావం పడనుంది. ఆ కులాల్లో అంతర్గత కలహాలు సృష్టించే ప్రమాదం ఉందని దళిత మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**క్రిమిలేయర్‌తో పొంచి ఉన్న ముప్పు.**

భారతదేశంలో రిజర్వేషన్లు అనేవి సామాజిక, విద్యా, ఆర్థికపరమైన అంతరాల పూడ్చడానికి తీసుకువచ్చారు. దేశంలో వెనుకబాటుతనం అనేది ఆయా కులాలను బట్టి మారుతుంది. దళితులు ఊరవతల ఉంటూ అస్పృశ్యత, అంటరానితనంతో బాధపడుతూ సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వివక్షతను ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో వారికి విద్య, ఉద్యోగాల్లో 15 శాతం రిజర్వేషన్ కల్పించారు. గిరిజనులు సమాజానికి దూరంగా అడవిలో జీవిస్తూ అభివృద్ధికి నోచుకోలేదు. వీరి ఉన్నతికి 7.5 శాతం రిజర్వేషన్ కల్పించారు. మరోవైపు వెనుకబడిన వర్గాలకు సైతం వెనుకబాటుతనం ఆధారంగా 27 శాతం రిజర్వేషన్స్ కల్పించారు. ఇవి వారి ఆర్థిక స్థితిగతులతో అనుసంధానించారు. 1992 ఇంద్ర సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పులో ఇతర వెనుకబడిన వర్గాలకు (%ాదీజ%) 27 శాతం కేంద్ర ప్రభుత్వ రిజర్వేషన్ చెల్లుబాటు అవుతుందని తీర్పు ఇచ్చింది. మొత్తం రిజర్వేషన్లకి 50 శాతం కోటా పరిమితిని విధించింది. దీనితో పాటు క్రీమీలేయర్ విధానాన్ని ప్రతిపాదించింది. అయితే, కొన్ని రాష్ట్రాలు క్రీమీలేయర్ ఉనికిని తిరస్కరించాయి. అయినప్పటికీ 2006లో సుప్రీంకోర్టు ధ్రువీకరించింది. అప్పుడే ఎస్సీ, ఎస్టీలకు కూడా క్రిమిలేయర్ విస్తరించడంపై ఆలోచించారు. కానీ వారి సామాజిక వెనుకబాటుతనం వలన మినహాయించి, ఇతర వెనుకబడిన కులాలకు వర్తింప చేశారు. క్రిమిలేయర్ తో పొంచి ఉన్న ప్రమాదాన్ని చూస్తే... క్రిమిలేయర్ ప్రమాణాలను ప్రభుత్వాలు కాలానుగుణంగా మార్చవచ్చు. దీంతో రిజర్వేషన్ లబ్ధిని తొలగించవచ్చు, చేకూర్చవచ్చు. సంపన్న శ్రేణి ఆదాయ ప్రమాణాన్ని 1993లో రూ. లక్షగా నిర్ణయించారు. 2004లో రూ. 2.5.లక్షలు, 2008లో రూ. 4.5లక్షలు 2013లో రూ. 6లక్షలు మరియు 2017లో 8లక్షలుగా సవరించారు. పెరుగుతున్న ఆదాయం, ద్రవ్యోల్బణం ఆధారంగా ప్రతి మూడు సంవత్సరాలకు సవరించాలి. కానీ ఇప్పటివరకు మార్చలేదు. దీంతో చాలా మంది ఓబీసీ క్రిమిలేయర్ వర్గాలు రిజర్వేషన్ అవకాశాలకు దూరంగా ఉన్నారని ఇటీవల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొన్నది. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ లో క్రిమిలేయర్ ప్రస్తావన చర్చనీయాంశంగా మారింది. .




**రిజర్వేషన్లకు గండికొట్టే ప్రయత్నం.**

ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ తీసుకురావడం ఆదర్శనీయ భావనే అనిపించవచ్చు. కానీ ఇందులో ఉన్న లోసుగులు, అశాస్త్రియత వలన రిజర్వేషన్లు బలహీనపడే ప్రమాదం ఉంది. ప్రతిభ పేరుతో ఓపెన్ కోటాకు ఇప్పటికీ క్రిమిలేయర్ లేదు. ఆ కోటా కింద సెలెక్ట్ అయిన రిజర్వ్ వర్గాల వారి పిల్లలకు సంపన్న శ్రేణి కింద పరిగణించాల్సి వస్తుంది. దీంతో వారు రిజర్వేషన్ అవకాశాలకు దూరమవుతారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు ఆర్థిక స్థితిని బట్టి కాక సామాజిక వెలివేత ఆధారంగా కల్పించారు. ఆర్టికల్ 335 ప్రభుత్వ ఉద్యోగాలలో ఎస్సీ, ఎస్టీ జాతుల ప్రాతినిధ్యాన్ని ప్రోత్సహిస్తుంది. క్రిమిలేయర్ వారి ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తుంది. నేటి ఆధునిక యుగంలో ఇప్పటికీ ఒక దళిత ఉద్యోగి, అగ్రకుల ఉద్యోగికి మధ్య వివక్షత కనబడుతుంది. ఆర్థికంగా సమానమైనప్పటికీ సామాజిక వివక్షత తొలగలేదు. ఇది ఒక క్లర్క్ స్థాయి ఉద్యోగి నుంచి ఐఏఎస్ ఆఫీసర్ వరకు కొనసాగుతుంది. దళితులు బాగా చదివి ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ ఇల్లు అద్దెకు అడిగినప్పుడు, వివాహ విషయంలో కులానికే ప్రాముఖ్యత ఇస్తున్నారు. దళిత, గిరిజనులు రాజకీయ నాయకులకు వివక్షత తప్పడం లేదు. ఇంకా కులం పేరుతో దాడులు, అవమానాలు జరుగుతున్నాయి. మరోవైపు క్లర్కు, కానిస్టేబుల్, టీచర్ వంటి చిరు ఉద్యోగాలకు సైతం ఈ క్రిమిలేయర్ వర్తించడం వలన తక్కువ ర్యాంకు ఉద్యోగుల పిల్లలు రిజర్వేషన్లు కోల్పోయే ప్రమాదం ఉంది. క్రిమిలేయర్ ప్రమాణాల సవరణ ప్రభుత్వాల చేతిలో ఉండడంతో రిజర్వేషన్ లబ్ధి, మినహాయింపు ప్రభుత్వ విధాన నిర్ణయంగా మారిపోతుంది. ఇప్పటివరకు అట్టడుగు అణగారిన వర్గాలలో సాంస్కృతిక, సామాజిక, రాజకీయ చైతన్యం కల్పించినది ఈ క్రిమిలేయర్(ఉద్యోగస్తులే) వర్గాలే. క్రిమిలేయర్ వలన విద్యావంతునికి, ఉద్యోగస్తులు మధ్య చిచ్చు మొదలవుతుంది. ఇందులో అగ్రకుల రాజకీయ నాయకులు చొరబడి మరింత సామాజిక వైశ్యమ్యాలను రెచ్చగొడుతారు. నేడు దేశంలో కులం కేంద్రంగానే రాజకీయాలు, వ్యవస్థలను శాసిస్తున్నారు. ఈ క్రమంలో దామాషా రిజర్వేషన్ల కోసం డిమాండ్ల పెరుగుతున్నాయి. రాజ్యాంగం కూడా ఇదే చెబుతున్నది. దీంతో ఇటీవల కుల గణన సిద్ధాంతానికి బలం చేకూరుతుంది. ఇప్పటికే బీహార్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు కుల గణన సర్వేలు నిర్వహించాయి. దీంతో రిజర్వేషన్ లు, సామాజిక సంక్షేమంపై విధాన నిర్ణయాల మారాలని డిమాండ్ లు పెరుగుతున్నాయి. 1992 నాటి ఇంద్ర సాహ్నీ తీర్పు ద్వారా నిర్ణయించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి సవరించాలని ఆందోళనలు మొదలైనాయి. ఈ విధంగా కుల ప్రాతినిధ్యానికి ప్రాముఖ్యత పెరుగుతున్న నేపథ్యంలో ఆదాయ ప్రాతిపదికన రిజర్వేషన్ల భావన సామాజిక మినహాయింపుకు దారితీస్తుంది. సమాజంలో మరింత అంతరాలకు కారణమవుతుంది. ఇదీ రాజ్యాంగం పేర్కొన్న సామాజిక న్యాయానికి విరుద్ధం.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7989578428

## మార్నింగ్ వాక్...

ఒంట్లో కనిపించక దాగి
కాటికి దారి చూపే
కొవ్వును కరగ దీసేందుకు
సులభమైన తరుణోపాయం
బద్ధకాన్ని తరిమేందుకు
ప్రతినిత్యం పాటించే
అనాది కాలపు
అందరి ఆరోగ్య మంత్రం
వయోబేధం మరచి
ఆరు బయటకు కదిలి వెళ్ళి
ముచ్చట్ల కూడికగా సాగించే
సబ్బండుల ఆరోగ్యయాత్ర

డా. తిరునగరి శ్రీనివాస్
9441464764

## మేఘ విస్ఫోటం

భారతదేశానికి తల మాణికమైన
ఓ జమ్ము కాశ్మీర్ మా..
నీకు మనసారా ప్రణతులు
పెట్టని కోట గోడ లాంటి
నా హిమాలయ శృంగమా..
మీకు నా నమస్సుమాలు
ఏమి ఈ వైపరీత్యం
మీకేమైనా శని దోషమా? గ్రహచారమా ??
ఏమని భావించనో రమణీయమా..
నీ బిడ్డలు యాత్రలు చేయాలను కోవడం నేరమా?
దేవుళ్ళతో కొలువైన సామ్రాజ్యమా..
నిను ప్రేమించడం మాకు శాపమా ? లేక మాపై
కోపమా?
అమానుష ఉగ్రదాడుల అరాచకం మరువకముందే..
మేఘ విస్ఫోట కరాళ నృత్యం
మాతను చూడాలనే తహతహ తీరకముందే
విరుచుకుపడిన వరుణుడి విలయతాండవం
కూలుతున్న పర్వతాల వరద బురదలో
పామర కళేభరాల భయంకర దృశ్యం
ముసలి ముతక చిన్నా పెద్ద తేడా మరచి కభళిస్తున్న
మృత్యు కళాకేళి
వలవల రోదిస్తూ విలవిలలాడుతున్న పాప మెరుగని
ప్రాణులు
ఈ అకృత్యాన్ని చూసి పక్కలో భల్లెమైన
పొరుగు దేశ వికటాట్టహాసం
మరో ప్రక్క ప్రకృతి మాత విస్మయ బీభత్సం
ఇకనుండి ఆశ ఆశయాలకు సమాధే సమాధానం..
ఉత్తుంగ తరంగాలైన కోరికలకు మార్గం
శ్మశానమే..
ఓ అమాయక మిత్రులారా
మనకన్ని దిక్కులా శత్రు మూకలే?
మత్తు వదలి చిత్తు కాకముందే విపత్తుకు
సలామనండి
గృహసీమనే స్వర్గసీమగా భావించి
మనుగడ సాగించండి

రచన. నమిలకొండ. నాగేశ్వర్ రావు
8688553470 మేడ్చల్

# టెక్నాలజీ, స్వార్థం మధ్యలో మాతృత్వ పేగుబంధం తెగుతోంది

***ఆధునిక సమాజం వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక బాధ్యతల మధ్య ఎంతగానో నలిగిపోతుంది. నిజమైన స్వేచ్ఛకి పరిమితులుంటాయి. అవి లేని దాన్ని పెడ దోరణలు అంటారు. ఆధునిక టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తిలాంటిది. దానితో ప్రాణం తీయవచ్చు.. శస్త్ర చికిత్స చేసి ప్రాణం కాపాడవచ్చు. సామాజిక బాధ్యతలు గల పాలకులు,డాక్టర్లు ఆధునిక సాంకేతిక ఫలాలు సామాన్యుడి వికాసానికి, సామాజిక విలువలు పెంచినప్పుడే దానికి సార్థకత. అలా కాదని? కొందరు విలువలూ మీ విలువెంత? అంటూ అమానవీయంగా విలువలను నిలువున పాతరేసి కాసులకు కక్కుర్తి పడి అవినీతి జాతర చేస్తున్న తీరును పరిశీలిద్దాం.***

మన దేశవ్యాప్తంగా, మన రాష్ట్రంలో అబార్షన్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సృష్టికి ప్రతి సృష్టి చేసే అమ్మతనం పేగు బంధాన్ని తెంచేసుకుంటోంది!. మారుతున్న సామాజిక పోకడలు పాశ్చాత్య సంస్కృతి, భయమో, భారమో, బాధ్యతారాహిత్యమో.. గర్భస్థ శిశువుల్ని తల్లులు కడుపులోనే చిదిమేస్తున్నారు. ఆధునిక ఆహారపు అలవాట్లు, ఉరుకు పరుగుల ఒత్తిడిలో,ఆధునిక సామాజిక పోకడలతో ఓవైపు మహిళల్లో పునరుత్పత్తి శక్తి సన్న గిల్లుతోందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఆధునిక టెక్నాలజీతో మారుతున్న ఆలోచనలతో గర్భిణులు బిడ్డల్ని వద్దనుకునే కారణాలు అనేకం. ఈ తరహా పెడ ధోరణులు సమాజంలో ఆందోళనకలిగిస్తున్నాయి.

ఓవైపు భారతదేశంలో ఉత్తరాది-దక్షిణాది ఆధిపత్య రాజకీయాల్లో ఉత్తరాది పెత్తనం పెరిగిపోతుందని, దక్షిణాది రాష్ట్రాల్లో జనాభాను పెంచాలని ఆయా ప్రభుత్వాలు ప్రజల్ని కోరుతున్నాయి. గతంలో కుటుంబ నియంత్రణ పాటిస్తే ఇచ్చిన ప్రయోజనాల కంటే ఎక్కువమంది పిల్లల్ని కంటే ఇంకా ఎక్కువ ప్రయోజనాలు కల్పిస్తామని హామీలు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో పెరుగుతున్న అబార్షన్లు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా 2020-21లో తెలంగాణలో 2,282 అబార్షన్లు నమోదయ్యాయి. 2024-25 నాటికి ఈ సంఖ్య పదిరెట్లు పెరిగి 16,059 అబార్షన్లు జరిగినట్లు గణాంకాలు చెప్తున్నాయి. ఈ లెక్కలన్నీ పార్లమెంటులో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోనే హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం(హెచ్‌ఎంఐఎస్) వెల్లడించింది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లో గడిచిన ఐదేళ్లలో అబార్షన్లు నాలుగు రెట్లు పెరిగాయి. ఈ రాష్ట్రంలో 2020-21 ఆర్థిక సంవత్సరంలో 2,282 అబార్షన్లు జరగగా 2024-25 నాటికి ఈ సంఖ్య10,676 కు పెరిగింది. దేశవ్యాప్తంగా అబార్షన్లు అధికంగా జరిగిన టాప్-5 రాష్ట్రాల వివరాలను హెచ్‌ఎంఐఎస్ ప్రకటించింది. అబార్షన్లలో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2,07,019 అబార్షన్ లు జరిగాయి. ఆ తర్వాత స్థానాల్లో తమిళనాడు-1,01,414,అస్సాం- 76,642, కర్ణాటక-70,241, రాజస్థాన్-53,714 ఉన్నాయి. అయితే ఈ అబార్షన్ల వెనక అనేక విషాద ఘటనలు ఉన్నాయి. మెడికల్ అన్ ఫిట్ తో అబార్షన్లు కావడం వేరు.. ఉద్దేశ్యపూర్వకంగా గర్భ విచ్ఛిత్తి చేయించుకోవడం వేరు. సమాజంపై ముఖ్యంగా మహిళల మానసిక,శారీరక ఆరోగ్య పరిస్థితులపై అబార్షన్లు తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. అబార్షన్లకు కారణాలు పరిశీలిస్తే, యువతలో మారుతున్న ఆలోచనా ధోరణి, ఆర్థిక స్వేచ్ఛ, కో లివింగ్ లాంటి పాశ్చాత్య సంస్కృతి ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. అదే సమయంలో తెలిసి తెలియని వయసులో మైనర్ బాలికలు గర్భం దాల్చడం, పరువు పోతుందనే భయంతో తల్లిదండ్రులు కుల పంచాయతీలు పెట్టి గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు చేయించడం ఇంకా కొనసాగుతోంది. మరోవైపు ఆదివాసీ గిరిజన ప్రాంతాల మహిళలకు సరైన వైద్యసౌకర్యాలు లేకపోవడం, పౌష్టికాహారం అందకపోవడం వంటివి కూడా



అబార్షన్ల పెరుగుదలకు కారణమవుతున్నాయి. మరోవైపు ఆర్థిక భద్రత ఉన్న వారు, ఇప్పట్లో సంతానం వద్దనుకునే దంపతుల సంఖ్య పెరిగిపోతుంది. ఉన్నంత కాలం ఎంజాయ్ చేద్దాం అనే ధోరణి ప్రబలుతోంది. గర్భం దాల్చినట్టు తెలియగానే అబార్షన్ చేయించుకుంటున్నారు. ఈ తరహా ధోరణులు సమాజంలో ఆందోళన కలిగించే అంశాలుగా మారుతోంది.

అమ్మకానికి అమ్మతనం ఈమధ్య మన రాష్ట్రంలో బయటపడ్డ అటు సరోగసీ ఇటు స్పెర్మ్ కలెక్షన్.. యువతే లక్ష్యంగా వీర్యకణాల దందా స్పెర్మ్ ఇస్తూ డబ్బులు ఇవ్వ (తీసుకో)వడం.. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఐవీఎఫ్ సెంటర్లు తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా ఉంది. ఇలా ఫెర్టిలిటీ సెంటర్లు పెట్టి స్పెర్మ్ కలెక్షన్ బ్యాంకులో అమ్మతనాన్ని అంగడి సరుకుగా మార్చేస్తున్నాయి. ఇక్కడ నో రూల్స్.. నో హ్యూమానిటీ అంతా (ఓన్లీ)మనీ అన్నట్టుగా వసూళ్ల దందా కొనసాగుతోంది. పెరుగుతోన్న సంతానలేమి సమస్యతో ఐవీఎఫ్ సెంటర్లు పుట్టుకొస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా పిల్లలు లేని దంపతుల తాపత్రయాన్ని ఆసరా చేసుకుని మోసాలు చేస్తున్నాయి. రాష్ట్రంలో ఐయూఎఫ్,ఐవిఎఫ్ చికిత్సల పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాయి. కాస్త పేరుగాంచిన సెంటర్లు రెట్టింపుగా వసూలు చేస్తున్నాయి. సంతానలేమి దంపతులు చికిత్సలు,మందులు వాడినా ఫలితం లేకపోవడంతో చివరకు ఈ సెంటర్లు అడ్డదారులు తొక్కుతున్నాయి. ఫెర్టిలిటీ సెంటర్లలో వీర్యకణాల బ్యాంకులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇక్కడ సరిపోగా మిగిలిన వీర్యకణాలను ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంతున్నారు. దాంతో ఐవిఎఫ్ ట్రీట్మెంట్స్ తీసుకునేవారికే ఇప్పుడు అనుమానాలు వ్యక్తమయ్యే పరిస్థితులు వస్తోంది!.వారికి పుట్టిన బిడ్డలు నిజంగా వారికి పుట్టిన వారేనా! లేక వేరే డిఎన్ఏ ఉందా అని సందేహాలు వెంటాడు తున్నాయి. ఇలా ఒక సంస్థ చేసే తప్పుడు పనులతో చాలామంది తల్లిదండ్రుల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. ఇలా పెను ప్రకంపనలను సృష్టిస్తున్నాయి. ఈమధ్య అక్రమ సరోగసీ కార్యక్రమాలు బయట పడ్డాయి. ఇక్కడ పేద మహిళలను లక్ష్యంగా చేసుకొని సరోగసీ కోసం ఒప్పందాలు చేసినట్టు అప్పటి ఆరోపణలే, ఈమధ్య బయటపడిన సంఘటనలతో నిర్ధారించబడ్డాయి. మనదేశంలో సరోగసీ, స్పెర్మ్ సేకరణలకు నిర్దిష్టమైన చట్టాలు ఉన్నాయి. కమర్షియల్ సరోగసీ మనదేశంలో పూర్తిగా నిషేధం. కేవలం ఆల్టా యిస్టిక్ సరోగసీ అంటే మెడికల్ ఖర్చులు, ఇన్సూరెన్స్ మినహా.. ఆర్థిక ప్రతిఫలం లేని సరోగసీ అనుమతి ఉంటుంది. అలాగే సరోగసీ మదర్ భారత్ పౌరులై ఉండాలి. 25 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి ఉండాలి. ఇది ఒక్కసారి మాత్రమే సరోగెట్ గా ఉండగలదు. విదేశీ జంటలకు మన దగ్గర అనుమతి లేదు. ఇల్లీగల్ సంస్థ నగరంలో యువత లక్ష్యంగా శుక్రకణాల దందా పెరిగిపోతోంది. 30 ఏళ్లలోపు యువతీ యువకుల నుంచి సేకరించిన అండాలను, శుక్రకణాలను పిల్లల కోసం పరితపించే దంపతులకు అంటగడుతూ డబ్బులు సొమ్ము చేసుకుంటున్నారు. సరోగసీ కోసం స్పెర్మ్ సేకరిస్తున్న టెక్ కెమికల్ నిర్వాహకులు ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ దోచుకుంటున్నారు. ఏ ఆర్ టి చట్టం ప్రకారం,స్పెర్మ్ సేకరణ కోసం ఏ ఆర్ టీ బ్యాంకులు నేషనల్ రిజిస్ట్రీ ఆఫ్ బ్యాంక్స్ అండ్ క్లినిక్స్ లో రిజిస్టర్ అయి ఉండాలి. స్పెర్మ్ డోనర్లు 21-55 ఏళ్ల వయసు కలిగి ఉండాలి. స్పెర్మ్ నిల్వల కోసం క్రయో ట్యాంకులు-196సీ వద్ద నిర్వహించ బడాలి. ఒకవేళ ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కనీసం 10ఏళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించవచ్చు. అయితే ఈ చట్టాలు కఠినంగా ఉన్నా సరైన పర్యవేక్షణ లేకపోవడంతో సరోగసీ సెంటర్లు రెచ్చిపోతున్నాయి. ఈ సామాజిక రుగ్మతను నిర్మూలించుటకు ప్రజల్లో విస్తృత అవగాహన, చైతన్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అంతేకాదు సంతానలేమి దంపతుల తాపత్రయాన్ని ఆసరా చేసుకుని ధనార్జనే ధ్యేయంగా పీల్చిపిండి చేయడానికి పుట్టుకొస్తున్న ఐవిఎఫ్ సెంటర్ల అమ్మతనం అమ్మకాలతో, అబార్షన్లతో వైద్య వృత్తికే తలవంపులు చేస్తున్న అమానవీయ పద్ధతులను కఠిన చట్టాల బూజు దులిపి కట్టడి చేయాల్సింది ముమ్మాటికీ పాలకులే.



మేకిరి దామోదర్,
సామాజిక విశ్లేషకులు,
వరంగల్, ఫోన్:9573666650.

## కవిత్వం అంటే?

కవిత్వం అంటే కాదురా
భావాల ఉప్పెనా...అక్షరాల ఆటా ...
కవిత్వం! ప్రభంజనమై ఉగ్రూతలు ఊగిస్తుంది
అమరమై పుస్తకాలలో జీవిస్తుంది

కవిత్వం! అమృతమై అధరాలను తడుపుతుంది,
తీయదనమై తనువుల తృప్తిపరుస్తుంది.
కవిత్వం! చక్కదనమై సంతోషం కలిగిస్తుంది,
శ్రావ్యగీతమై వీనులకు విందునిస్తుంది.

కవిత్వం! సూర్యకిరణమై వెలుగులు
చిమ్ముతుంది,
పున్నమివెన్నెలై మదులు మురిపిస్తుంది.
కవిత్వం! వానచినుకులై హృదయాలను
తడుపుతుంది,
ఇంద్రచాపమై రంగులను వెదజల్లుతుంది.

కవిత్వం! కన్యకయై వలపువల
విసురుతుంది,
వధువై పీటపై కూర్చుంటుంది.
కవిత్వం! మధువై ముచ్చటపరుస్తుంది,
పరిమళమై పరవశపరుస్తుంది.

కవిత్వం! ఆయుధమై దురాచారాలను
నిర్మూలిస్తుంది,
ప్రాణమై గుండెలను ఆడిస్తుంది!
అందుకే కవిత్వం పదాలసమాహారంకాదు,
అది జీవనధ్యానము, హృదయస్పందనము,
మనసులప్రతిచర్యలు మధురానుభూతులు!

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

## మధుర జ్ఞాపకాలు

తనతో గడిపిన క్షణాలని
జ్ఞాపకాలుగాజీ
హృదయపు అంతరంగాల్లో
పదిలంగా దాచుకున్నాను
తవ్వేకొద్దీ కొద్దీ
బయటకొస్తూనే ఉన్నాయ్
ఒక్కో జ్ఞాపకం
ఒక్కో మధుర స్వప్నం
తను గుర్తుకొచ్చినప్పుడల్లా
తడి ఆరని కన్నీళ్ళతో
మనసుని మెలివేస్తూ
నా హృదయాన్ని తడి చేస్తూనే ఉన్నాయ్

కోనేటి నరేష్, శ్రీ సత్యసాయి జిల్లా,
8499847863

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 29 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు.శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎంపీడీవోలతో మండలాల వారిగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను ఎలాంటి సమస్యలైనా అధిగమిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. గ్రామాలలో పనులను వేగవంతం చేసే విధంగా గ్రామ కార్యదర్శులు చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.గృహ నిర్మాణ పనులను ప్రారంభించుకొనేందుకు ఆర్థిక స్తోమత లేని లబ్ధిదారులకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా రుణాలు అందించాలని అధికారులను సూచించారు.గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రాని లబ్ధిదారుల పేర్లను వెంటనే లాగిన్ నుండి తొలగించాలన్నారు. ప్రతివారం నిర్వహించే సమీక్షలో పురోగతి సాధించాలని, పనులలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు,డి ఈ కాశీనాథ్,డిపిఓ నాగేంద్ర, ఎల్ డి ఎం శ్రీనివాసరావు, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏపీఎం లు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలని జోనల్ కమిషనర్‌కు వినతి




**మల్కాజిగిరి, ఆగస్టు 29 (జనంసాక్షి) :** వినాయక నగర్ డివిజన్ పరిధిలో నిలిచిపోయిన పెండింగ్ పనులను పూర్తిచేయాలని డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి శుక్రవారం జోనల్ కమిషనర్ రవి కిరణ్ ను కలిసి స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,సంతోషిమా నగర్ చౌరస్తా నుండి చంద్రగిరి కాలనీ వరకు కొత్త సీసీ రోడ్,కాకతీయ నగర్ నుండి గౌరీ శంకర్ అపార్మెంట్ వరకు, వినాయక నగర్ సబ్ లైన్స్, సూర్య నగర్ బక్స్ డ్రైన్, ఆనంద్ బాగ్ కమ్యూనిటీ హాల్,ఆనంద్ బాగ్ బ్రిడ్జి పెయింటింగ్, వెస్ట్ కాకతీయ నగర్, బండ చెరువు లో సిల్ట్ తీయడం, వాజ్ పేయి నగర్ కూమ్యూనిటీ హాల్, వినాయక్ నగర్ కమ్యూనిటీ హాల్ ను పూర్తిచేయాలని వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మంగేష్ కుమార్, డివిజన్ మాజీ అధ్యక్షుడు ఓం ప్రకాష్, జ్యోతిర్మయి,గోపాల్, సాయిసురేష్,ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అండగా ఉంటా..



**శామీర్‌పేట్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో చదువు తున్న పేద విద్యార్థుల సంక్షేమం కోసం బీపీ సి ఎల్,మహిత ఎన్ జి ఓ వారి కృషి చెయ్యడం అభినందనీయం అని ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. శుక్రవారం రోజు శామీర్ పేట్ ఉన్నత పాఠశాలలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, మహిత యన్.జీ.ఓ వారి సహకారంతో సీ.ఎస్.ఆర్ 5 లక్షల నిధులతో స్కూల్ ఫర్నిచర్ మరియు ఆర్.ఓ ప్లాంట్ లను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శామీర్ పేట్లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ రంగనాథ్, హెచ్ ఎం వేణు,బీజేపీ నాయకులు చంద్రశేఖర్ యాదవ్, విక్రమ్ రెడ్డి, బుద్ధి శ్రీనివాస్, మైసయ్య, పవన్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజల క్షేమం కోసం పాదయాత్ర



**కొండాపూర్, ఆగస్టు 29 (జనం సాక్షి) :** గ్రామ ప్రజల క్షేమం కోసం పాద యాత్ర నిర్వహించడం జరిగిందని కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలంలోని తొగరపల్లి గ్రామం లోని బేడా బుడుగా జంగం వినాయక ఉత్సావ కమిటీ వినాయక మంటపం నుంచి శ్రీ రామ్ నగర్ శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి దర్శనం చేసుకొని అక్కడి నుంచి శ్రీ ప్రసిద్ధి గణేష్ గడ్డ గణపతి ఆలయం వరకు పాదయాత్ర గా వెళ్లి స్వామి వారిని దర్శనం చేసుకోవడం జరిగిందన్నారు. గ్రామంలోని ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని పాదయాత్రగా వెళ్లి వినాయకునికి ప్రార్థించడం జరిగిందని తెలిపారు. ఆయన వెంట గ్రామానికి చెందిన యువత ఉన్నారు.

# అక్రమ నిర్మాణాల పుట్ట..అడ్డగుట్ట

- పర్మిషన్‌కు మించి భవనం నిర్మాణం..అధికారుల మౌనం
- అధికారులకు పర్మిషన్‌తో పనిలేదా.. పైసలే ముఖ్యమా..?
- ప్రజల భద్రత కంటే బిల్డర్‌కు లంచాలే కావాలా..?
- ప్రజల ప్రాణాలతో బిల్డర్ ఆటలు

**కూకట్‌పల్లి, ఆగస్టు 29 (జనంసాక్షి) :** జిహెచ్ఎంసి జారీ చేసిన పర్మిషన్ కాపీ ప్రకారం ప్లాట్ నెంబర్ 91 హైదర్ నగర్ డివిజన్ అడ్డగుట్టలో కేవలం స్టిల్ట్ ం3 అంతస్తులకే అనుమతి ఉంది అయితే ఇక్కడ ఓ బిల్డర్ ఏకంగా (అరున్నర) అంతస్తుల భవనాన్ని ఎగరవేశాడని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఇది నిబంధనలకు స్పష్టమైన విరుద్ధం. అనుమతులు లేకుండా ఇలా గగనచుంబి కట్టడం వల్ల భవన భద్రత ఫైర్ ఎక్స్ ఎఫ్ మార్గాలు ఎమర్జెన్సీ సదుపాయాలు అన్ని ప్రశ్నార్థకంగా మారాయి.

కూకట్పల్లి జోనల్ పరిధిలోని హైదర్నగర్ డివిజన్ అడ్డగుట్టలో నిబంధనలతో సంబంధం లేకుండా భారీ అక్రమ నిర్మాణం గగనచుంబి తాకేలా సాగుతుంది ప్లాట్ నెంబర్ 91 లో కేవలం స్టిల్ టు ఫ్లస్ త్రీ అనుమతులే కె జిహెచ్ఎంసి అనుమతి పొంది ఒక బిల్డర్ ఎవరి అనుమతి లేకుండా ఏకంగా ఆరున్నర అంతా అసలు భవనాన్ని ఎగరవేస్తున్నాడు.

నాకు ధైర్యం ఉంది అధికారులు ఎవరూ నన్ను ఆపలేరు అనే అహంకారంతో ఈ నిర్మాణం కొనసాగుతున్న తీరు జోనల్ ఇంజనీరింగ్ విభాగం కళ్ళకు కనిపించకపోవడం స్థానికులను ఆచార్యంలో ముంచుతుంది.

### అధికారుల మౌనమే అనుమతి..?

అక్రమ నిర్మాణం పక్కనే ఉన్న ప్రజలు పలు మాలలు ఫిర్యాదులు చేసిన జిహెచ్ఎంసి ఫీల్డ్ స్టాఫ్ టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం పాటించడం అనుమానాలకు తావిస్తోంది నియమాల ప్రకారం అనుమతులు మించి నిర్మాణం చేస్తే వెంటనే స్టాఫ్ వర్క్ నోటీసులు ఆ తర్వాత డెమోలేషన్ నోటీసులు జారీ చేయాలి కానీ ఈ కేసులో మాత్రం ఎలాంటి చర్యలు జరగకపోవడం వెనక అధికారులు- బిల్డర్ కుమ్మక్కు ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### అడ్డగుట్ట..అక్రమాల నిర్మాణాల గుట్ట..

అడ్డగుట్ట ప్రాంతంలో గత కొంతకాలంగా అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి ప్రభుత్వం నిబంధనలు భవన నియమాలు ఫైర్ సేఫ్టీ నియమాలు అన్ని పక్కన పెట్టి కొందరు బిళ్ళలు కోట్లు పోగేస్తున్నారు పర్మిషన్‌కి మించి అంతస్తులు వేయడం వల్ల



నివాసుల భద్రత భూకంప నిరోధకత ఫైర్ ఎక్స్ ఫ్ మార్గాలు అన్నీ ప్రశ్నార్థకమవుతున్నాయి.

అడ్డగుట్టలో వెలుగు చూస్తున్న ఈ అక్రమ నిర్మాణం జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యం బిల్డర్ అహంకారం కలిసి ఎలా చట్టాలను రద్దు చేస్తున్నాయో ప్రత్యక్ష ఉదాహరణ ఇప్పుడు ప్రశ్న ఒక్కటే జిహెచ్ఎంసి ఇంత పెద్ద అక్రమాన్ని కూల్చుతుందా లేక బిల్డర్ కు వత్తాసు ఇస్తున్న.. వేచి చూద్దాం.

## అమ్మ భాషపై మమకారం పెంచుకోవాలి



**తాండూరు, అగస్టు 29 (జనంసాక్షి) :** మన భాష మన ఆత్మక్రీడా మన శక్తి రెండు కలిసినప్పుడే విద్యార్థుల వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసిస్తుందని ప్రముఖ కవి కోటం చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో ని ప్రభుత్వ నెంబరు 2 పాఠశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి హాకీ మాంత్రికుడు ధ్యాన్చంద్ జయంతి సందర్భంగా పురస్కరించుకొని పాఠశాలలో ఘనంగా తెలుగు భాష క్రీడా దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి కోటం చంద్రశేఖర్, వికారాబాద్ జిల్లా జర్నలిస్ట్ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ చారి,కవయిత్రి మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షులు వెంకట్ పాల్గొని జాన్ చంద్ గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి కోటం చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు మొలకదశలోని అమ్మ భాషపై మమకారం పెంచుకొని క్రీడల్లో రాణించాలని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టు వికారాబాద్ జిల్లా జర్నీ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ చారి మాట్లాడుతూ అన్ని భాషలు ఎన్ని నేర్చుకున్న అమ్మ భాష మర్చిపోరాదని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు సత్తగల విద్యార్థులని వారి ప్రతి ప్రతిభను ఉపాధ్యాయులు వెలికి తీసి సమాజానికి అందించాలన్నారు. కథయిత్రి మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షులు, మొలక ప్రతినిధి వెంకట్ మాట్లాడుతూ మొలక పుస్తకం విద్యార్థులకు బాల్య దశలో సాహిత్యపు బాటలు వేసి మొక్కఅని తెలిపారు.

మొలకని చదివి నైతిక విలువలు దేశభక్తి దైవభక్తి పెంపొందించుకోవాలని విద్యార్థులు ఎదగడానికి సమాజాన్ని ఉపయోగించుకోవాలి,ఎదిగిన తర్వాత సమాజానికి మీరు కావాలి మీకోసం ప్రపంచం ఎదురు చూడాలని అన్నారు.అనంతరం తెలుగు వ్యాయామ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో విద్యార్థుల యొక్క పొడుపు కథలు ,పద్యాలు, తెలుగు భాష, నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు ప్రతిభాభారతి, మనోహర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**చేవెళ్ల, ఆగస్టు 29 (జనంసాక్షి) :** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో చేవెళ్లకు చెందిన లబ్దిదారులకు మంజూరైన 11 కళ్యాణలక్ష్మీ/షాదీముబారక్ చెక్కులను, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్పల్లి, షాబాద్ మండలానికి చెందిన లబ్ధిదారులకు 66 సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేస్తామని వివరించారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి చరిత్రలో నిలిచారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ద్వారా తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. నిరు ఎదల ఆరోగ్యానికి భరోసా సీఎం సహాయ నిధి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు షాబాద్ దర్శన్, చేవెళ్ల తహశీల్దార్ క్రిష్ణయ్య, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు



దేవర వెంకట్రెడ్డి. గొనే ప్రతాప్ రెడ్డి, చేవెళ్ల, సర్దార్నగర్ ఏఎంసీ చైర్మన్లు గడ్డమీది పెంటయ్య, పీసరి సురేందర్రెడ్డి. వైస్ చైర్మన్ బేగరి రాములు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, డీసీసీ ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి, సీనియర్ నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండా రాములు, రవీందర్రెడ్డి, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎర్ర మల్లేష్, మండల, మున్సిపల్ అధ్యక్షులు వీరేందర్రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు. చేవెళ్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ జనార్ధన్. లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన



**తలకొండపల్లి, ఆగస్టు 29 (జనంసాక్షి) :** వ్యవసాయంలో నూతనంగా వస్తున్నటువంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అలవర్చుకోవాలని మండల వ్యవసాయ అధికారిని రేణుక చక్రవర్తిని పేర్కొన్నారు.శుక్రవారం తలకొండపల్లి మండలంలోని రైతులకు నానో యూరియా వినియోగంపై విస్తృతమైన అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని రైతులను ఉద్దేశించి మాట్లాడారు.సంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేయబడినటువంటి ప్రత్యేక రకమైన ద్రవరూపమైన ఎరువు అని అన్నారు.దీని వాడడం వల్ల మొక్కల రంధ్రాల ద్వారా పోషకాలు నేరుగా మొక్కలోకి వెళతాయని చెప్పారు.తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు అందిస్తుందని,నేల సారాన్ని కాపాడుతూ పంటల దిగుబడులు పెరగడంలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపారు. సంప్రదాయ యూరియాను అధికంగా వాడటం వల్ల నేల సారం దెబ్బతింటుందని,ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతులు నానో యూరియాను వినియోగించడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చునని ఆమె సూచించారు.అన్ని గ్రామాల్లో రైతులకు నానో యూరియా వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు,వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల అభివృద్ధితోనే గ్రామాల అనుసంధానం



**మొయినాబాద్, ఆగస్టు 29 (జనం సాక్షి) :** రోడ్ల అభివృద్ధితోనే గ్రామాల అనుసంధానం పెరుగుతుందని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్మెన్ చైర్మన్ మహేందర్ ముదిరాజ్, కాంగ్రెస్పార్టీ మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బొక్క వెంకట్ రెడ్డిలు పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా నక్కలపల్లి నుంచి తోల్కట్ట చౌరస్తా వరకు రోడ్డు అభివృద్ధి చేయాలని గుంతలుపడి ప్రయాణికులు అవస్తలు పడుతున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కృషితో మంత్రి సీతక్కకు గత వారం రోజుల క్రితం చేవెళ్లలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలెయాదయ్య కృషితో ప్రభుత్వం ద్వారా 1.20 కోట్లు తోల్కట్ట చౌరస్తా నుంచి నక్కలపల్లి వరకు రీబిట్ చేసేందుకు ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరైయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం కొనసాగుతున్న రీబిట్ పనులను సందర్శించి పరిశీలించారు. మాట్లాడుతూ గ్రామాలకు మధ్యలో ఉన్న రోడ్లు బాగున్నప్పుడే ఆ గ్రామాలకు వెళ్లగలుగుతారన్నారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు విద్యా, వైద్య అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొక్క వెంకట్రెడ్డి, మహేందర్ ముదిరాజ్, జంగయ్య, పట్నం రాంరెడ్డి, గడ్డం వెంకట్రెడ్డి, హనుమంతుయాదవ్, తోలకట్ట గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఆలయాల అభివృద్ధి



**శామీర్‌పేట్, ఆగస్టు 29 (జనం సాక్షి) :** ఆలయాలు అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ అన్నారు.శుక్ర వారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీ ఉద్దెమర్రి లో అతి పురాతన మైన శ్రీ అక్కన్న మాదన్న లు నిర్మించిన శ్రీ విష్ణు శివాలయం రెండు రాజగోపు రాలు, పుష్కర ఘాట్, పుష్కరిని, నిరాలి మండపం వంటి నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ముందుగా ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నరసింహ యాదవ్ మాట్లాడుతూ.....ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మేడ్చల్ నియోజకవర్గం ఇన్చార్జి తోటకూర వజ్రెష్ యాదవ్ ఉద్దెమర్రి శ్రీ విష్ణు శివాలయానికి 50 లక్షలు మంజూరు చేయించడం తో వాటి నిర్మాణం పనులు ప్రారంభించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పవన్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ బొద్దుల నిర్మల వెంకటగిరి ప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు దోసకాయల వెంకటేష్, జగన్నాథం, లక్ష్మారెడ్డి, యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- నిమజ్జనోత్సవంలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- 300ల మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు
- వికారాబాద్ జిల్లా ఎస్పీనారాయణ రెడ్డి, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

**తాండూరు, అగస్టు 29 (జనంసాక్షి) :** వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ లు సూచించారు.శుక్రవారం యాలాల మండలం కోకట్ కాగ్నా వాగును సందర్శించారు. ఆదివారం జరిగే వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డితో పాటు మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో పాటు హిందూ ఉత్సవ సమితి సభ్యులతో కలిసి నిమజ్జన ఏర్పాట్లను ఆరా తీశారు. వినాయకులు తరలించే రూట్, నిమజ్జనం చేసే ప్రదేశంను చూశారు. నిమజ్జన స్థలం వద్ద బారికేట్లు, విద్యుత్ సదుపాయాలు, సిబ్బంది వివరాల గురించి అడిగితెలుసుకున్నారు.

ఆయా శాఖల నుంచి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, నిమజ్జనోత్సవంలో ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. తాండూరు నుంచి వచ్చే వినాయకుల నిమజ్జనం గురించి హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు జిల్లా ఎస్పీ, సబ్ కలెక్టర్ లకు వివరించారు. అనంతరం ఎస్పీ నారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తాండూరులో వినాయక నిమజ్జనం ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా దృష్టిసారిస్తున్నామన్నారు. నిమజ్జనంను దృష్టిలో ఉంచుకుని 300 పోలీసు సిబ్బందితో బందోబస్తు ఉంటుందని, 4గురు డీఎస్పీ, 10 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు, ప్రత్యేక బృందాలు, పోలీసు సిబ్బంది నిమజ్జనం బందోబస్తులో పాల్గొంటారని వెల్లడించారు.



వినాయక నిమజ్జన ఉత్సవాలను ప్రశాతంగా నిర్వహించేందుకు అందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ యాదగిరి, విద్యుత్ డీఈ భానుప్రసాద్, తాండూరు రూరల్ సీఐ నగేష్, ఎస్ఐలు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# లక్షలతో క్రీడా ప్రాంగణాలు..క్రీడాకారులు లేక వెల వెల..

- క్రీడలకు ప్రభుత్వాల ప్రోత్సాహం కరువు
- యువత క్రీడలకు దూరం
- యువజన సంఘాలను నిర్వీర్యం చేస్తున్న కొందరు నాయకులు
- తల్లిదండ్రులు క్రీడలు అవసరమని గుర్తించాలి

**రాజాపూర్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నాం. ఆయన హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకరు.భారతదేశానికి హాకీలో 1928, 1932, 1936లో ఒలంపిక్ క్రీడలో వరుసగా బంగారు పతకాలు సాదించిన ఘనత ధ్యాన్ చంద్ దే. ఇలాంటి క్రీడాకారులు గ్రామీణ ప్రాంతం నుండి వచ్చినవారే. భారత దేశంలో ఉన్న జనాభలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తే ఒలంపిక్ క్రీడల్లో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంటాము అనేది చాలా మంది అభిప్రాయం. కానీ మన ప్రభుత్వాలు పేరుకు మాత్రమే క్రీడాశాఖ అది ఒకటి రెండు ఆటలే క్రీడలు మిగతావన్నీ కాదు. అన్న చందంగా ప్రోత్సాహం ఉండటం వల్ల రాను రాను క్రీడల పై ఆసక్తి తగ్గుతుంది అని క్రీడాభిమానుల అభిప్రాయం. రాజాపూర్ మండల పరిధిలో 19 గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వంలో ఎన్ ఆర్ జి ఎస్ కింద క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం జరిగింది . ఒక్కో గ్రామ పంచాయతీ కి 65 వేల ఖర్చు తో నేమ్ బోర్డు, గేటు, వాలీబాల్ కోర్టు, మరికొన్ని క్రీడా పరికరాలు ఏర్పాటు చేయడం జరిగింది. కొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల్లో మట్టి నింపాడానికి అధనపు ఖర్చు తో కలిపి దాదాపు ప్రతి గ్రామానికి లక్ష రూపాయలు ఖర్చు




అయినట్లు రాజాపూర్ ఎపీఓ భారతి తెలిపారు. తరువాత గ్రామ పంచాయతీకి అప్పగించి వాటి నిర్వహణ వారే చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. గ్రామపంచాయతీల్లో ఎక్కడ చూసినా పిచ్చి మొక్కలతో, ముళ్ళపొదలతో క్రీడా ప్రాంగణాలు నిండిపోయాయి.

గ్రామాల్లో యువజన సంఘాలు లేక వారికి ఇవ్వ వలసిన క్రీడా సామాగ్రి పాఠశాలలకు గత ప్రభుత్వంలో ఇవ్వడం జరిగింది. గ్రామాల్లో యువజన సంఘాలుగా యువత ఎక్కువ గా 20 సంవత్సరాల క్రితం కనిపించేవారు. వారు గ్రామాల్లో జరిగే ఉత్సవాల్లో చురుకుగా ఉంటూ, రోజు సాయంత్రం వాలీబాల్, కబడ్డీ వంటి ఆటలు ఆడుతుండేవారు. విద్యార్థులు వేసవిలో టోర్నమెంట్ లు పెట్టుకొని వారే ఖర్చులు భరించి ఆటలు ఆడించే వారు. ఇలా జరిగిన రోజుల్లో మట్టిలో మాణిక్యంలా గ్రామాల్లో కొందరు క్రీడా క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు వెళ్ళే వారు. గత ఇరవై సంవత్సరాలుగా యువజన సంఘాలు తగ్గుతూ వచ్చాయి. దానికి నిదర్శనం గత ప్రభుత్వ హయంలో యువజన సంఘాలకు ఇవ్వాల్సిన క్రీడా సామాగ్రి పాఠశాలలకు ఇవ్వడమే. యువత ఎక్కువగా కొంతమంది రాజకీయ నాయకుల సైన్యంలా వెంట ఉంటూ వారి పేర్లమీద టోర్నమెంట్ లు పెడుతూ ఆటలపోటిలకు రాజాకీయ రంగు పులిమి, వివిధ పార్టీల నాయకులు గ్రామాల్లోని యువకులను మద్యానికి బానిసలుగా మార్చి, చివరకు గ్రామాల్లో యువజన సంఘాలు లేకుండా చేశారు. ఎప్పుడైతే గ్రామాల్లో యువజన సంఘాలు లేకుండా అయ్యాయో అప్పటి నుండి యువత పెడదోవ పట్టడం మొదలైంది. డ్రగ్స్, మద్యం, ఆన్ లైన్ గేమ్ వంటి జూదలకు అలవాటుపడి యవ్వనదశలోనే తనువులు చాలిస్తున్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు మనిషి ఆరోగ్యాన్ని కాపాడుతాయనే విషయాన్ని మరిచి పోయి, విద్యార్థుల తల్లిదండ్రులు చదువు ఒక్కటే పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది అనే భావనలో విద్యార్థులను తయారుచేయడం. ఆటలాడితే ఏమి రాదని, ఉద్యోగం రాదు, సమయం వృదా అని తల్లిదండ్రులే పిల్లలకు చెప్పడం కూడా ఒక కారణమే అవుతుంది. కాబట్టి విద్యార్థులు,యువత క్రీడలపై మక్కువ పెంచుకొని ఒక ధ్యాన్ చంద్ లా, ఒక పీటీఉషా లా, ఒక పుల్లెల గోపిచంద్ లా, విశ్వనాథ్ ఆనంద్ లాంటి ఆటగాళ్ళను రోల్ మోడల్ గా పెట్టు కొంటే మన దేశాన్ని ఒలంపిక్ క్రీడలో ప్రపంచ నెంబర్ వన్ గా నిలబెట్టగలమని క్రీడాభిమానుల అభిప్రాయం. ఇకనైనా ప్రభుత్వాలు క్రీడాకారలకు రాజాకీయలతో సంబంధం లేకుండా ప్రోత్సాహం అందించి, గ్రామీణ స్థాయి నుండి ప్రత్యేక నిధులు కేటాయించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

## భూ నిర్వాసిత నేతల అక్రమ అరెస్టులను ఖండించండి



**మక్తల్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** భూ నిర్వాసిత నేతల అక్రమ అరెస్టులను భూనిర్వాసితుల సంఘం జిల్లా నాయకులు పుంజనూర్ ఆంజనేయులు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్ రాజ్ ఖండించారు. ఈ సందర్భంగా మఖ్తల్ పట్టణంలో కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మక్తల్ నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని గత 44 రోజులకు పైగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న సమస్యలను పరిష్కరించకుండా నేడు ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడడం హేయమైనా చర్య అని భూనిర్వాసితుల సంఘం జిల్లా నాయకులు పుంజనూర్ ఆంజనేయులు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్ రాజ్ విమర్శించారు. శుక్రవారం తెల్లవారుజామునే పోలీసుల చేత ప్రభుత్వం అరెస్టులకు పాల్పడడం దారుణం అన్నారు. అరెస్టు చేసి ధన్వాడ పోలీస్ స్టేషన్‌కు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందివ్వడంలో ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. అరెస్టు చేసి నిర్బంధించి ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే అది మరింత ఉవ్వెత్తున లేస్తదని హెచ్చరించారు. అరెస్టు చేసిన భూ నిర్వాసితులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల జిల్లా కార్యదర్శి కేశవులు శ్రీనివాస్ గౌడ్, రాఘవేందర్ రెడ్డి, తిమ్మారెడ్డి, ఉషన్ గౌడ్, కృష్ణ, రఘు, జిలాని, శ్రీనివాసులు, పూజారి సోమన్న, గొల్ల బాలయ్య, గజలప్ప తదితరులు పాల్గొన్నారు.

## శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదం




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 29 (జనం సాక్షి) :** గిరిజన యువకులు జట్లుగా ఏర్పడి క్రికెట్ టోర్నమెంట్ లో భాగస్వాములు కావడం అభినందనీయమని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా పేరపళ్ల మీది తండకు చెందిన గిరిజన యువకులు తండ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన ఎంపీఎల్ సీజన్-3 క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాజ్ కుమార్ రెడ్డి విచ్చేసి క్రికెట్ టోర్నమెంట్ ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులను రాజ్ కుమార్ రెడ్డి పరిచయం చేసుకున్నారు. అనంతరం టాస్ వేసి టోర్నమెంట్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శరీర దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. గిరిజన యువకులు ఒక చోటకు చేరి క్రికెట్ టోర్నమెంట్‌ను కలిసికట్టుగా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. గ్రామ స్థాయి నుండి మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలని సూచించారు. క్రీడాకారులకు ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదిస్తే వారికి చేయూతనిచ్చేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.అంతకుముందు రాజ్ కుమార్ రెడ్డి క్రికెట్ ఆడారు. అనంతరం నిర్వాహకులు రాజ్ కుమార్ రెడ్డిని శాలువలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సంతోష్ కుమార్, కిష్ట్యానాయక్, లష్కర్ నాయక్, శేవనాయక్, శ్రీనివాస్ నాయక్, గోపాల్ నాయక్, సురేష్ నాయక్, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, గోపాల్ గౌడ్, సల్ల వెంకటేష్, వై.సంతోష్, నర్సింహనాయుడు, ఎం.సంతోష్, కృష్ణయాదవ్, నాగురావు, అశోక్, చామకూర నగేష్, నర్సింహ, అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

# తుది ఓటరు జాబితాకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- 30 వరకు ఫిర్యాదుల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 29 (జనం సాక్షి) :** ఓటరు ముసాయిదా నుపటిధీలించి తుది ఓటరు జాబితా రూప కల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలనీ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు.మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీ లు, వార్డుల వారీగా విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా పై అభ్యంతరాలను ఈ నెల 30 వరకు స్వీకరించడం జరుగుతుందని,అభ్యంత రాల పరిష్కారం అనంతరం వచ్చే నెల 2 న వార్డు, గ్రామ పంచాయతీల వారీగా ఫోటో తో కూడిన తుది ఓటరు జాబి తాను వెల్లడిస్తా మని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలి పారు.శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు.సమావేశా నికి స్థానిక సంస్థల జిల్లా అద నపు కలెక్టర్ సంచిత్ గంగ్వా ర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ రాష్ట్ర



ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబి తాను అనుసరించి ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలను ఈ నెల 28 న ప్రదర్శించడం జరిగిందన్నారు.ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాల విషయంలో ఎలాంటి అభ్యం తరాలు ఉన్నా ఈ నెల 30 వరకు స్వీకరించడం జరుగు తుందని, 31న డీ పీ వో ఆధ్వర్యంలో అభ్యంతరాల పరిష్కారం జరుగుతుందని తెలిపారు.అనంతరం సెప్టెం బర్ 2 న తుది ఓటరు జాబి తాను విడుదల చేస్తామని తెలిపారు. జిల్లాలోనిధన్వాడ, మరికల్, ఊట్కూర్ మండ లాలలో 650 మంది ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాలు 8 ఉన్నాయని, అభ్యంతరాల స్వీకరణ తర్వాత ఆయా పోలింగ్ కేంద్రాల పై తుది నిర్ణయం తీసుకుందా మని సమావేశంలో నిర్ణయిం చారు.ఈ నెల 30న మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగు తుందని, ఆ సమావేశంలో పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలపవచ్చని కలెక్టర్ తెలిపా రు. వచ్చిన అభ్యంతరాలను ఈ నెల 31 న పరిష్కరించి తుది ఓటరు జాబితా విడుద ల చేస్తామని ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరిం చాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, నగర అధ్యక్షుడు పోషల్ వినోద్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు సలీం, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సుదర్శన్ రెడ్డి, నగర అధ్యక్షుడు సాగర్, టిడిపి నాయకుడు రాఘవ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# భూమి కోల్పోయిన రైతులకు అండగా ఉంటా

- ఎంపీ రఘునందన్ రావు

**కొండాపూర్, ఆగస్టు 29 (జనం సాక్షి) :** భూములు కోల్పోయిన రైతులకు అండగా ఉంటానని మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు అన్నారు. శుక్రవారం మండల పరిధి తొగర్పల్లి గ్రామ శివారులో 418 సర్వే నంబర్ గల భూమిని కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలు ఇప్పియ్యడం కొరకు భారతీయ జనతా పార్టీ మండల పార్టీ పక్షాన మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శివ, బిజెపి సీనియర్ నాయకులు మల్లేశం,లు ఎంపీ రఘునందన్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తాం అని చెప్పి తొగర్పల్లి రైతుల దగ్గర గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలోభూమి తీసుకున్నారని దానికి పరిహారింగా భూమి కోల్పోయిన రైతులకు పరిహారంతో పాటు ఇళ్ల స్థలాలు కూడా ఇస్తామని ఇవ్వకపోవడం దారుణం అన్నారు. దాదాపు కొన్ని సంవత్సరాల నుండి రైతులు ఇళ్ల స్థలాల గురించి వేచి చూస్తున్నా రని ఇప్పటి వరకు ప్రభుత్వం రైతులకు ఇళ్ల స్థలాల పొజిషన్ చూయించలేదన్నారు. కాని కొన్ని రోజుల క్రితం వచ్చిన కార్పొరేట్ సంస్థకు మాత్రం ప్రభుత్వం వెంటనే భూమిని మంజూరు చేసిందని అన్నారు.కార్పొరేట్ సంస్థల మీద ఉన్న శ్రద్ధ



ప్రభుత్వానికి పేద రైతుల పైన లేకుండా పోయిందని, వెంటనే ప్రభుత్వం స్పందించి త్వరలోనే పేద రైతులందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చి న్యాయం చేయాలన్నారు. లేకుంటే రైతులందరితో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు మల్లేశం,మండల ప్రధాన కార్యదర్శి శివ,నాయకులు కిషన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

- జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 29 (జనం సాక్షి) :** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర ఉంటుందని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల ఆరోగ్యం, బరువు విరువరాలను కలెక్టర్ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా గర్భిణీ స్త్రీలు బాలింతలు చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించారు .భోజనం చేస్తున్న చిన్నారులను చూసి కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం చోటాకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల లభ్యత, డిజిటల్ బోధన విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. బావి భారత నిర్మాణం తరగతి గదుల్లోనే అవుతుందన్న బాపూజీ కలలను నిజం చేయాలని సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేని కలెక్టర్ అన్నారు.

ఉపాధ్యాయులు తమ విద్యార్థులలో క్రమశిక్షణను పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో జరుగుతున్న డిజిటల్ బోధన విధానాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులపై



అమలు చేస్తున్న ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యా, వైద్యరంగాల్లో నాణ్యమైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు, వైద్యాధికారులు, ఉపాధ్యాయులు, శిశు సంక్షేమాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

- తుది దశకు చేరుకున్న పనులు..
- లక్ష చదరపు అడుగుల్లో ఆసుపత్రి భవనం..
- 24 విభాగాల్లో అత్యవసర సేవలు, ఓపిడి సేవలు
- కార్పోరేట్ ఆసుపత్రులను తలదన్నేలా వసతులు, నిర్వహణ
- పటాన్చెరు నియోజకవర్గానికి తలమానికం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
- త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం..
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు, ఆగస్టు 29 (జనంసాక్షి) :** దశాబ్దాల కాలంగా కాలుష్యంతో సహజీవనం చేసి అంతు చిక్కని వ్యాధులు, అనారోగ్యాలతో ఇటు ఆర్థికంగా అటు ఆరోగ్యపరమైన సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలకు, కార్మికులకు సాంత్వన చేకూరుస్తూ 300 కోట్ల రూపాయలతో పటాన్చెరు పట్టణంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులు మీదుగా ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఆస్పత్రి అధికారులతో కలిసి నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.






అనంతరం విలేకరులతోమాట్లాడుతూ ఆసియాలోనే అతి పెద్ద పారిశ్రామికవాడగా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ పరిశ్రమంలో పనిచేస్తున్న కార్మికులకు ఆధునిక వసతులతో అత్యాధునిక వైద్య చికిత్సలతో లక్ష చదరపు అడుగుల్లో జి ప్లస్ టు అంతస్తుల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించడం జరిగిందని తెలిపారు. హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ నియంత్రణలో 200 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణ కొనసాగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆసుపత్రి నిర్వహణ కోసం ప్రత్యేకంగా నిధిని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలో వెలువడే కాలుష్యం మూలంగా వచ్చే వ్యాధులను గుర్తించి అందుకు అవసరమైన వైద్య విభాగాలను, నిపుణులైన వైద్యులు ఆస్పత్రిలో అందుబాటులో ఉంటారని తెలిపారు. దీంతోపాటు ప్రధానంగా పారిశ్రామికవాడల్లో జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అందుకు అవసరమైన అత్యాధునిక శస్త్ర చికిత్స విభాగాలు సైతం ఇందులో ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. ఆస్పత్రి నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాయ్ కాడి విజయ్ కుమార్,.ఆస్పత్రి సూపరిండెండెంట్ చంద్రశేఖర్, టిఎస్ఎంఎస్ఐడిసి డిఈ రవీందర్ రెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి సంఘం సభ్యులు కంకర సీనయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన రాష్ట్ర విజిలెన్స్ అధికారులు

**మిడ్జిల్, ఆగస్టు 29 (జనం సాక్షి) :** మండలంలో ఎరువులు దుకాణాలను శుక్రవారం రాష్ట్ర విజిలెన్స్ అధికారులు ఆకస్మికతనికి చేశారు. ఎరువుల దుకాణాలలో తరచూ కొరత సృష్టిస్తున్న దృష్ట్యా విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసినట్టు సమాచారం. మండల కేంద్రంలోని రాఘవేంద్ర పార్టిలైజర్ సీడ్స్ పెస్టిసైడ్స్ మరియు ఆగ్రో రైతు సేవ దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. యూరియా ఎరువులు ఎన్ని బ్యాగులు వచ్చినవి వారు ఏ రైతులకు విక్రయించారని స్టాక్ రికార్డులను పరిశీలించి ప్రస్తుతం గోదాములలో నిలువ ఉన్న ఎరువుల ను తనిఖీ చేశారు. రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాల లైసెన్సులను రద్దుచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు తెలిసేలా ప్రతిరోజు స్టాక్ బోర్డుపై ఎరువుల సమాచారాన్ని ఉంచాలని సూచించారు. వారితోపాటు మండల వ్యవసాయ అధికారి సిద్ధార్థ ఉన్నారు.



# ప్రజా ప్రభుత్వంలో చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యత

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రఘు ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్ నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మేజర్ ధ్యాన్ చంద్ ఫోటోకు పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడలకు ప్రోత్సాహాన్ని ఇస్తూ యువతను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న స్టేడియంలో అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి, వాటిని అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని, మండలాల్లో కూడా స్థల సేకరణ చేసి, మినీ స్టేడియాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. అనంతరం గతేడాది సీఎం కప్ 2024లో రాష్ట్రస్థాయి పోటీల్లో మెడల్స్ సాధించిన క్రీడాకారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, అడిషనల్ కలెక్టర్లు పి.అశోక్ కుమార్, ఎల్ విజయలక్ష్మిల చేతుల మీదుగా మెమొంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం రాజేందర్, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, పరిశ్రమల శాఖ జిఎం సిద్ధార్థ, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ ఎల్.జైపాల్, క్రీడాకారులు, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు, కేలో ఇండియా కోచ్ చల్లా శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# పారదర్శకమైన పాలన కోసమే స.హ చట్టం

- సమాచార హక్కు చట్టం కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్ రావు




**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 29(జనం సాక్షి):** ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం 2005పై రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో పి ఐ ఓ, ఆపిలెట్ అధికారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషనర్లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, డీసీపీలు షేక్ సలీమా, అంకిత్ కుమార్ లు పూల మొక్కలు, పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.అనంతరం రాష్ట్ర సమాచార కమిషనర్లు పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో వారు మొక్కలు నాటారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సులో రాష్ట్ర సమాచార హక్కుచట్టం కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఇందులోని అంశాలపై అధికారులు సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువ అందిన జిల్లాల్లో వరంగల్ జిల్లా ఒకటన్నారు. పీఐవో అధికారులు ప్రజలకు సకాలంలో పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా, చట్టంలో ఉన్న సమయపరిమితి లోపల సమాధానమివ్వాలని ఆదేశించారు. గత మూడు సంవత్సరాల నుండి 17వేల ఆర్టిఐ కేసులో పెండింగ్లో ఉన్నాయని, వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లాల పర్యటనలు చేపట్టి కేసులను అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతోందని అన్నారు. పారదర్శకమైన పాలన కోసం చట్టం ఉపయోగపడాలని, ప్రజలు చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా సదుద్దేశంతో వినియోగించుకోవాలన్నారు. అధికారులు చట్టం పట్ల భయం వీడనాడి నిర్భయంగా యాక్ట్ ప్రకారం అడిగిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందజేయాలని తెలిపారు. ఆర్టిఐ చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తే అవినీతి తగ్గిపోతుందని, ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. అన్ని శాఖల అధికారులు 4-1బి, సిటిజన్ చార్టర్ ను పక్కాగా అమలు చేస్తే సమస్యలు తగ్గుతాయి అన్నారు. పారదర్శకత జవాబుదారీతనంతో నిబంధనలకు లోబడి ఖచ్చితమైన సమాచారం అందించి ప్రజలకు , ప్రభుత్వానికి పౌర సమాచార అధికారులు వారధిగా నిలవాలని సూచించారు. జిల్లాస్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి అధికారులకు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యేలా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు . ఆర్టీఐ యాక్ట్ లో 31 సెక్షన్లు 6 చాప్టర్లు ఉన్నాయని, సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలన్నారు. సామాన్య ప్రజలకు నిబంధనలకు లోబడి సమాచారం అందించాలని తెలిపారు. చట్టాన్ని పక్కాగా అమలు చేసేందుకు మే నెలలో కొత్త కమిషనర్లను నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో గత సంవత్సరం నుండి ఆపరిష్కృతంగా ఉన్న ఆర్టీఐ అప్పీల్ కేసులను కలెక్టరేట్లో కమిషన్ ప్రత్యేకంగా పరిష్కారానికి చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్ర సమాచార కమిషన్ కమిషనర్లు అధికారులకు ఆర్టీఐ యాక్ట్ పై దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై పిఐఓ, జిల్లా అధికారుల నుండి స్వీకరించిన దరఖాస్తుల పరిష్కరణ, పెండింగ్ గురించి తెలుసుకొని, పిఐఓ, అధికారుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కమిషనర్లను వరంగల్ ప్రఖ్యాతి గాంచిన చేనేత దర్రి బహుకరించి శాలువ, మెమొంటోలతో సన్మానించారు. జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, డిసిపి షేక్ సలిమ, అంకిత్ కుమార్ లు శాలువలతో సత్కరించారు. అనంతరం పెండింగ్ లో ఉన్న ఆర్టీఐ దరఖాస్తులపై ఆర్టీఐ కమిషనర్లు విచారణ నిర్వహించారు. సంబంధిత పీఐవో అధికారులు, దరఖాస్తుదారుల నుండి వివరాలు స్వీకరించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, డి ఆర్ ఓ విజయలక్ష్మి, ఆర్డిఓలు, వివిధ శాఖల పిఐఓ లు, అప్పీలెట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బస్సు రూట్ ప్రారంభించిన ఎమ్మెల్యే

- భూపాలపల్లి వయా మొరంచపల్లి నుండి కొడవటంచ



**భూపాలపల్లి/చిట్యాల/రేగొండ ఆగస్టు 29 (జనం సాక్షి):** ప్రజలు ఆర్టీసీ బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో భూపాలపల్లి - పరకాల(వయా మొరంచపల్లి, ఎస్ యం కొత్తపల్లి, ఒడితల, గోపాలపురం, కాకర్లపల్లి, కొడవటంచ, లింగాల, రేగొండ) సర్వీసును ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం బస్సులో భూపాలపల్లి బస్టాండ్ నుండి మొరంచపల్లి, ఎస్ఎం కొత్తపల్లి, ఒడితల, గోపాలపురం, కాకర్లపల్లి, కొడవటంచ వరకు సాధారణ పౌరుడిలా ప్రయాణికులతో కలిసి ప్రయాణం చేశారు. ఎస్.యం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎలగొండ సమ్మక్క తో బస్సులో ప్రయాణం చేస్తూ సరదాగా ముచ్చటించారు. ఒడితల గ్రామానికి బస్సు చేరుకోగా మహిళలు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి స్వాగతం పలికారు. బస్సు వద్ద గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టారు. గోపాలపురం, కాకర్లపల్లి, కొడవటంచ గ్రామాల్లో కూడా గ్రామస్తులు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పారు. కాకర్లపల్లిలో వినాయకస్వామి మండపం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని టెంకాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ప్రయాణం అనంతరం ఎమ్మెల్యే కొడవటంచలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు ఆర్టీసీ బస్సు సేవలను సద్విని యోగం చేసుకోవాలన్నారు. మహా లక్ష్మీ పథకం రాష్ట్రంలో విజయవంతంగా కొనసా గుతుందన్నారు.

# నకిలీ పాసు పుస్తకాల ముఠా అరెస్ట్

- మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు



**మహబూబాబాద్ బ్యూరో, ఆగస్టు 29(జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లాలో నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలు తయారు చేసి రైతులను మభ్యపెట్టి, లోన్లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న ముఠాను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. కురవి మండలానికి చెందిన మూడ్ బాలాజీ,అమంగల్ మండలనికి చెందిన బానోత్ హరి కిషన్,జాఫర్‌గడ్ మండలనికి చెందిన బానోతు వర్జన్ అని ముగ్గురు కురవి మండల కేంద్రంలో రైతులకు నకిలీ పాస్ పుస్తకాలు తయారు చేసి, ఒక్కో పాస్‌బుక్‌కి రూ.10,000 వసూలు చేసి, కురవి, డోర్నకల్ మరియు మహబూబాబాద్ యూనియన్, కెనరా బ్యాంకు మహబూబాబాద్ నందు వివిధ బ్యాంకులలో పదహారు లక్షలకు పైగా లోన్లు మంజూరు అయ్యేలా చేశారు. దొంగ పాస్ పుస్తకాల కేసును సుమోటోగా బుక్ చేసి విచారణ జరిపి నిందితులను అదుపులోకి తీసుకున్నాం,ఇంకా కొంతమంది నిందితులు పరారీలో ఉన్నారనీ, ఈ ఘటనపై విచారణ కొనసాగుతోందనీ, ఈ ముఠాతో సంబంధం ఉన్న మిగతా వారిని కూడా అరెస్టు చేస్తామని డిఎస్పి తిరుపతి రావు మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా రెండు కంప్యూటర్లు, రెండు ప్రింటర్లు, ఒక ల్యాప్‌టాప్,16 నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలు తదితర వస్తువులు స్వాధీనం చేసుకున్నా మన్నారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ సర్వయ్య సిసిఎస్, ఇన్స్పెక్టర్ హథీరాం, కురవి ఎస్సై సతీష్, ఏఎస్సై వెంకన్న సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కను కలిసిన మల్లూరు క్షేత్రం ఆలయ ఈవో మహేష్



**మంగపేట ఆగస్ట్ 29(జనంసాక్షి) :** రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను జిల్లా క్యాంపు కార్యాల యంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసిన మల్లూరు శ్రీ లక్ష్మీనరసిం హస్వామి నూతన కార్యనిర్వహణాధికారి రెవెల్లి మహేష్. ఈ సందర్భంగా మంత్రి సీతక్క నూతన కార్యనిర్వాహణాధికారిగా బాధ్యతలను స్వీకరించి నందుకు మహేష్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నూతన ఉత్సాహంతో పనిచేస్తూ ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని అలాగే వచ్చే ఏడాది జరిగే బ్రహ్మోత్సవాలను సైతం విజయవంతం చేసేలా పని చేయాలన్నారు. ఆయన వెంట ఆలయ సిబ్బంది తదితరులున్నారు.

# లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు

- పాలకుర్తి ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి



**పాలకుర్తి/ దేవరుప్పుల, ఆగస్టు 29 (జనంసాక్షి) :** దేవరుప్పులమండలం, కడవెండి గ్రామంలోని వానకొండయ్య శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులపై ఈరోజు హైదరాబాద్ లోని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తమ నివాసంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం ఇప్పటికే రూ. కోటి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో చేపట్టబోయే పనులను కళ్యాణ మండపము, అన్నదాన సత్రం, పనులను తక్షణమే ప్రారంభించి, ఆలయాన్ని భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని ఎండోమెంట్స్ శాఖ అధికారులను ఆదేశించారు.వానకొండయ్య శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం కడవెండి గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక. భక్తులు అధిక సంఖ్యలో దర్శనానికి వచ్చే దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో మౌలిక వసతులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రహదారి సౌకర్యాలు, దీపాలంకరణ, తాగునీటి సౌకర్యం వంటి పనులను ప్రాధాన్యతతో చేపట్టాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్స్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరైనందుకు గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 29(జనంసాక్షి) :** ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి ఉధృతి పెరిగిందని జిల్లాలోని లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గోదావరి పరివాహక మండలాలైన వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఉధృతంగా పారుతున్న గోదావరి కారణంగా ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడం జరిగిందని, శుక్రవారం మధ్యాహ్నం వరకు గోదావరి ఉధృతి పెరిగే అవకాశం ఉండటంతో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని ఆయన వివరించారు. ఐదు మండలాలలోని గ్రామాల ప్రజలు పశువులను మేతకు తీసుకుపోవద్దని, చేపల వేటకు వెళ్ళవద్దని, ప్రవహిస్తున్న నీటిలో ఈత కొట్టరాదని అన్నారు. జిల్లాలో పలుచోట్ల రోడ్లు దెబ్బతిన్న కారణంగా వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని, జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న ముందస్తు చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలం, వరదల దృష్ట్యా తక్షణ సహాయం కొరకు కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ 18004257109 కు కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారిగా అందుబాటులో ఉంటూ, వర్షానికి, జలమాయమైయ్యే ప్రాంతాల సమస్య కు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత శాఖల అధికారులను తక్షణ పరిష్కార నిమిత్తం పంపడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

# తెల్లారేసరికి వేసిన పొలం నాటు కనుమరుగు

- వేసిన నాటును ట్రాక్టర్ దున్నించిన దుండగుడు..
- ఆరుకాలం కష్టపడి మడులను వేసుకున్న మహిళ
- పోలం మడులను చెడగొట్టిన వైనం
- న్యాయం చేయాలని అధికారులకు ఫిర్యాదులు



**పర్వతగిరి ఆగస్టు 29 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన దళిత మహిళా రైతు చిదురు వెంకటమ్మకు వారసత్వంగా పర్వతగిరి బైపాస్ రోడ్డుకు కుడివైపు అసైన్డ్ భూమి సర్వేనెంబర్ 731/3 లో మూడు ఎకరాల 27 గుంటలు ఉండగా మొదట నుండి ప్రభుత్వం నుండి తదుపరి వారసత్వంగా మామ తరువాత భర్తకు..భర్త చనిపోయిన తర్వాత నుండి భూమిని సాగు చేస్తూ వచ్చానని,గతంలో అనేకసార్లు పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన ఒక వ్యక్తి ఏలాంటి సంబంధం దస్తావేజులు లేకుండా పొలం నాదంటూ పోలాన్ని దున్ననివ్వకుండా అనేకసార్లు అడ్డుకుంటే స్థానిక పోలీస్ స్టేషన్లో యంఆర్ఓ ఆఫీస్ లో ఫిర్యాదు చేయగా కోర్టుకు వెళ్ళమని తెలిపారని, కోర్టు వెళ్ళగా కోర్టు నుండి కూడా చీదురు వెంకటమ్మకు అనుకూలంగా తీర్పు వచ్చిందని వెంకటమ్మ తెలిపారు.. బంగారం కుదువపెట్టి తను నాటువేసిన పొలాన్ని ట్రాక్టర్ తో దున్నారని పంట నష్టం కలిగించారని ట్రాక్టర్ యజమాని పై పోలాన్ని చెడగోట్టినందున ఆ వ్యక్తి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని వారితో ప్రాణహాని ఉందని అధికారులను వెంకటమ్మ వేడుకుంటున్నారు.

### ఫిర్యాదు అందింది దర్యాప్తు చేస్తున్నాం : ఎమ్మార్వో వెంకటస్వామి

మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 731 కింద అసైన్డ్ ల్యాండ్ వందల ఎకరాల్లో ఉంది. అందులో రైతులకు కొందరు పంటలు పండించుకునేది వాస్తవమే. వెంకటమ్మ చేసిన ఫిర్యాదు అందింది సంబంధిత అధికారులతో సర్వే చేయించి దర్యాప్తు చేస్తున్నారు. నాటు వేసిన పొలాన్ని చెడగొట్టడం చాలా తప్పు సంబంధిత అధికారులకు సిఫార్సు చేస్తున్నాను.

# పక్షుల పాఠం ఆసక్తిగా వింటూ.. నోటుబుక్కులో రాసుకుంటూ..



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** కవ్వాల్ అడవుల్లో ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ జిల్లాలో ఉన్న పక్షి జాతులు వాటి ఆవశ్యకత అరుదైన పక్షులు ఎలా అంతరించి పోతున్నాయి. వాటికి గల కారణాలు వంటి వాటిపై మరోమారు పాఠం బోధించారు. ఇటీవల హైదారాబాద్ లోని అటవీశాఖ దూలపల్లి అకాడమీలో ట్రైనింగ్ తీసుకుంటున్న బీట్ ఆఫీసర్ల బృందం శిక్షణలో భాగంగా కవ్వాల్ అడవుల్లో ట్రెక్కింగ్ చేశారు. అడవుల్లో ఉండే వన్య ప్రాణులు, పక్షి జాతుల గురించి తెలుసుకునేందుకు రెండు రోజులపాటు ఈ అడవుల్లో పర్యటించారు. ఈ కార్యక్రమానికి కృష్ణ హాజరై వారికి పక్షుల్లో ఉండే వివిధ రకాల జాతులు, అరుదైన వాటి గురించి అదేవిధంగా జిల్లాలో ఎన్ని రకాల పక్షులు, ఎక్కడ ఎప్పుడు తలదాచుకుంటున్నాయో కొన్ని అరుదైన పక్షులు ఎలా అంతరించి పోతున్నాయో వాటికి గల కారణాలు ఇంకా వాటి ఆవాసాలు, వలస పక్షులు, అరుదైన గద్ద జాతుల వంటి వాటిపై క్షుణ్ణంగా వివరించారు. కృష్ణ చెప్పిన పక్షుల పాఠాన్ని బీట్ ఆఫీసర్లు ఆసక్తిగా వింటూ తమ నోటు బుక్కులో పొందు పరుచు కోవడం విశేషం! కార్యక్రమంలో ఎఫ్ డీ ఓ సాహు, సెక్షన్ ఆఫీసర్ మమతలు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు ఇచ్చిన హామీలను పట్టించుకోని సింగరేణి యాజమాన్యం



**నస్పూర్ (జనంసాక్షి):** సింగరేణి ఓపెన్ కాస్ట్ భూ నిర్వాసితులైనా సింగపూర్, తాళ్ళపల్లి రజకులకు ఇచ్చిన హామీలను సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోకుండా సింగరేణి యాజమాన్యం రజకుల బతుకులతో చెలగాటం ఆడుతుందని తెలంగాణ రజక వృత్తి దారుల సంఘం నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ అవసరం నిమిత్తం తమ భూములని తీసుకొని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని,కానీ నేటికీ కొన్ని సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడం మూలంగా రజకుల బ్రతుకులు ఆగమైనాయన్నారు.గతంలో ప్రభుత్వం రజకుల కోసం దోబీ ఘాట్ నిర్మించగ వాటిని సింగరేణి సంస్థ కూల్చివేసిందని,రెండు గ్రామాల రజకుల భూములను తీసుకోవడం జరిగిన ఇప్పటికీ కొంతమంది ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కూడ రానివారున్నారని, సింగపూర్ లోని దోబిఘాట్ ను ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే కూల్చివేయడం జరిగిందని,ఓపెన్ కాస్ట్ వలన కులవృత్తులు దెబ్బతిని జీవనోపాధి లేక నష్టపోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్కే చందర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు,పాయిరాల రాములు జిల్లా కార్యదర్శి, నడిగోడ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు, బి జోన్ పట్టణ ప్రెసిడెంట్, గంగరాజుల రాంచందర్ మందమర్రి పట్టణ ప్రెసిడెంట్, కొండపర్తి రవి గ్రామ కమిటీ అధ్యక్షుడు, నాయకులు కొండపర్తి బాపు, పాయిరాల ఇందుర్,పాయిరాల పుల్లయ్య, కొండపర్తి లచ్చన్న, పాయిరాల సరిత,కొండపర్తి లక్ష్మి, కొండపర్తి మమత,పాయిరాల లక్ష్మి, పాయిరాల సంజీవ్,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించుకోవాలి

**● లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ**



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 29 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్లను నాణ్యత ప్రమాణాలతో నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లో సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు.సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 48 వార్డుల నుండి 318 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, ఇండ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టాలని,ఇందిరమ్మ ఇండ్లను 400 నుంచి 600 చదరపు అడుగులలో నిర్మించుకోవాలని అన్నారు.ముగ్గులు పోసిన తర్వాత ఫొటో క్యాప్చర్ చేస్తామని తెలిపారు.బేస్ మెంట్ పూర్తి కాగానే లక్ష రూపాయలు, స్లాబ్ లెవెల్ గోడలు పూర్తి కాగానే లక్ష రూపాయలు, స్లాబ్ పూర్తి కాగానే 2 లక్షల రూపాయలు, ఇల్లు పూర్తి కాగానే లక్ష రూపాయలు ఇలా నాలుగు దశలలో 5 లక్షల రూపాయలను ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందన్నారు. తాపీ మేస్త్రీలు, సిమెంటు,ఇనుము లాంటి నిర్మాణసామాగ్రి ధరలు అదుపులో ఉంచేందుకు మున్సిపాలిటీ స్థాయిలో ధరల నియంత్రణకు ఆర్డీఓ స్థాయిలో ధరల మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకొని మేస్త్రీలతో,వ్యాపారస్తులతో మాట్లాడి ధరలను అదుపులో ఉంచేలా చూస్తారని అన్నారు. లబ్ధిదారులందరూ ప్రభుత్వం నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి తక్కువ ఖర్చుతో నాణ్యతతో ఇండ్లు కట్టుకోవాలని అన్నారు.సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో 318 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు పత్రాలు అందజేసినట్లు తెలిపారు. పేదవారికి ఇంకెవరికైనా ఇండ్లు రానివారు ఉంటే మరలా దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణు మాధవ్,హౌజింగ్ పిడి సిధార్థ, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, ఎస్సి కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్ నాయక్,హౌసింగ్ ఇన్స్పెక్టర్ అబ్దుల్లా, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం వద్ద 43 అడుగులకు చేరిన నీటిమట్టం

**● మొదటి ప్రమాద హెచ్చరిక జారీ**



**భద్రాచలం ఆగస్టు 29 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలం వద్ద ఎగువ కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. నదిలోకి 9.32. 288 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో, దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

## భర్త చావుకు కారణమైన భార్య అరెస్ట్

**దేవరకొండ, ఆగష్టు 29 (జనం సాక్షి) :** అక్రమసంభందం కారణంగా భర్త చావుకు ప్రధాన కారణమైన భార్యను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. దేవరకొండ మండలం షాకెల్లి గ్రామానికి చెందిన జహంగీర్ చిన్న కూతురైనా అఫ్సరా బేగంకు అమ్రాబాద్ మండలం మున్ననూరు గ్రామానికి చెందిన ఎం ఏ రహీం తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహం అనంతరం దేవరకొండలోనే నివసిస్తున్నారు. వీరుఇరువురికి ఒక కుమారుడు, పెళ్ళైన రెండు సంవత్సరాలకు ఎం ఏ రహీమ్ కు పక్షావాతం రావడంతో మాట పడిపోయింది. పక్షవాతంతో ఉన్న రహీమ్ కుటుంబ ఆర్థిక పరిస్థితి చూసి గత ప్రభుత్వం రహీం పేరిట డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించడం తో ఏడాది నుండి వీరు అక్కడే నివసిస్తున్నారు. వృత్తి రీత్యా రహీం డ్రైవర్ కావడంతో ప్రస్తుతం స్కూల్ పిల్లల కోసం ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తావున్నాడు. గత అరునెలలుగా రహిమ్ భార్య ఆఫ్సరా బేగం కు స్థానికుడైన అంకూరి రమేష్ అనే వ్యక్తితో అక్రమ సంభందం ఏర్పర్చు కున్నది. ఈ విషయం పై ఇరువురు తరుచు గొడవ పడేవారు. ఇంతలో నే ఈ నెల 6 న రహీం కత్తి పోటు కు గురై తీవ్ర రక్తస్రావం కాగా హైదరాబాద్ లోని గాంధీ హాస్పిటల్ తరలించారు. 5 రోజులపాటు చావు అంచుల్లో కొట్టుమిట్టడుతూ ఈ నెల 12 న రహీమ్ మరణించారు. రహీమ్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు శుక్రవారం రహీమ్ భార్య ఆఫ్సరా బేగం ను అరెస్ట్ చేశారు. అంకూరి రమేష్ పరారీలో ఉండగా పోలీసులు గాలిస్తున్నారు.




## సత్ప్రవర్తనతో ఆదర్శంగా జీవించాలి

**● జిల్లా ఎస్పీ నరసింహ**

**కోదాడ, ఆగస్టు 29 (జనం సాక్షి) :** కోదాడ సబ్ డివిజన్ వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్లు, గంజాయి సేవించేవారు ,అక్రమ రవాణాదారులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే ప్రతి ఒక్కరు తమ పాత అలవాట్లను మానుకొని సత్ప్రవర్తనతో ఆదర్శంగా జీవించాలని జిల్లా ఎస్పీ నరసింహ హితవు పలికారు... బుధవారం కోదాడ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో కోదాడ సబ్ డివిజన్ వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్లు మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువత కు నిర్వహించిన కౌన్సిలింగ్ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మార్గదర్శక నిబంధనలను సూచనలను చేశారు.... తాత్కాలిక సుఖం కోసం చెడు అలవాట్లకు లోనై కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతూ తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు... తెలిసి తెలియక చేసిన తప్పులను సరిదిద్దేందుకు తామిచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.. రెండోసారి నేరం చేస్తే అనివార్యంగా పీడియాక్టివ్ కేసును బనయించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమాజ శాంతి భద్రత పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. మాదకద్రవ్యాలకు అలవాటై భార్యా పిల్లలను వదిలివేస్తే వారి బతుకులు ఎలా ఉంటాయో అవగతం చేసుకొని మంచి పౌరులుగా మారాలని ఉదాహరణలతో వివరించారు. అవగాహన సదస్సుకు అధ్యక్షత వహించిన కోదాడ డి.ఎస్.పి శ్రీధర్ రెడ్డి, భవిష్యత్తులో నేరాలు చేయమని మంచి ప్రవర్తన కలిగి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన సదస్సులో సిఐలు చరమందరాజు ,ప్రతాప లింగం, శివ శంకర్ నాయక్, ఎస్ఐలు పాల్గొన్నారు.



## విద్యారంగ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు




**టేకులపల్లి, ఆగస్టు 29 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా విద్యారంగ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ విమర్శించారు. శుక్రవారం పి.డి.ఎస్.యు విద్యార్థి పోరుబాటయాత్ర ఇల్లెందుకు చేరుకున్న సందర్భంగా పట్టణంలో విద్యార్థులు స్వాగతం పలుకుతూ భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమా నికి ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణలో గడిచిన పది సంవత్సరాల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం విద్యను విధ్వంసం చేశారని, అందుకే తెలంగాణ సమాజమంతా ఏకమై కెసిఆర్ ని గద్దె దించారని, కెసిఆర్ పై ఉన్న వ్యతిరేకతను మూట గట్టుకొని అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి విద్యారంగాన్ని అభివృద్ధి చేయకుండా కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తూ ప్రభుత్వ విద్యను మరింత సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని రెండు సంవత్సరాలు గడిచిన నేటికీ విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వంగా ప్రఖ్యాతి తెచ్చుకుందని వారు అన్నారు. స్కూల్ స్థాయి నుండి యూనివర్సిటీల స్థాయి వరకు ప్రభుత్వ విద్యను అస్తవ్యస్తంగా మారుస్తూ దిశా నిర్దేశం లేకుండా గందరగోళానికి గురిచేస్తూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వ విద్యను పాతరేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో విద్యార్థులకు స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు రామ్‌చరణ్, అబ్దుల్ గని, విష్ణువర్ధన్,జార్జ్, సంధ్యా,శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**బూర్గంపహాడ్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** వాతావరణ మార్పుల వల్ల గ్రామాల్లో వైరల్ ఫీవర్ విజృంభిస్తున్నందున ఆశ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల ఆరోగ్యం పట్ల హెచ్ఎం, ఉపాధ్యాయులు, వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఐటీడీఏ పీవో రాహుల్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఉప్పుసాక బాలుర ఆశ్రమ పాఠశాలను, వడ్డెగూడెంలో జీపీఎస్ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఉప్పుసాక ఆశ్రమ పాఠశాలలో డార్మెటరీ, డైనింగ్హాల్, వంటగది, స్టోర్రూమ్ పరిశీలించి అనంతరం విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషిచేయాలని, ప్రతిరోజూ మెనూ ప్రకారం ఆహారం అందించాలని, స్టోర్రూమ్లో నాసిరకమైన ఆహార పదార్థాలు, డేట్ ముగిసినవి ఉంటే వెంటనే వాటిని తీసేసి జీసీసీ నుంచి సరఫరా అయ్యే ప్రతి వస్తువు నాణ్యతగా ఉన్నవి తీసుకోవాలన్నారు. వైద్యసేవలు పొందుతున్న విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకుని వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్యసేవలు అందించాలన్నారు. అనంతరం ప్రైమరీ స్కూల్లో ఉద్దీపకం వర్క్ బుక్ -2 నిర్వహణ తీరును పరిశీలించి చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులను ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు. ఉద్దీపకానికి సంబంధించి బోర్డుపై పదాలు రాయించి పీవో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వడ్డెగూడెం జీపీఎస్ పాఠశాలను సందర్శించి ఉద్దీపకం వర్క్ బుక్ - 2 చిన్నారులకు ఏ విధంగా బోధిస్తున్నదీ పరిశీలించి చిన్నారులను ఉద్దీపకంలో అంశాలను ఏ విధంగా చదువుతున్నది చూసి పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రతి అంశం ముందుగా చదువుకుని ఆ తర్వాత పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పుసాక హెచ్ఎం బీమ, వార్డెన్ శశికళ, ఎస్సీఆర్పీ మాధవి, వడ్డుగూడెం జీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు బాలు తదితరులు పాల్గొన్నారు.



## ప్యాక్స్ కేంద్రాల ద్వారా రైతులకు యూరియా సరఫరా



**పాలేరు, ఆగస్టు 29 (జనం సాక్షి) :** ప్యాక్స్ కేంద్రాల ద్వారా యూరియా సరఫరా చేయాలని కూసుమంచి క్యాంపు కార్యాలయంలో యూరియా పై అధికారులతో సమీక్ష నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజకవర్గంలో ప్యాక్స్ కేంద్రాల మాత్రమే యూరియా సరఫరా చేయాలని రాష్ట్రానికి రావాల్సిన యూరియా రానందున కేంద్రం సరిపడా ఇవ్వక పోవడం వలన ఇబ్బంది జరిగింది రామగుండం లో.కూడా. సాంకేతిక కారణాలు వలన ఉత్పత్తి జరగ లేదని రాబోయే 7రోజుల్లో 1600..మెట్రిక్. టన్నుల యూరియా రాబోతుందని పాలేరు నియోజకవర్గంలో ప్యాక్స్ కేంద్రాల ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కి సూచించారు. అక్రమ రవాణా అరికట్టాలని వ్యవసాయ శాఖ ద్వారా క్రమ పద్ధతిలో యూరియా సరఫరా అందుకు సంబంధించి కార్యాచరణ చేయాలని అన్నారు గత సంవత్సరం కంటే ఎక్కువ అమ్మినట్లు రికార్డులు ఉన్నవి కానీ క్షేత్ర స్థాయిలో ఇబ్బంది గానే ఉండటం అర్థం కావడం లేదు వ్యవసాయ సహకార శాఖ ల ద్వారా యూరియా అమ్మకం చేయాలని వ్యవసాయ శాఖ రెవిన్యూ శాఖ సహకార శాఖ లను సమన్వయం చేయాలని సిబ్బంది నీ డిప్యుటేషన్ ద్వారా తీసుకోవాలని పోలీస్ శాఖ సహకార ము కూడా. తీసుకుని ఎక్కడ ఒక్క బస్తా కూడా పక్క దారి పట్టకుండా చూసుకోవాలని రెవిన్యూ డివిజనల్ అధికారి పర్యేక్షణలో సెప్టెంబరు నెల వరకు టెంపర్. వరి లైసెన్సు ఇవ్వాలని ప్రతి సబ్సెంటర్.వద్ద. పోలీస్ అధికారులు బందోబస్తు ఉండాలని అన్నారు ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పాలేరు ప్రత్యేక అధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలి

**● సూర్యపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 29 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.శుక్రవారం సూర్యాపేటలోని గిరి నగర్ పట్టణ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓపి సేవల గురించి, మలేరియా,డెంగ్యూ ర్యాపిడ్ టెస్ట్ కిట్స్ ఎన్ని ఉన్నాయని,సీజనల్ వ్యాధులకు సంబందించి డెంగ్యూ, మలేరియా కేసులు ఏమైనా నమోదయ్యాయని అడిగి తెలుసు కున్నారు. ఏఎన సి రిజిస్టర్, ఫార్మసి స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు.అక్కడే ఉన్న ఆశా వర్కర్లని జ్వరం సర్వే చేస్తున్నారా, డెలివరీలు చేసేటప్పుడు జిజిహెచ్ నందు ఏమైనా సమస్యలు ఏర్పడుతున్నాయా, ప్రభుత్వ హాస్పిటల్ లో ఎన్ని సాధారణ డెలివరీలు అయ్యాయని అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ సందర్భంగా ఏడవ తరగతిని సందర్శించి వారి మ్యాథ్స్ నోట్ బుక్ ను పరిశీలించారు.ప్రతి ఒక్కరిచే ఇంగ్లీష్ చదివించారు. ఏ సబ్జెక్ట్ అయినా అర్థం కాకపోతే టీచర్లను అడగాలని, అదే విధంగా ఒకటికి పది సార్లు ప్రాక్టీస్ చేస్తే ఎక్కువ రోజులు గుర్తు ఉంటుందని విద్యార్థులకు సూచించారు. మధ్యాహ్న భోజనం బాగుంటుందా, టీచర్లు మంచిగా అర్థం అయ్యేలా చెప్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం ఎక్కువ నమోదయ్యేలా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని హెడ్ మాస్టర్ ని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణయ్య, మెడికల్ అధికారి శ్యామ్, ప్రధాన ఉపాధ్యాయులు యతిపతిరావు, ఉపాధ్యాయులు నరసింహారావు, స్టాఫ్ నర్స్ నాగమణి, ల్యాబ్ టెక్నిషియన్ సుష్మ, ఎఎన్ఎం అరుణ, ఆశా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే జూన్‌లోగా కలెక్టర్ నూతన కార్యాలయ భవనాన్ని పూర్తి చేయాలి

**● మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**నల్గొండ బ్యూరో, ఆగస్టు 29 (జనం సాక్షి) :** నల్గొండ కలెక్టర్ నూతన కార్యాలయ భవనం గ్రౌండ్ ఫ్లోర్ ను డిసెంబర్ లోగా, పూర్తి భవనాన్ని వచ్చే జూన్ 2 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. శుక్రవారం అయన పాత కలెక్టర్ కార్యాలయం వెనకవైపు నిర్మిస్తున్న కలెక్టర్ నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 82 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల తో నిర్మిస్తున్న ఈ భవనంలో పూర్తిగా రెవెన్యూ విభాగం, జిల్లా కలెక్టర్ ,అదనపు కలెక్టర్ల ఛాంబర్ లు, మంత్రి ఛాంబర్, ఉండేలా ఏర్పాటు చేయాలని, పాత కలెక్టర్ కార్యాలయంలో పూర్తిగా జిల్లాలోని అన్ని శాఖల అధిపతుల కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, ఇందుకుగాను పాత కలెక్టర్ కార్యాలయాన్ని పూర్తిగా ఆధునీకరించాలని ఆదేశాలు జారీ చేశారు. కొత్త కలెక్టర్ కార్యాలయంలో మీటింగ్ హాల్ ను ఫాల్ సీలింగ్, ఎల్ఈడి స్క్రీన్లు, అన్ని సౌకర్యాలతో నిర్మించాలని చెప్పారు. కొత్త కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ అంచనాలను ఎట్టి పరిస్థితులలో మార్చకూడదని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. గ్రౌండ్ ఫ్లోర్ ను డిసెంబర్ నాటికి పూర్తి చేసి ఇవ్వాలని, కార్యాలయ భవనం మొత్తాన్ని జూన్ 2 నాటికి పూర్తి చేసి అప్పగించాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. భవన నిర్మాణ పనులు, నాణ్యత పై ప్రత్యేక దృష్టి నిలపాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి , నల్గొండ ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, కాంట్రాక్టర్ రామ్ ప్రసాద్, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

# 24 గంటల్లో హత్య కేసును ఛేదించిన నల్గొండ పోలీసులు

**● నిందితుడి అరెస్టు**

**నల్గొండ బ్యూరో, ఆగస్టు 29 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా కేంద్రంలో నిద్రిస్తున్న వ్యక్తి తలపై బండరాయి మోది దారుణంగా హత్య చేసిన కేసును నల్గొండ పోలీసులు 24 గంటల్లో చేధించారు. హత్య చేసిన నిందితున్ని నల్గొండ వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నల్గొండ పట్టణంలో ఈ నెల 28 వ తేదీ అర్ధరాత్రి జరిగిన ఈ కేసులో నిందితుడిని సీసీ టీ వీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించి అరెస్టు చేశారు. నల్లగొండ స్థానికుల సమాచారం మేరకు స్థానిక దేవరకొండ రోడ్డు లో గల ప్రతిక్ రెడ్డి జూనియర్ కాలేజి పక్కన ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్ వద్ద నిద్రిస్తున్న నాంపల్లి కి చెందిన చింతకింది రమేష్ ను బండరాయి తో తలపై మోది చంపిన విషయం లో రమేష్ బావ భూషిపాక వెంకటయ్య పిర్యాదు మేరకు నల్గొండ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశానుసారం నల్గొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి ఆధ్వర్యంలో నిందితుడిని పట్టుకునేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో క్లూస్ టీమ్స్ సిబ్బంది సాయంతో నేర స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అక్కడ లభించిన సమాచారంతో పాటు ఆధారాలతో చుట్టుపక్కల ఉన్న సీ సీ టీవీ ఫుటేజ్ లతో నేరస్తుడిని గుర్తించడం జరిగింది. ఈ క్రమంలో ఈరోజు ఉదయం 6 గంటలకు రెహమాన్ బాగ్ లోని ధమాకా బజార్ దగ్గర నిద్రిస్తున్న నిందితుడిని వన్ టౌన్ పోలీస్ సిబ్బంది పట్టుబడి చేసి విచారించగా, నేరస్తుడు తాను చేసిన నేరం ఒప్పుకోవడం జరిగింది. ఈ కేసును డీఎస్పీ కె. శివరాం రెడ్డి ఆధ్వర్యంలో వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి తన బృందాలతో కేవలం 24 గంటల లోపు ఛేదించినందుకు నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి, వన్ టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎస్సై వెంకట్ నారాయణ, ఏఎస్ఐ వెంక ట్ యాదవ్, సిబ్బంది రబ్బాని, షకీ ల్, శ్రీకాంత్, శంకర్, జానకి రాములు, సైదులు లను ఎస్పీ అభినందించారు.



## కొత్త పరిశ్రమలకు అనుమతులు వేగంగా ఇవ్వాలి

**● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 29 (జనంసాక్షి) :** కొత్త పరిశ్రమలకు అనుమతులను వేగంగా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ,టిజి ఐపాస్ కమిటీ సమావేశంలో వివిధ పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు తదితర అంశాలపై సమీక్షించారు.పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు సకాలంలో అనుమతులు జారీ చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో టీ ప్రైడ్ పథకం కింద 101 వాహనాలకు రాయితీ మంజూరు చేయడం జరిగిందని, జిల్లాలోని పరిశ్రమలు ముఖ్యంగా రైస్ మిల్లులు భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ సీతారాం నాయక్,విద్యుత్ శాఖ ఏడి అశోక్, జిల్లా టౌన్, కంట్రి ప్లానింగ్ అధికారి మాధవి, ఫాక్టరీస్ ఇన్స్పెక్టర్ శ్రీదేవి, ఎస్సి కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వాట్సప్ స్క్రీన్ షేరింగ్‌తో జాగ్రత్త

### తెలంగాణ పోలీసుల హెచ్చరిక



తెలంగాణ పోలీసులు సైబర్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ, వాట్సప్ స్క్రీన్ షేరింగ్‌తో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కస్టమర్ సపోర్ట్ లేదా బ్యాంక్ సిబ్బందిగా చెప్పుకుంటూ కాల్స్ చేసి స్క్రీన్ షేరింగ్ ఆప్షన్ ఇవ్వమని కోరితే అస్సలు నమ్మొద్దని సూచించారు. ఇలాంటి మోసాల ద్వారా సాయం చేస్తామని నమ్మించి బ్యాంకు ఖాతాలోని డబ్బులు, ఓటీపీ, ఖాతా వివరాలను దొంగిలిస్తారని హెచ్చరించారు. అపరిచిత కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో ఏమరపాటుగా ఉండొద్దని, సన్నిహితులు, కుటుంబ సభ్యులకు ఈ మోసాల గురించి అవగాహన కల్పించాలని పోలీసులు కోరారు. అలాగే, వాట్సప్ గ్రూపుల్లో వచ్చే పెట్టుబడి సలహాలను నమ్మవద్దని, తెలియని గ్రూపుల్లో చేరొద్దని, సులభంగా డబ్బు సంపాదన ఆశతో లింకులపై క్లిక్ చేయొద్దని సూచించారు. ఫేక్ స్క్రీన్‌షాట్లు, యాప్‌లు, ఏపీకే ఫైళ్ల ద్వారా మోసాలు జరుగుతాయని, అపరిచితుల సలహాలతో పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవద్దని పోలీసులు హెచ్చరించారు.

# జియో ఐపీవో.. ముఖేష్ అంబానీ కీలక ప్రకటన



రిలయన్స్ ఇండస్ట్రీస్ 48వ వార్షిక సర్వసభ్య సమావేశంలో చీఫ్ ముఖేష్ అంబా నీ మాట్లాడుతూ, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న జియో ఐపీవోపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2026 తొలి ఆరు నెలల్లో ఐపీవో తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. భారతదేశం ప్రపంచం లోని నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో జీడీపీ వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మధ్య కూడా భారత్ పురోగతిని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. భారత్ తన స్వంత 'ఇండియా ఫస్ట్' మోడల్‌ను సృష్టించగలదని, డీప్ టెక్నాలజీతో దేశ భద్రతను బలోపేతం చేస్తూ, ప్రజల జీవితాలను మెరుగుపరచి, పర్యావరణాన్ని కాపాడే మోడల్‌ను రూపొందిస్తామని అంబానీ పేర్కొన్నారు. రిలయన్స్ తన స్వర్ణ దశాబ్దం వైపు సాగుతూ, భారతీయ కలను సాకారం చేసేందుకు అంకితమైనట్లు తెలిపారు. కంపెనీ తమ వ్యాపారాలను ఏఐ, డీప్-టెక్ సాంకేతికతలతో బలోపేతం చేస్తోందని, 'వీ కేర్' తత్వంతో ప్రజల శ్రేయస్సు, పర్యావరణ రక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కొత్త తరం నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ, జియో ఒక డీప్-టెక్ కంపెనీగా మారినట్లు వివరిం చారు. జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ మాట్లాడుతూ, భారత్‌ను ప్రపంచంలోని మొదటి ఏఐ నేటివ్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు పునాది వేస్తున్నామని అన్నారు. జియో 50 కోట్లకు పైగా కస్టమర్లకు సేవలందిస్తూ, 5జీ, ఏఐ సాంకేతికతలను భారత్‌లోనే అభివృద్ధి చేసి దేశ డిజిటల్ భవిష్యత్తును రూపొందిస్తోందని తెలిపారు. జియో ఎయిర్‌ఫైబర్ ప్రపంచంలోనే అతిపెద్ద స్థిర వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందిస్తూ, నెలకు 10 లక్షలకు పైగా గృహాలకు సేవలు అందిస్తోందని ఆకాశ్ అంబానీ వెల్లడించారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
| --- | --- | --- |
| హైదరాబాద్ | ₹ 510 | ₹ 61.2 |
| వరంగల్ | ₹ 507 | ₹60.8 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్
₹1,03,310 (24 క్యారెట్లు) | ₹94,700 (22 క్యారెట్లు)

చెన్నై
₹ 94,700 (22 క్యారెట్లు) | ₹1,03,310 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹1,19,900

## సాంసంగ్ గెలాక్సీ ఏ17 5జీ భారత్‌లో విడుదల

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ సాంసంగ్ తన ఏ-సిరీస్‌లో కొత్త స్మార్ట్‌ఫోన్ గెలాక్సీ ఏ17 5జీని భారత మార్కెట్‌లో విడుదల చేసింది. ఈ ఫోన్ 6 ఏళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, సెక్యూరిటీ అప్‌డేట్స్‌తో వస్తుందని కంపెనీ హామీ ఇచ్చింది. గెలాక్సీ ఏ17 5జీలో 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీం ఇన్ఫినిటీ-యూ సూపర్ అమోలెడ్ డిస్ప్లే ఉంది, ఇది 90 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ ప్రొటెక్షన్‌తో వస్తుంది. ఈ ఫోన్ ఎక్సినోస్ 1330 ప్రాసెసర్‌తో ఆధారితమై, ఆండ్రాయిడ్ 15 ఆధారంగా వన్ యూఐ 7తో పనిచేస్తుంది. వెనుకవైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా, 5 ఎంపీ అల్ట్రావైడ్, 2 ఎంపీ మాక్రో కెమెరాలతో ట్రిపుల్ కెమెరా సెటప్, ముందువైపు 13 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంది. ఇది 5,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 25వాట్ ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఈ ఫోన్ బ్లాక్, బ్లూ, గ్రే కలర్లలో లభిస్తుంది.

## ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉర్జిత్ పటేల్ నియమితులు



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ డాక్టర్ ఉర్జిత్ పటేల్ అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. వాషింగ్టన్ డీసీలోని ఈ బహుళపక్ష ఆర్థిక సంస్థలో ఆయన మూడేళ్ల పాటు లేదా తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని నియామకాల కమిటీ ఈ నిర్ణయాన్ని ఆమోదించగా, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వశాఖ ఈ నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసింది. ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సంస్థ రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది, ఇందులో 25 మంది డైరెక్టర్లు ఉంటారు, వీరిని సభ్య దేశాలు లేదా దేశాల గుండులు ఎన్నుకుంటాయి. 2016 సెప్టెంబర్ నుంచి 2018 డిసెంబర్ వరకు ఉర్జిత్ పటేల్ ఆర్బీఐ 24వ గవర్నర్‌గా సేవలందించారు. ఆయన పదవీకాలం ముగియకముందే ఆకస్మికంగా రాజీనామా చేశారు. ఆర్బీఐ గవర్నర్‌గా ఉన్న సమయంలో ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ బ్యాంక్ డైరెక్టర్‌గా, ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఇనిస్టిట్యూట్ సలహా బోర్డు సభ్యుడిగా పనిచేశారు. కెరీర్ ప్రారంభంలో ఐఎంఎఫ్‌లో ఆర్థికవేత్తగా, ఆర్బీఐలో డిప్యూటీ గవర్నర్‌గా సేవలందించారు. 2022-24 మధ్య చైనా మద్దతుగల ఆసియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా కూడా వ్యవహరించారు.

## సెక్యూరిటీ గార్డుకు రూ.3.14 కోట్ల పన్ను నోటీసు





కాన్పూర్కు చెందిన ఓమే శుక్లా అనే ప్రైవేటు సెక్యూరిటీ గార్డు, నెలకు రూ.10 వేలు సంపాదిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, దిల్లీ సెంట్రల్ జీఎస్టీ శాఖ నుంచి ఆయనకు రూ.3.14 కోట్ల పన్ను నోటీసు జారీ అయింది. నోటీసు ప్రకారం, శుక్లా పేరిట రూ.17.47 కోట్ల టర్నోవర్తో వస్త్ర వ్యాపారం నడుస్తున్నట్లు రికార్డుల్లో నమోదైంది. రెండు వారాల క్రితం ఒక పేజీ నోటీసు వచ్చినట్లు, ఆ తర్వాత ఆగస్టు 21న 32 పేజీల వివరణాత్మక నోటీసు అందినట్లు శుక్లా తెలిపారు. ఈ నోటీసులో ఆయన పేరు, చిరునామా, పాన్ నంబర్తో పాటు, ప్రధాన వస్త్ర వ్యాపారిగా చూపిస్తూ ఏడు రోజుల్లో పన్ను శాఖ ముందు హాజరుకావాలని ఆదేశించారు. ఎవరో శుక్లా పాన్‌కార్డ్‌ను దుర్వినియోగం చేసి, ఆయన పేరిట కంపెనీలు రిజిస్టర్ చేసి, రూ.17 కోట్ల వ్యాపారం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై శుక్లా మొదట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీజీఎస్టీ అధికారులను సంప్రదించాలని సూచించారు. దీంతో శుక్లా కాన్పూర్‌లోని సీజీఎస్టీ కమిషనర్ రోషన్‌లాల్‌ను కలిసి, తనకు ఈ ఆరోపణలతో ఎలాంటి సంబంధం లేదని వివరించారు. లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని కమిషనర్ సూచించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని, నేరస్తులకు కఠిన శిక్ష విధించాలని శుక్లా డిమాండ్ చేశారు. తన డాక్యుమెంట్లను దుర్వినియోగం చేసిన వారిని గుర్తించి, ఇలాంటి మోసాలు ఇతరులకు జరగకుండా చూడాలని కోరారు.

## భారత్‌తో వాణిజ్యం రష్యాకే లాభం: ఉక్రెయిన్




రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తీవ్రమవుతున్న తరుణంలో భారత్‌లోని ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పొలిషుక్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గదని, తమ భూభాగాల ఆక్రమణను ఎప్పటికీ సహించబోమని స్పష్టం చేశారు. భారత్‌తో వాణిజ్యం ద్వారా రష్యాకే ఎక్కువ లాభం చేకూరుతోందని ఆయన ఆరోపించారు. రాయితీ ధరలకు ముడి చమురును భారత్‌కు విక్రయిస్తూ రష్యా లాభపడుతోందని, ఈ సొమ్మును అధ్యక్షుడు పుతిన్ సామాజిక అభివృద్ధి కోసం కాకుండా ఉక్రెయిన్‌పై యుద్ధానికి ఉపయోగిస్తున్నారని పొలిషుక్ విమర్శించారు. వచ్చే ఏడాది రష్యా సామాజిక కార్యక్రమాల నిధుల విషయంలో తీవ్ర సవాళ్లను ఎదుర్కోనుందని ఆయన అభిప్రాయపడ్డారు. శాంతి చర్చల్లో భారత్ పాత్ర కీలకమని అమెరికా సలహాదారు పీటర్ నవారో చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈ అంశాన్ని అమెరికా రాయబారిని అడగాలని ఆయన సూచించారు. యుద్ధాన్ని ముగించేందుకు భారత్, ముఖ్యంగా ప్రధాని మోదీ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. ఉక్రెయిన్ జాతీయ దినోత్సవం సందర్భంగా మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీకి లేఖ రాసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, జెలెన్స్కీ భారత్‌లో పర్యటించే అవకాశం ఉందని, గత ఏడాదిగా ఆహ్వానం పెండింగ్‌లో ఉందని తెలిపారు.

## గూగుల్, రిలయన్స్ భాగస్వామ్యంతో భారీ పెట్టుబడులు

గూగుల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ కలిసి రిటైల్, టెలికాం, ఫైనాన్షియల్ రంగాల్లో భారీ పెట్టుబడులు చేయనున్నట్లు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యం ద్వారా భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ తెలిపారు. ఈ సందర్భంగా, గూగుల్‌తో కలిసి అత్యాధునిక సాంకేతికతను ఉపయో గించి, ఈ రంగాల్లో వినూత్న సేవలను అందించే లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పెట్టుబడులు భారతదేశంలో డిజిటల్ విప్లవాన్ని వేగవంతం చేసి, వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడంతో పాటు, ఆర్థిక వృద్ధికి దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.





# ప్రీమియం విమాన టికెట్లపై జీఎస్టీ 18 శాతానికి పెంపు


### కేంద్రం ప్రతిపాదన

కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో సంస్కరణలకు సిద్ధమవుతోంది. ఇకపై జీఎస్టీలో 5 శాతం, 18 శాతం అనే రెండు శ్లాబులు మాత్రమే ఉంటాయని, కొన్ని ఉత్పత్తులకు మాత్రమే ప్రత్యేక రేట్లు వర్తిస్తాయని ఆర్థిక మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో, బిజినెస్, ప్రీమియం ఎకానమీ, ఫస్ట్ క్లాస్ విమాన టికెట్లపై జీఎస్టీని ప్రస్తుత 12 శాతం నుంచి 18 శాతానికి పెంచాలని కేంద్రం యోచిస్తోంది. ఈ టికెట్లకు ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) సౌలభ్యం వర్తించనుంది, అయితే ఇది వ్యాపార కార్యకలాపాలతో ముడిపడి ఉన్న ప్రయాణాలకు మాత్రమే పరిమితం. ప్రస్తుతం ఎకానమీ క్లాస్ టికెట్లపై 5 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. ఇక బ్యూటీ, వెల్నెస్ సేవలపై 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని, అయితే ఈ సేవలకు ఐటీసీ వర్తించదని ప్రతిపాదనలు ఉన్నాయి. అలాగే, రూ.100లోపు ధర ఉన్న సినిమా టికెట్లపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని, ఐటీసీ సౌలభ్యంతో ఈ మార్పును అమలు చేయాలని సిఫారసులు ఉన్నాయి. నిత్యావసర ఉత్పత్తులపై జీఎస్టీ రేట్లను తగ్గిస్తామని, దీపావళి నాటికి ఈ మార్పులతో పండగ ఆనందాన్ని రెట్టింపు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ ప్రతిపాదనలను సెప్టెంబర్ 3, 4 తేదీల్లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన చర్చించి ఆమోదించనున్నారు. ఇప్పటికే రెండు శ్లాబుల (5%, 18%) విధానానికి మంత్రుల బృందం ఆమోదం తెలిపింది. ఐటీసీ అనేది వ్యాపార ప్రయోజనాల కోసం కొనుగోలు చేసిన వస్తువులు, సేవలపై చెల్లించిన జీఎస్టీని విక్రయాల ద్వారా వసూలు చేసిన పన్నుతో సర్దుబాటు చేసుకునే సౌలభ్యం.



# స్టాక్ మార్కెట్లలో నష్టాలు

### సెన్సెక్స్ 80వేల కంటే దిగువకు, రూపాయి 88.19కి పతనం





దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల ఊబిలో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల సంకేతాలు, టారిఫ్ ఆందోళనలు సూచీల సెంటిమెంట్ ను దెబ్బతీస్తున్నాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో మార్కెట్లు ఒడిదొడుకులకు లోనై, చివరకు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 80వేల మార్క్‌ను కోల్పోగా, నిఫ్టీ 24, 500 దిగువకు పడిపోయింది. ఉదయం సెన్సెక్స్ 80,010 వద్ద లాభాలతో ప్రారంభమై, ఒక దశలో 80,300 మార్క్‌ను అధిగమించింది. అయితే, ఈ ఊపు ఎక్కువసేపు నిలవలేదు. దిగ్గజ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను కుదిపేసింది. ఫలితంగా సెన్సెక్స్ 79,741.76 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకి, 270.92 పాయింట్ల నష్టంతో 79,809.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 74.05 పాయింట్లు కోల్పోయి 24,426.85 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, ఐటీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్, ట్రెంట్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడగా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్, అపోలో హాస్పిటల్స్, అదానీ ఎంటర్ప్రైజెస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు నష్టపోయా.యిం టారిఫ్ ప్రభావంతో రూపాయి విలువ భారీగా క్షీణించి, తొలిసారిగా 88 మార్క్‌ను దాటింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 61 పైసలు పతనమై 88.19 వద్ద ముగిసింది. ఈ ఏడాది రూపాయి విలువ 3 శాతం తగ్గినట్లు గమనించవచ్చు.

# అమెరికాకు జపాన్ షాక్

**టోక్యో (జనంసాక్షి) :** ప్రధాని నరేంద్ర మోదీ టోక్యో సందర్శన సమయంలో, భారీ సుంకాలతో విరుచుకుపడుతున్న అమెరికా కు జపాన్ ఊహించని ఎదురుదెబ్బ ఇచ్చింది. పెట్టుబడులపై చర్చించేందుకు అమెరికా సందర్శించా ల్సిన జపాన్ వాణిజ్య మంత్రి ర్యోసీ అకజవా చివరి నిమిషంలో తన పర్యటనను రద్దు చేసుకున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జపాన్ వస్తువులపై 25 శాతం సుంకాలు విధించడంతో, టోక్యో అమెరికాలో 550 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో బదులిచ్చేందుకు సిద్ధమైంది. ఈ వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాలు చర్చలు ప్రారంభించాయి, అమెరికా సుంకాలను 15 శాతానికి తగ్గించే ఆలోచనలో ఉంది. ఈ చర్చల కోసం మంత్రి అకజవా గురువారం అమెరికా బయల్దేరాల్సి ఉండగా, పరిపాలనా స్థాయిలో మరికొన్ని అంశాలపై చర్చ అవసరమని జపాన్ వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారి యోషిమసా హయాషి తెలిపారు. దీంతో, ఒప్పందం ఆలస్యం కానుంది. మోదీ పర్యటన సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. మోదీ రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం టోక్యో చేరుకున్నారు. 15వ భారత్-జపాన్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొని, జపాన్ ప్రధాని ఇషిబాతో ఏఐ, సెమీకండక్టర్లు, బుల్లెట్ రైలు, పెట్టుబడులపై చర్చించనున్నారు. ఆ తర్వాత, ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో చైనాలోని తియాంజిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సులో పాల్గొంటారు.

## రష్యా చమురు కొనుగోళ్లపై భారత్‌కు అమెరికా సెనేటర్ హెచ్చరిక

**పోలాండ్ :** అమెరికా సెనేటర్ లిండ్సే గ్రాహం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్‌లపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రష్యాకు మద్దతిస్తూ భారత్ ఇప్పటికే భారీ మూల్యం చెల్లించుకుంటోం దని, ఇతర దేశాలు కూడా ఇదే గతి పడతాయని హెచ్చరించారు. రష్యా నుంచి చౌకగా చమురు కొనుగోలు చేయడం వల్ల ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధానికి ఊతమిస్తున్నారని, దీని వల్ల అమాయక ప్రజలు, పిల్లలు మరణిస్తున్నారని ప్రశ్నించారు. ఈ చర్యల వల్ల భారత్‌పై అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలు విధించిందని, రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే ఇతర దేశాలకూ ఇలాంటి పరిణామాలు తప్పవని ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్టు చేశారు. ఉక్రెయిన్‌లోని కీవ్‌పై రష్యా క్షిపణి దాడిలో 23 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధ ఒత్తిడిని పెంచేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఈ సుంకాల విధానాన్ని సమర్థించారు.

## పోలాండ్‌లో ఎఫ్-16 ఫైటర్ జెట్ కూలి పైలట్ మృతి



పోలాండ్‌లోని రాడోమ్‌లో జరిగిన ఎయిర్‌షో రిహార్సల్ సమయంలో ఓ దారుణ ప్రమాదం చోటుచేసుకుంది. పోలిష్ వైమానిక దళానికి చెందిన ఎఫ్-16 యుద్ధ విమానం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ఘటనలో పైలట్ ప్రాణాలు కోల్పోయారు. విమానం కూలిన వెంటనే భారీగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంపై పోలాండ్ ఉప ప్రధాని వ్లాడిస్లా కోసినియాక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, పైలట్ మరణించినట్లు ధృవీకరించారు. ఈ ఘటనకు కారణాలను కనుగొనేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. రిహార్సల్‌ను వీక్షిస్తున్న స్థానికులు ఈ దృశ్యాలను తమ కెమెరాల్లో రికార్డు చేసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో, ఆ వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఈ ప్రమాదం కారణంగా ఆగస్టు 30-31న జరగాల్సిన రాడోమ్ ఎయిర్‌షో రద్దు చేయబడింది.

# ఐటీఆర్ ఫైలింగ్, జన్ ధన్ రీ-కేవైసీ, ఎస్బీఐ కార్డ్ మార్పులు సహా కీలక గడువులు

*తపాలా శాఖకు సంబంధించి సెప్టెంబర్ 1 నుంచి కీలక మార్పు అమల్లోకి రానుంది. రిజిస్టర్డ్ పోస్టును స్పీడ్ పోస్టులో విలీనం చేస్తోంది. ఇకపై దేశీయ డెలివరీల కోసం ఒకే స్పీడ్ పోస్ట్ సర్వీస్. ఉండనుంది. దీనిద్వారా కార్యకలాపాలు సులభమవడం. వేగవంతమైన డెలివరీ, ట్రాకింగ్ మెరుగుపడనుంది.*





సెప్టెంబర్ నెలలో ఆర్థిక రంగంలో పలు ముఖ్యమైన గడువులు, మార్పులు అమల్లోకి రానున్నాయి. ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్) ఫైలింగ్, జన్ ధన్ ఖాతాల రీ-కేవైసీ, క్రెడిట్ కార్డ్ నియమాలు, తపాలా సేవల్లో సంస్కరణలు వంటి కీలక అంశాలు ఈ నెలలో ఉన్నాయి. 2025-26 మదింపు సంవత్సరానికి సంబంధించి ఆడిట్ అవసరం లేని పన్ను చెల్లింపుదారులు సెప్టెంబర్ 15లోగా ఐటీఆర్ దాఖలు చేయాలి. ఈ గడువును దాటితే జరిమానాలు, వడ్డీ ఛార్జీలు విధించే అవకాశం ఉంది. చివరి నిమిషంలో సాంకేతిక ఇబ్బందులను నివారించేందుకు ముందుగానే ఫైలింగ్ పూర్తి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. జన్ ధన్ ఖాతాదారులు సెప్టెంబర్ 30లోగా రీ-కేవైసీ పూర్తి చేయాలి, లేనియడల ఖాతా వినియోగంపై ఆంక్షలు విధించవచ్చు, ఇది నగదు విత్‌డ్రాయల్, సబ్సిడీ బదిలీలు, ఇతర సేవలపై ప్రభావం చూపనుంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు పంచాయతీ స్థాయిలో రీ-కేవైసీ శిబిరాలను నిర్వహిస్తున్నాయి, కొన్ని బ్యాంకులు ఇంటివద్ద లేదా ఆన్‌లైన్‌లో కేవైసీ సౌకర్యం కల్పిస్తున్నాయి. సెప్టెంబర్ 1 నుంచి ఎస్బీఐ క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు కొత్త రివార్డ్ నియమాలు అమల్లోకి వస్తాయి. లైఫ్‌స్టైల్ హోమ్ సెంటర్ ఎస్బీఐ కార్డ్, సెలెక్ట్, ప్రైమ్ కార్డ్ హోల్డర్లు డిజిటల్ గేమింగ్, ప్రభుత్వ చెల్లింపులపై రివార్డ్ పాయింట్లు పొందలేరు. సెప్టెంబర్ 16 నుంచి క్రెడిట్ కార్డ్ ప్రొటెక్షన్ ప్లాన్‌లో మార్పులు అమలవుతాయి, రెన్యూవల్ సమయంలో కస్టమర్లు క్లాసిక్, ప్రీమియం, ప్లాటినం వేరియంట్‌లకు ఆటోమేటిగ్గా మారుతారు. సెప్టెంబర్ 1 నుంచి తపాలా శాఖ రిజిస్టర్డ్ పోస్టను స్పీడ్ పోస్ట్‌లో విలీనం చేస్తోంది, దీనివల్ల దేశీయ డెలివరీలు వేగవంతమై, ట్రాకింగ్ మెరుగుపడనున్నాయి. అత్యవసర, సురక్షిత పార్సిళ్లు స్పీడ్ పోస్ట్‌గా మాత్రమే బుక్ చేయాలి.

సెప్టెంబర్ 3న మిలాద్-ఉన్-నబీ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో బ్యాంకులు మూతపడతాయి, కానీ రెండు, నాలుగో శనివారాలు, ఆదివారాలు తప్ప మిగిలిన రోజుల్లో బ్యాంకు సేవలు అందు బాటులో ఉంటాయి. అదనంగా, ఎన్‌పీఎస్ నుంచి యూపీఎస్‌కు మారాలనుకునే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సెప్టెంబర్ 30 వరకు గడువు ఉంది. ఎల్‌పీజీ సిలిండర్ ధరల్లో మార్పులు సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

### బ్యాంక్ సెలవులు

సెప్టెంబరు నెలలో బ్యాంకులు పూర్తి స్థాయిలో పని చేయనున్నాయి. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా సెప్టెంబర్ 3వ తేదీ శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లోని బ్యాంకులు తెరుచుకోవు. 2 4 శనివారాలు, ఆదివారాలు మినహా మిగిలిన అన్ని రోజుల్లో బ్యాంకు సేవలు కొనసాగుతాయి. ఇవేకాకుండా.. ఎన్పీఎస్ నుంచి యూపీఎస్కు మారాలనుకునే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సెప్టెంబర్ 30 వరకు మాత్రమే గడువు ఉంది. దీంతోపాటు ఎల్పిజీ సిలిండర్ ధరల్లో ఏవైనా మార్పులు ఉంటే సెప్టెంబర్ ఒకటి నుంచి అవి అమల్లోకి రానున్నాయి

## సిక్కు వ్యక్తిని కాల్చి చంపిన అమెరికా పోలీసులు

### గట్కా ప్రదర్శన వివాదంగా మారిన ఘటన



అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో సిక్కు వ్యక్తి గురుప్రీత్ సింగ్ (35) రోడ్డుపై కత్తితో విన్యాసాలు చేస్తూ సిక్కుల పురాతన యుద్ధ కళ గట్కాను ప్రదర్శిస్తుండగా, పోలీసులు అతడిని కాల్చి చంపిన ఘటన జరిగింది. జూలై 13న ఫిగ్యురోవా స్ట్రీట్, ఒలింపిక్ బౌలేవార్డ్ జంక్షన్ వద్ద గురుప్రీత్ తన కారును రోడ్డు మధ్యలో ఆపి, రెండు అడుగుల పొడవైన కత్తితో గట్కా ప్రదర్శన చేస్తూ, రాహదారిపై ఉన్నవారిపై కత్తిని ఊపుతూ హల్‌చల్ సృష్టించాడని పోలీసులు తెలిపారు. ఈ సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న లాస్ ఏంజిల్స్ పోలీసులు (ఎల్‌ఏపీడీ) గురుప్రీత్‌ను కత్తిని వదిలేయమని హెచ్చరించారు. అయినప్పటికీ, ఆయన పోలీసుల ఆదేశాలను పాటించకుండా, తన కారులోకి తిరిగి వెళ్లి, నీటి సీసాను పోలీసులపై విసిరి, కత్తిని ఊపుతూ కారులో పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతడి కారు ఇతర వాహనాలను ఢీకొనడంతో నిలిచిపోయింది. కారు నుంచి దిగిన గురుప్రీత్ పోలీసులపై కత్తితో దాడి చేసేందుకు యత్నించినట్లు ఎల్‌ఏపీడీ ఆరోపించింది. దీంతో పోలీసులు కాల్పులు జరపగా, గాయపడిన గురుప్రీత్‌ను ఆసుపత్రికి తరలించినప్పటికీ చికిత్స సమయంలో మరణించాడు. ఈ ఘటనకు సంబంధించిన బాడీ కెమెరా ఫుటేజీని ఎల్‌ఏపీడీ తమ యూట్యూబ్ ఛానెల్‌లో విడుదల చేసింది. ఈ సంఘటనపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, సాక్ష్యాల సేకరణ, సమాచార విశ్లేషణ ఆధారంగా వాస్తవాలు మారవచ్చని పోలీసులు తెలిపారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- జల దిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాల సందర్శన

**బోధన్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల వరద తాకిడికి గురైన ప్రాంతాలలో సహాయక చర్యలను ముమ్మరం చేశామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ కారణంగా జల దిగ్బంధంలో చిక్కుకున్న బోధన్ మండలంలోని కొప్పర్గ, హంగర్గ, సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామాలను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. వరద తీవ్రతను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముంపునకు గురైన గ్రామాల ప్రజలను బోట్ లు, ట్రాక్టర్లు, జేసీబీల సహాయంతో పునరావాస శిబిరాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న తీరును పరిశీలించిన కలెక్టర్, ఎక్కడ కూడా ప్రాణ నష్టం వంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునరావాస శిబిరాలలో ఆశ్రయం ఉంటున్న వారికి భోజనం, మంచి నీరు వంటి సదుపాయాలు కల్పించాలని, ముంపు గ్రామాలలో ఎవరు కూడా చిక్కుబడిపోకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది అందరూ వరద బాధితులకు సహాయంగా నిలుస్తూ, వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలని, ప్రభుత్వ యంత్రాంగం యావత్తూ వారి వెంటే ఉందన్న భరోసాను కల్పించాలని హితవు పలికారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురైన వరి, సోయా, పత్తి, కంది తదితర పంటలను కలెక్టర్ పరిశీలించారు. వరద నీటి ఉద్ధృతి తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే జరిపించి పంట నష్టం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతామని బాధిత రైతులకు తెలిపారు. ప్రస్తుతం ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటూ, వరద బాధితులకు సహాయక చర్యలు కొనసాగించడంపై దృష్టిని కేంద్రీకరించామని అన్నారు. శ్రీరాంసాగర్ కు వరద పోటెత్తడం వల్ల బ్యాక్ వాటర్ కారణంగా ఆయా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని శ్రీరాంసాగర్ రిజర్వాయర్ ద్వారా 5 లక్షల క్యూసెక్కుల పైచిలుకు వరద జలాలను ఫ్లడ్ గేట్ల ద్వారా దిగువ గోదావరిలోకి వదులుతున్నామని తెలిపారు.



దీనివల్ల ముంపు గ్రామాల్లో బ్యాక్ వాటర్ తగ్గి, శుక్రవారం సాయంత్రం నాటికి జలదిగ్బంధం నుండి బయటకు వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఎస్.డీ.ఆర్.ఎఫ్ బృందాలు, 7వ బెటాలియన్ పోలీసు బృందాలు సహయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయని, వరద తగ్గిన వెంటనే దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు తదితర వాటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి సదుపాయాలు పునరుద్ధరిస్తామని అన్నారు. భారీ వర్షాలతో వరద ఉద్ధృతి కొనసాగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్ ఉన్నారు.

# రాష్ట్రాన్ని ఫామ్ హౌస్ నుండి పరిపాలించింది మీ నాన్న కాదా?

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29 (జనంసాక్షి):** వేములవాడ మూలవాగు లోని బతుకమ్మ తెప్ప వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి చీరసారేను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలవాగు పరవళ్ళు తొక్కుతున్న గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశామన్నారు.సృష్టిలో నీటి కున్న ప్రాముఖ్యత నిర్వచించలేనిదని, రాష్ట్రంలోని ప్రాజెక్టులన్ని జలకల సంతరించుకున్నాయన్నారు. భారీ వర్షాలు పడిన ఆనాడు కాంగ్రెస్ పార్టీ నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీ రామ్ సాగర్, కడెం వంటి అనేక ప్రాజెక్టు చెక్కుచెదరకుండా ఉన్నాయని,లక్ష కోట్లతో నిర్మించామని గొప్పలు చెబుతున్న కాళేశ్వరం కృంగిపోయిందన్నారు. నర్మాల వద్ద పలువురు వరదలో చిక్కుకుంటే కేటీఆర్ వచ్చి రాజకీయాల గురించి మాట్లాడారన్నారు.కేటీఆర్ నర్మల చేరేసరికి బాధితులను హెలికాప్టర్ ద్వారా సురక్షితంగా ఒడ్డుకు చేర్చారన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేశారని, చక్రవర్తిల రాష్ట్రాన్ని ఫామ్ హౌస్ నుండి పరిపాలించింది మీ నాన్న కాదా అని ప్రశ్నించారు. రాష్టాన్ని అప్పుల కుప్పలుగా మార్చిన మీరా మా గూర్చి మాట్లాడేదన్నారు.వరద పరిస్థితి చూస్తుంటే కేటీఆర్ వైఫల్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుందని, గత పది సంవత్సరాలు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కనీసం బ్రిడ్జిలను కూడా నిర్మించలేకపోయారన్నారు.నిన్నటి వరదలకు మీ అసమర్థత కారణం కాదా అన్నారు.అన్నాడు నా చర్మం వలచి సిరిసిల్ల ప్రజలకు చెప్పులు కుట్టిస్తానని పెద్ద పెద్ద మాటలు మాట్లాడి కనీసం బ్రిడ్జిలు కూడా కట్టలేకపోయాడన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల వరదలు వస్తే సహాయం చేయవలసింది పోయి అక్కడ కూడా మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శిస్తున్నారని, మీ హయాంలో ప్రజలు తల్లడిలితే పట్టించు కోలేదన్నారు.అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చిస్తున్నమని, గుమ్మడికాయ దొంగ ఎవరంటే భుజాలు తాడు ముకున్నట్లుగా కేసీఆర్, కేటీ ఆర్ కోర్టుకు వెళ్లి కాళేశ్వరం విచారణపై స్టే



ఇవ్వాలని అడిగారన్నారు. మీరు తప్పు చేయనప్పుడు మీకు ఎందుకు భయమన్నారు. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరం పై చర్చలో పాల్గొనాలని, పిసీ ఘోష్ నివేదికను కూడా తప్పు పడుతున్నారన్నారు. కెసిఆర్, హరీష్ రావు ను పిసి ఘోష్ కమిషన్ ఒక్కొక్కరిగా విచారించిందన్నారు. బిఆరెస్ పరిపాలనలో వారి చేసినవి అన్ని స్కాములే అన్నారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాకేష్ ,మాజీ కౌన్సిలర్లు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఏసీబీకి పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి

- 20 వేల లంచం డిమాండ్
- టపాసులు కాల్చి గ్రామస్తుల సంబరాలు

**వీణవంక ఆగస్టు 29 (జనంసాక్షి):** వీణవంక మండలంలోని చల్లూరు గ్రామంలో లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ అవినీతి తిమింగలం గ్రామపంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటూ పట్టుపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. వీణవంక మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి కుంభం నాగరాజు నిర్మాణం జరిగిన ఇంటికి నెంబర్ ఇవ్వడానికి లంచం డిమాండ్ చేశాడు.లంచం లేనిది ఇంటి నిర్మాణానికి ఇంటి నంబర్ లేదన్నాడు దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు.ఏసీబీ డిఎస్పి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున చల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి లంచం డబ్బులు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వ అధికారి అయిన లంచం డిమాండ్ చేస్తే 10



64 నెంబర్‌కి సమాచారం అందించాలని బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. వీణవంక మండలంలోని చల్లూర్ గ్రామంలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అవినీతి గ్రామపంచాయతీ కార్యదర్శి ఏసీబీకి పట్టుబడ్డాడని తెలుసుకున్న గ్రామస్తులు చల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకొని టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

## ఓ వైపు చెప్పులు....
# మరోవైపు రైతులు



**రాయికల్ ఆగస్టు 29(జనంసాక్షి):** రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో యూరియా కొరతపై రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం వద్ద ఉదయం నుంచే వారి చెప్పులు, పాస్‌బుక్ జిరాక్స్‌లను వరుసలో పెట్టి ఆగ్రహాన్ని తెలియజేశారు.పంటలు కీలక దశలో ఉన్న సమయంలో యూరియా అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వెంటనే యూరియా సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ సిహెచ్ సుధీర్ రావు, మండల వ్యవసాయ అధికారి కె.ముక్తేశ్వర్ రైతులకు నచ్చజెప్పడంతో నిరసన విరమించారు.



# జలదిగ్బంధంలో మందర్న, హంగర్గ గ్రామాలు

**రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు**

**బోధన్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** గత రెండు రోజుల నుండి కురిసిన భారీ వర్షాలతో పాటు శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ తో నిజామాబాద్ జిల్లా బోధన్ ఉమ్మడి మండలంలోని మందర్న, హంగర్గ గ్రామాలు శుక్రవారం సైతం జలదిగ్బంధంలోనే ఉన్నాయి. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి ముంపు గ్రామాలను సందర్శించడంతో పాటు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, బోధన్ మండల తహశీల్దార్ విఠల్, సాలూర మండల తహశీల్దార్ శశిభూషణ్ లతో పాటు బోధన్ ఎసిపి శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్ బాబు, రూరల్ ఎస్సై మఛ్చేందర్ రెడ్డిలు ముంపు గ్రామాలలోని తిష్ట వేసి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పాటు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శ్రీరామ్ సాగర్ బ్యాక్ వాటర్ ఎప్పటికప్పటికీ వాటర్ లెవెల్ పెరగడంతో మందర్న, హంగర్గ గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లోనే జీవించాల్సిన పరిస్థితి నెలకొంది అని చెప్పవచ్చు. ముంపు గ్రామాలలో ఎన్డి ఆర్ఎఫ్ బృందాలతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ మేరకు సాలూర మండలంలో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించిన మండల వ్యవసాయ శాఖ అధికారిని కేతావత్ శ్వేత పంటనష్టం అంచనాలను జిల్లా అధికారులకు నివేదించారు. ఈ మేరకు సోయా 2 వేల 820 ఎకరాలు, వరి 3 వేల 110 ఎకరాలలో నష్టం వాటిని ఆమె స్పష్టం చేశారు. విద్యుత్‌డి ఈ ముక్త్యార్ ఆధ్వర్యంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు.

**ఎమ్మెల్యే ఆదేశాలతో రంగంలోకి కాంగ్రెస్ సైనికులు :** కాగా భారీ వర్షాలు శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌తో ముంపుకు గురైన గ్రామాలను కాంగ్రెస్ నాయకులు సందర్శించడంతో పాటు ప్రజలను



సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో సహాయక చర్యలు అందించారు. అంతేకాకుండా పునరావాస కేంద్రాలకు వచ్చిన బాధితులకు అన్నదానం నిర్వహించి వారికి భరోసా కల్పించడంతో పాటు బాసటగా నిలిచారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాలతో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, మందర్న మండల పార్టీ అధ్యక్షులు మందర్న రవి, బోధన్ మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, బోధన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాషా, కాంగ్రెస్ నాయకులు అల్లే రమేష్, అల్లె జనార్ధన్, దాము, తలారి నవీన్ ఇనాయత్ అలీ, ఆదినారాయణ రెడ్డి, నర్సాపూర్ సాయి ఖాజాపూర్ అశోక్ నాయకులు పాల్గొన్నారు.

**లయన్స్ ప్రతినిధుల చేయూత :** అలాగే బోధన్ పట్టణంలోని లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపక అధ్యక్షులు పోలవరపు బసవేశ్వర్ రావు ఆధ్వర్యంలో ముంపు గ్రామాల ప్రజలకు చేయూతనను అందించారు. ముంపు గ్రామాల ప్రజలను వాహనాలలో తరలించడంతో పాటు వారికి వైద్య సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలను లయన్స్ ప్రతినిధులు చేపట్టారు. ఈ మేరకు పోలవరపు బసవేశ్వర్ రావు తోపాటు కొడాలి కిషోర్, శ్రీనివాస్ రావులు ఉన్నారు.

# అమెజాన్‌కు ఎంపికైన యస్.బిఐటి విద్యార్థిని

**ఖమ్మం (జనంసాక్షి) :** ప్రముఖ అంతర్జాతీయ సంస్థ అమెజాన్‌కు తమ కళాశాల విద్యార్థిని షేక్. పర్వీన్ తభస్సుమ్ ఎంపికైనట్లు యస్.బి.ఐ.టి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. లేఆఫ్స్ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో కూడా ఉద్యోగం సాధించడం తమ కళాశాలకు గర్వకారణం అని పేర్కొన్నారు. కష్టపడి చదివితే తప్పక విజయం సాధిస్తారని, అందుకు పర్వీన్ తభస్సుమ్ ఒక ఉదాహరణ అని తెలిపారు. కొలాబెరా డిజిటల్ సంస్థకు క్లైంట్గా ఉన్న అమెజాన్ క్యాటలాగ్ స్పెషలిస్టా తమ విద్యార్థిని ఎంపికవడం గర్వించదగ్గ విషయంగ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి తెలిపారు. విద్యార్థులకు మొదటి సంవత్సరం నుండే ట్రైనింగ్స్ అందించడం వల్ల ఇది సాధ్యమైందని, ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక పర్యవేక్షణ కలిగి ఉంటామని అందువల్లనే ప్లేస్మెంట్స్ విషయంలో హైదరాబాద్ కు ధీటుగా పోటీపడగలుగుతున్నామని వివరించారు. క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ వంటి వివిధ అంశాలపై ట్రైనింగ్ అందించడం ద్వారా అంతర్జాతీయ కంపెనీలకు తమ విద్యార్థులు ఎంపికవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రాజ్ కుమార్ తెలిపారు. క్యాట్లాగ్ స్పెషలిస్ట్ తొలుత 3.50 లక్షలు వార్షిక ఆధాయంగా అందుకుంటుందని తెలిపారు. కృత్రిమ మేధ వల్ల ఉద్యోగాల కొత్త ఉద్యోగాలు సృష్టింపబడతాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎంపికైన పర్వీన్ తభస్సుమ్ ను కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాస రావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, డాక్టర్ జె. రవీంద్రబాబు, టి.పి.ఒ.యన్.సవిత, కోఆర్డినేటర్ జి.ప్రభాకర్ పాల్గొన్నారు.



## నేషనల్ ఫెన్సింగ్ పోటీల్లో..
# పతకాలు సాధించిన బీసీ గురుకుల విద్యార్థులు

- క్రీడాపోటీల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న బీసీ గురుకుల విద్యార్థులు
- అభినందించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యదర్శి బడుగు సైదులు

**కామారెడ్డి ఆగస్టు 29 (జనంసాక్షి) :** నేషనల్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాచుపల్లి లోని మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పి టల్ లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 17 పోటీలలో బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు 11 మంది హాజరయ్యారు కాగా సురేఖ వెండి పతకం, మరొక విద్యార్థిని రాణి కాంస్య పతకం సాధించారు. క్రీడా ప్రపంచానికి తెలంగాణ వేదిక కావాలి అన్న ప్రభుత్వ ఆలోచనను బీసీ గురుకుల విద్యార్థులు అనుసరిస్తూ క్రీడా పోటీల్లో పతకాలు సాధించడం అభినందనీయమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. క్రీడా స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందిస్తూ ఆసక్తికి అనుగుణంగా శిక్షణ అందిస్తున్నాం అన్నారు. రానున్న జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో బీసీ గురుకుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, విద్యార్థులను ప్రోత్సహిస్తున్న బీసీ గురుకుల సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు, జాయింట్ సెక్రటరీ తిరుపతి, కీసరా స్కూల్ ప్రిన్సిపాల్ రాములు గౌడ్‌ను అభినందించారు.



## కామారెడ్డి వరద బాధితులకు కేంద్ర,
# రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సహాయం అందించాలి

**సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్**

**కామారెడ్డి ఆగస్టు 29 (జనంసాక్షి) :** కామారెడ్డి పట్టణంలో వరద ముంపుకు గురైన ప్రాంతాలను సిపిఎం రాష్ట్ర బృందం సందర్శించింది రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ వెంట సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు డీజే నరసింహారావు, ఆర్ వెంకట్ రాములు, శోభన్ నాయక్ లు పర్యటించారు. వీటితోపాటు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ బృందం ఉంది. ఇంటింటికి తిరిగి బాధిత కుటుంబాలతో మాట్లాడారు. అదే సందర్భంలో అక్కడికి వచ్చిన కలెక్టర్ ను నిలదీశారు. కనీసం ప్రజలకు త్రాగడానికి మంచి నీళ్లు, ఆహారం, కరెంటు అందుబాటులోకి తేవాలని అన్నారు. వరదలో కొట్టుకొచ్చిన రాళ్లు రప్ప చెత్తాచెదారం ఇంట్లో చేరి బురదమయం అయ్యిందని అన్నారు. ఇంట్లోకి పాములు కూడా వచ్చాయని అన్నారు. అనంతరం సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ కామారెడ్డి పట్టణంలో వరదను అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేసుంటే ఇంత పెద్ద ఎత్తున నష్టం జరిగి ఉండేది కాదని అన్నారు. వరదల వల్ల బిఆర్ నగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, జిఆర్ కాలనీ కౌండిన్య నగర్‌లలో జాన్ వెస్లీ ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడారు. వందలాది ఇండ్లలోకి వరద నీరు చేరి నిత్యవసర వస్తు వులన్నీ కొట్టుకుపోయాయి. ఫస్ట్ ఫ్లోర్ వరకు అన్ని ఇండ్లు పూర్తిగా నీటిలో మునిగిపోయాయనితో వందలాది కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డు మీద పడ్డారని వారికి జిల్లా యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం తక్షణంగా భోజన సౌకర్యాలు, నీటి సౌకర్యాలు కల్పించాలని, వారికి నష్టపరిహారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.



# ముంపు ప్రజలకు చేయూత

**పిట్లం,ఆగస్ట్30,(జనంసాక్షి):** జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్ ఆధ్వర్యంలో పిట్లం, నిజాంసాగర్ మండలాల బీజేపీ నాయకులు శుక్రవారం నిజాంసాగర్ మండలం మర్పల్లి గ్రామ ప్రజలకు రగ్గులు అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎంపీ బీబీ పాటిల్ ఆదేశాల మేరకు పలువురికి దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పిట్లం మండల బీజేపీ అధ్యక్షుడు సాయి రెడ్డి,నిజాంసాగర్ మండల అధ్యక్షుడు నరేష్,బిజెపి సీనియర్ నాయకులు జగదీష్,అశోక్ రాజ్,మద్దెల నవీన్,రవిచంద్ర,ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ధ్యాన్ చంద్‌కి అల్ఫోర్స్ ఘన నివాళి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** భారత హాకీ క్రీడకు వన్నెతెచ్చిన మాంత్రికుడు, క్రీడా రంగానికి ఎనలేని కృషి చేసినటువంటి మహనీయుడు ధ్యాన్చంద్ ని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసినటువంటి వ్యాయామ ఉపాధ్యాయుల సన్మాన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారత దేశ ప్రభుత్వం 2012లో మేజర్ ధ్యాన్చంద్ జ్ఞాపకార్థకంగా వారు చేసిన సేవలను స్మరించుకుంటూ 29 ఆగస్టును జాతీయ క్రీడా దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని వారు తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో అద్భుత, అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేసారు. వివిధ ఛాంపియన్షిప్ పోటీలకు విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయటంలో విశిష్ట పాత్ర పోషిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల , వ్యాయామ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రుద్రంగిలో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి 20 లక్షల నిధులు మంజూరు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రుద్రంగి ఆగస్టు 29 (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని రుద్రంగి మండల కేంద్రంలో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల నిధులను మంజూరు చేసి ంది.ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ, మహిళల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ఈ తెప్ప నిర్మాణం ముఖ్యమైన భాగంగా మారనుంది.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక ఆసక్తితో బతుకమ్మ తెప్ప నిర్మాణనికి ప్రతిపాదనను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు పంపించగా తక్షణమే స్పందించిన కలెక్టర్ రుద్రంగి మండల కేంద్రం లోని రామకృష్ణ పూర్ పల్లె వద్ద 5 లక్షలు ,అచ్చయా కుంట వద్ద 5 లక్షలు, ఎల్లయ్య కుంట వద్ద 10 లక్షల నిధులతో బతుకమ్మ తెప్ప నిర్మాణం కోసం మొత్తం రూ.20 లక్షల నిధుల మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు జారీ చే శారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతితో మండల నాయకులు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్‌గే కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

# బ్యాక్ బిల్లింగ్ పై భగ్గుమన్న నేతన్నలు

- సెస్ కార్యాలయం ఎదుట ఆందోళన
- ఆందోళన సరికాదు : సెస్ చైర్మన్ చిక్కాల

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి):** సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ (సెస్) వ్యవహరిస్తున్న తీరుపై సిరిసిల్ల నేతన్నలు బగ్గుమన్నారు. శుక్రవారం సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ ,ఎస్.ఎస్.ఐ యూనిట్ల నిర్వాహకులు బ్యాక్ బిల్లింగ్ విషయంలో సెస్ అధికారులు అనుసరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకుదిగారు. బ్యాక్ బిల్లింగ్ బకాయిల విషయంలో సెస్ నుంచి వేధింపులు ఆపాలని నినాదాలు చేస్తూ సెస్ కార్యాలయం గేటు ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించారు. సెస్ అధికారులు అనుసరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో కార్యక్రమంలా పాలిస్టర్ అసోసియేషన్ నాయకులు ఎస్ఎస్ఐ యూనిట్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

**ఆందోళన సరికాదు : చిక్కాల రామారావు, సెస్ చైర్మన్.**

సెస్ కార్యాలయ ముట్టడిపై చైర్మన్ చిక్కాల రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు జరిగిన నష్టాలు అంచనా వేసేందుకు తంగళ్ళపల్లి మండలంలో విద్యుత్ లైన్లు పరిశీలించేందుకు వెళుతున్న క్రమంలో ఇక్కడ యజమానులు ఆందోళన చేపట్టారని తెలిపారు. సెస్ నుండి ఇప్పటివరకు ఎలాంటి వేధింపులు జరపలేదని అన్నారు. బ్యాక్ బిల్లింగ్ విషయంలో




సిరిసిల్ల నేతన్నలకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ తామే ప్రభుత్వానికి , విద్యుత్ నియంత్రణ మండలికి లేఖ రాశామని అన్నారు. పెరిగిన బిల్లులు కాకుండా కాల్చుకున్న కరెంటుకు యూనిట్ కు రెండు రూపాయల చొప్పున చెల్లించాలని కోరిన స్పందించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి సేస్ సంస్థకు బకాయి పడిన తగ్గింపు చేసిన బిల్లులే 73 లక్షలు ఉన్నాయని తక్షణం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సెస్ డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, నారాయణరావు పాల్గొన్నారు.

## పారమిత విద్యాసంస్థలలో
# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**కరీంనగర్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** కరీంనగర్ పట్టణంలోని పారమిత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేజర్ ద్యానచంద్ జన్మదినోత్సవ సందర్భంగా పారమిత పాఠశాలల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, సమన్వయ కర్తలు, పి.ఇ.టి.లు మేజర్ ద్యానచంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాలులర్పించారు. అనంతరం క్రీడా పతాకాన్ని ఎగుర వేసి క్రీడా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా రాష్ట్ర, జాతీయ క్రీడాకారులచే క్రీడా పరుగును నిర్వహించి క్రీడా జ్యోతిని వెల్గించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన వివిధ క్రీడా కార్యక్రమాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులు చేసిన వివిధ క్రీడా విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు విద్యార్థులకు ఉపాధ్యాయులకు, రాష్ట్ర, జాతీయ క్రీడాకారులకు మిత్రులకు జాతీయ క్రీడాదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనూకర్ రావు, వినోద్ రావు, రాకేష్, టి.యస్వి. రమణ వి.యు.యం. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, గోపీకృష్ణ, శ్రీకర్, శర్మిష్ట, కవిత, ప్రసాద్, సమన్వయ కర్తలు, ఉపాధ్యాయులు, పి.ఇ.టి లు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, ఆగష్టు 29 (జనంసాక్షి):** ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కన్నేపల్లి మండల కేంద్రంలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వం వైద్యరంగ బలోపేతం దిశగా చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధుల నియంత్రణ దిశగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, ప్రత్యేక ఫీవర్ వార్డులు ఏర్పాటు చేసి జ్వర బాధితులకు వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు గుత్తేదారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీల్లో ఓటర్ల ముసాయిదా జాబితా

### జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి



**వరంగల్ ప్రతినిధి, ఆగష్టు 29 (జనంసాక్షి):** జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రదర్శించామని, ఓటర్ల ముసాయిదా జాబితా లో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియ జేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా అప్ డేట్ చేయడం జరుగుతుందన్నారు.జిల్లాలోని 317 గ్రామ పంచాయతీల పరిధిలోని 2754 వార్డులలో 3,83,736 ఓటర్లతో డ్రాఫ్ట్? ఓటర్ జాబితా ఆగష్టు 28న (గురువారం) విడుదల చేశామని చెప్పారు. జిల్లాలోని ప్రతీ గ్రామ పంచాయతీ వారిగా డ్రాఫ్ట్ ఓటర్ జాబితా తయారు చేశామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు ఈ జాబితా పరిశీలించి ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 30 లోపు తెలియజేయాలని, 31 లోపు వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి సెప్టెంబర్ 2న తుది ఓటర్ జాబితా ప్రచురిస్తామని చెప్పారు. అలాగే గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు 2754 డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల చేశామని, వీటిపై అభ్యంతరాలను ఈనెల 30లోపు సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో అందించాలన్నా రు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యా రాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, జిల్లా పంచాయతీ అధికా రి కల్పన, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఐ ఎన్ సి నిహాల్, బిజెపి హరిశంకర్, నిశాంత్, బీఎస్పీ మనీ, సిపిఐ (ఎం) రంగయ్య, ఆల్ ఇండియా మజిలీస్ ఎం. ఏ. సుబాన్, టిడిపి లక్ష్మణ్, వైఎస్సార్ సిపి రజినీకాంత్ పాల్గొన్నారు.

# మత్తు ఏ రూపంలో ఉన్నా నేరమే

### నార్కోటిక్ డిఎస్పీ రమేష్ కుమార్



**ఏటూరునాగారం, ఆగష్టు 29(జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఆంటీ డ్రక్ సెల్ ఆధ్వర్యంలో కళాశాల ఆంటీ డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా విచ్చేసిన యాంటీ నార్కోటిక్ డిఎస్పీ రమేష్ కుమార్ పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు ఎవరు మాదకద్రవ్యాల వైపు వెళ్లకూడదని, జీవితాలను నాశనం చేసుకోకూడదని తెలిపారు. అనంతరం నార్కోటిక్ సిఐ శ్రీకాంత్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడకం, అమ్మకం మరియు వారికి ఆశ్రయం ఇవ్వడం కూడా నేరమని వాటికి సంబంధించిన చట్టాలను, కేసులను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపల్ డా బి.రేణుక, కళాశాల ఆంటీ డ్రగ్సెల్ బాధ్యులు సిహెచ్ వెంకటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ డా డి నవీన్, ఐక్యు ఎసి కోఆర్డినేటర్ డా జ్యోతి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ కనీస్ ఫాతిమా, శ్రీకాంత్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మేడారం మహా జాతర పనులను సకాలంలో పూర్తి చేయాలి

### మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 29(జనంసాక్షి):** జనవరి 28 నుండి 31 వ తేదీ వరకు జరగనున్న మేడారం మహా జాతరకు చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని, ప్రతి పని నాణ్యతతో చేపట్టి శాశ్వతంగా నిలిచిపోయేలా ఉండాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం సాయంత్రం రానున్న మేడారం మహా జాతరను పురస్కరించుకొని మేడారంలోని ఐటిడిఏ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, ఐటీడీఏ పిఓ చిత్ర మిశ్రాలతో కలిసి పూజారులు, వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్ రీ డెవలప్ మెంట్ ప్లాన్ ను ఆర్కియాలజిస్ట్, వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా చేపట్టనున్న పనులు ఏ ఏ దశలో ఉన్నయో వివరా లను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ, మేడారం శాశ్వత అభివృద్ధి పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఫలితంగా చేపట్టాల ని అధికారులకు సూచించారు. జాతర లోపు మొదటి విడత పనులను పూర్తి చేయాలని అన్నారు. గద్దల ప్రాంగణం విస్తీరణ గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల స్థలం మార్పులు క్యూ లైన్ల విస్తరణ నూతన మీడియా పాయింట్ భవనం ముఖ్యమంత్రి అతిధి భవనం పూజా రుల వసతి భవనం తదితర నిర్మాణాల కు త్వరిత గతిన టెండర్లు పూర్తి చేయాలన్నారు. భక్తులకు సులువైన దర్శనం కలిగే విధంగా గద్దలను వరుస క్రమంలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వందల సంవత్స రాల నిలి చేలా గిరిజన దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. మేడారం మహా జాతర పనులను సకాలంలో పూర్తి చేయాలనీ, అన్ని పనులు నాణ్యతతో శాశ్వతంగా నిలిచే విధంగా ఉండాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలనీ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గరావు, ఈఓ వీరస్వామి, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ మున్సిపల్ పరిధిలో నాన్ రెసిడెన్స్ ఓట్లను తొలగించాలి

- ఇతర రాష్ట్రాల వాళ్లు రెండు మూడు చోట్ల ఓట్లు కలిగి ఉన్నారు
- బోగస్ ఓట్ల ఏరివేతకు ఎన్నికల కమిషన్ పకడ్బందీ చర్యలు చేపట్టాలి
- ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విజ్ఞప్తి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగష్టు 29 (జనంసాక్షి) :** ఎన్నికల కమిషన్ రూపొందించిన ఎన్నికల జాబితాలో జనాలు తక్కువగా, ఓటర్లు ఎక్కువగా ఉన్నారని ఇది ఎవరిలోపమని ఓటరు జాబితాలో ఉన్న లోపాలను గుర్తించి తక్షణమే సరిదిద్దాలని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు, జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితాపై, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పై నిర్వహించిన వివిధ రాజకీయ పార్టీల సమీక్ష సమావేశానికి ఎంఐఎం పార్టీ పక్షాన గులాం అహ్మద్, బర్కత్ అలీ కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... చనిపోయిన వారి ఓట్లను తొలగించాలని, ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలస వచ్చిన వారి ఓట్లను గుర్తించి, దేశంలో ఒకే చోట ఒక ఎన్నికకు ఒకేసారి ఓటు వేసేలా అవకాశం కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ కు తద్వారా బోగస్ ఓట్ల ఏరివేత సాధ్యమవుతుందన్నారు. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వారు అసెంబ్లీ ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణలో ఓటు వేస్తూ.. వారి సొంత రాష్ట్రాల్లో అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినప్పుడు అక్కడ సైతం ఓట్లు వేస్తున్నారని, ఇలాంటి డబుల్ ఓటింగ్ విధానం జరగకుండా నిరోధించాలన్నారు. కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల జాబితాలో సుమారు 40వేల ఓట్లు గ్రామపంచాయతీల్లో నివసిస్తున్న వారి ఓట్లు, ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వారి ఓట్లు కలిగి ఉన్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కరీంనగర్ మున్సిపల్ పరిధిలోని డివిజన్లో ఎంతమంది ఉన్నారు ఎన్ని ఓట్లు ఎక్కువగా ఉన్నాయి వాటిని జల్లెడ పట్టి బిఎల్వోలు గుర్తించేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. గ్రామ, డివిజన్ స్థాయి స్థానికులతో విచారణ జరిపి లేదా వివిధ పార్టీల నాయకులు లేదా కుల సంఘాల ప్రతినిధుల సహాయంతో వివరాలు తెలుసుకొని చనిపోయిన ఓట్లను తొలగించాలన్నారు. బ్రతికి ఉన్న వారి ఓట్లు గల్లంత కాకుండా ఎన్నికల కమి షన్ పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, అర్హత కలి గిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని తెలి పారు. ఒక డివిజన్ పరిధిలోని ఒక ఇంటిలో వారి ఓట్లను ఒకే పోలింగ్ కేంద్రంలో పరిధిలో ఉండే ట్లు జాగ్రత్తలు తీసుకోవాలని, రెండు కేంద్రాల్లో ఓట్లు ఉండడంతో ఓటు వేసే బాధ్యత తగ్గి పోలింగ్ శాతం తగ్గడానికి కూడా కారణమవుతుందన్నారు.

# తుది ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

### నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి




**నిజామాబాద్ జిల్లా బ్యూరో, ఆగష్టు 29 (జనంసాక్షి) :** జిల్లాలోని మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా విడుదల చేసిన ముసా యిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే, ఈ నెల 30వ తేదీ వరకు తెలియజేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 2 వ తేదీన వార్డు, గ్రామ పంచాయతీల వారీగా ఫోటోతో కూడిన తుది ఓటరు జాబితాను ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదా యంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను ఈ నెల 28 న ప్రదర్శించడం జరిగిందన్నారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాల విషయంలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా, ఈ నెల 30 వరకు అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, 31న అభ్యంతరాలను పరిష్కరిస్తామని, అనంతరం సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. ఈ నెల 30న(శనివారం) మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆ సమావేశంలో పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితా పై అభ్యంతరాలు తెలపవచ్చని కలెక్టర్ సూచించారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపిలు అర్హతకు మించి వైద్యం చేయొద్దు

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాల్ రావు





**ఏటూరునాగారం, ఆగష్టు 29(జనంసాక్షి):** ఆర్ఎంపి లు అర్హతకు మించి వైద్యం చేయవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు హెచ్చరించారు. ఏటూరునాగారం మండలంలోని ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్న ఆర్ఎంపి ప్రథమ చికిత్స కేంద్రాలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించిన ఆయన ఆర్ఎంపి లను ఉద్దేశించి మాట్లాడు తూ, అర్హతకు మించి వైద్యాన్ని చేయకూడదని, అధిక మోతాదుల ఆంటీబయాటిక్స్ మరియు స్టెరాయిడ్ లతో చికిత్స చేయకూడదని, అనవసర రక్త పరీక్షలతో ప్రజల ను భయభ్రాంతులకు గురి చేయకూడదని, రోగులకు ఇంజక్షన్లు మరియు ఐవీ ఫ్లూయిడ్స్ లాంటివి పెట్టకూడదని ఆదేశించారు. జ్వరంతో బాధపడుతూ ప్రథమ చికిత్స కేంద్రాలకు వచ్చే రోగులకు అవస రమైన ప్రథమ చికిత్స నే చేయాలని తగ్గనిచో దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరో గ్య కేంద్రానికి రిఫర్ చేయాలని తెలిపారు. జ్వరం వచ్చిన రోగుల వివరాలను సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి కారులకు, సిబ్బందికి తెలి యజే యాలని అన్నారు. ప్రభుత్వ వైద్యుల సూచనల ప్రకారము చికిత్స ను ప్రజలకు అందించాలని లేనియెడల వారిపై క్లినికల్ ఎస్టా బ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారంచర్య తీసుకుంటామని హెచ్చరి ంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా కీటకజనిత నియంత్రణ అధికారి డాక్టర్ చంద్రకాంత్, వైద్యాదికారులు డాక్టర్ చంద్రకాంత్, డిఇఓ కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

# అవగాహనతోనే ఇంటికో ఇంకుడుగుంత

- అప్పుడే తీరుతుంది భూగర్భ జలాల చింత
- వరద కట్టడి కూడా సాధ్యమన్న హైడ్రా సదస్సు



**హైదరాబాద్, ఆగష్టు 29 (జనంసాక్షి):** ఇంకుడుగుంతల ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాల్సినవసరం ఉందని హైడ్రా నిర్వహించిన సదస్సు అభిప్రాయ పడింది. వర్షాకాలం వరద, వేసవి కాలం నీటి ఎద్దడి నివరణే కాకుండా.. నాణ్యమైన నీటిని అందించడానికి ఇంకుడుగుంతలు దోహద పడతాయని పేర్కొంది. ఇంకుడుగుంతలతో వరద నివారణ, భూగర్భ జలాల పెంపు అనే అంశంపై హైడ్రా కార్యాలయంలో శుక్రవారం జరిగిన సదస్సులో పలు విభాగాలకు చెందిన నిపుణులు పాల్గొని అభిప్రాయాలను వెల్లడించారు. నగరానికి తాగు నీటి కొరత లేకపోవడంతో పాటు ఉచితంగా తాగు నీరందించడంపై ఎవ్వరూ ఈ అంశంపై దృష్టి పెట్టడం లేదనే అభిప్రాయానికి వచ్చారు. ఈ ఏడాది వేసవిలో బెంగళూరు అంతటి తీవ్రమైన నీటి ఎద్దడిని హైదరాబాద్ ఎదుర్కోకపోయినా చాలా ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే మే నెలాఖరు నుంచే వర్షాలు పడడంతో హైదరాబాద్లో నీటి ఎద్దడి తీవ్రత అంత ప్రభావం చూపలేదని అన్నారు. ఇంకుడుగుంతల ఆవస్యకతను ప్రజలకు వివరించాల్సి నవసరం ఉందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. ప్రజల్లో అవగాహన వస్తే.. అమలు చేయడం ఎంతో సులభమని పేర్కొన్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, పెద్ద ఆవరణలున్న కార్యాలయాలు, విశ్వవిద్యాలయాలతో తొలుత మొదలు పెట్టి.. తర్వాత అందరూ ఇందులో భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. 2024తో పోల్చితే నగరంలో ఈ ఏడాది వేసవి కాలంలో 30 శాతం వాటర్ ట్యాంకర్ల డిమాండ్ పెరిగిందని జలమండలికి చెందిన గ్రౌండ్ వాటర్ విభాగం సంచాలకులు సత్యానారా యణ తెలిపారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, హైడ్రా అదనపు కమిషనర్ ఎన్ అశోక్ కుమార్, పర్యావరణవేత్త బీవీ సుబ్బారావు, ఎన్జీఆర్ఐ సీనియర్ శాస్త్రవేత్త డా. సక్రం గుగులోతు, జీహెచ్ ఎంసీ అడిషనల్ సీపీ వెంకన్న, గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్ డైరెక్టర్ కె. లక్ష్మణ్, డిప్యూటీ సిటీ ప్లానర్ స్వప్న రెడ్డి, ఇక్రిసాట్లో పనిచేసిన శాస్త్రవేత్త మురళి శర్మ, శ్మరణ్ ఎన్జీవో వై. సుభాష్ రెడ్డిగారితో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పూస్కుపల్లి రైతుల ఆవేదన

### నీట మునిగిన పంటపొలాలు



**కాళేశ్వరం , ఆగష్టు 30, (జనంసాక్షి):** భూపాలపల్లి జిల్లా లోని కాళేశ్వరం గ్రామంలో ప్రతి ఏటా వేసిన పంట వేసినట్టుగా గోదా వరి నది పాలు అవుతుందని పూస్కుపల్లి రైతులు ఆవేదన చెందు తున్నారు. సుమారు 30 నుండి 50 ఎకరాలలో వేసిన పంట నష్టపోతున్నామని అయినా ప్రభుత్వం నుండి మాకు నష్టపరి హారం రావడం లేదని అన్నారు. గతంలో గోదావరి నది వల్ల పూసుకుపల్లి ఊరు మునిగి ఇంట్లోకి నీళ్లు వచ్చి ప్రాణాలు గుప్పె ట్లో పెట్టుకుని బయటపడిన సందర్భాలు ఉన్నాయని అయినా గాని గత ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం కూడా ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు లోన్లు తీసుకుని, వడ్డీల కు అప్పులు తెచ్చి పంటలు వేస్తున్నామని ప్రతి వర్షాకాలం భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి గోదావరి నది రైతులు పం డించిన పంటలను ముంచుతుందని ఆవేదన చెందుతు న్నారు. అప్పులు తీర్చలేని పరిస్థితిలో రైతులు ఉన్నారని ఈ ప్రభు త్వమై నా రైతులను ఆదుకొని నష్టపోయిన పంటకు గిట్టుబాటు అయ్యే లా నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నా రు. మహదేవపూర్ మండలం ముద్దులపల్లి కి చెందిన పూతల కిరణ్ అనే రైతు కు నాగపల్లి శివారులో మూడు ఎకరాల చేను ఉంది.పత్తి పంట సాగుచేశాడు.ఎకరానికి రూ. 25వేల చొప్పున మూడు ఎకరాలకు రూ 75000వేలు పెట్టుబడి పెట్టాడు. అన్నారం బ్యారేజ్ బ్యాక్ వాటర్ తో మూడు ఎకరాల పత్తి పంట నీటిలో మునిగింది. ప్రతి సంవత్సరం పంటనష్టం సర్వేలు చేసి అధికారులు దాటవేస్తున్నారని ఎకరాకు రూ. 40వేలు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని ఆ రైతు కోరుతున్నాడు.

# ప్రాణ రక్షణకు సీపీఆర్ శిక్షణ తప్పనిసరి

- ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎనమల్ల నరేష్
- ఐఎంఏ ది హార్ట్‌బీట్" నినాదంతో అవగాహన కార్యక్రమం




**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగష్టు 29 (జనంసాక్షి) :** కార్డియాక్ అరెస్టు సమయంలో వెంటనే ప్రాథమిక వైద్యం అందించడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని వైద్యులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో "ఐఎంఏ ది హార్ట్‌బీట్" నినాదంతో కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్)పై అవగాహన శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ ఐఎంఏ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 80 మంది, మీడియా ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొని మ్యానిక్విన్స్ సహాయంతో ప్రత్యక్ష శిక్షణ పొందారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్ మాట్లాడుతూ.. మనదేశంలో ప్రతి లక్ష మందిలో నాలుగు వేల మంది కార్డియాక్ అరెస్టు బారిన పడుతున్నారన్నారు. సీపీఆర్ పై సరైన అవగాహన లేకపోవడంతో రోగులు ఆసుపత్రికి చేరుకునేలోపు ప్రాణాలు కోల్పోతున్నారని, ఆసుపత్రిలో సీపీఆర్ చేసినా ఫలితాలు పరి మితంగానే ఉంటాయని, అం దుకే ప్రాథమిక దశలోనే సీపీ ఆర్ ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని పిలుపు నిచ్చారు.

**త్వరలో ప్రత్యేక శిక్షణా శిబిరాలు**

పోలీసులు, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, కాలేజీ విద్యార్థులు, మీడియా మిత్రుల కోసం ప్రత్యేకంగా సీపీఆర్ శిక్షణా శిబి రాలు ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ నరేష్ తెలిపారు. "సీపీఆర్ శిక్షణ ప్రతి ఒక్కరి జీవన నైపుణ్యంగా మారాలి" అని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో సీపీఆర్ అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ నవీన్‌కుమార్, ట్రెజరర్ డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ ఎం.ఎల్.ఎన్.రెడ్డి, డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ రామ్‌కిరణ్, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ ఓంప్రసాద్, డాక్టర్ మహేశ్వరరెడ్డి, డాక్టర్ రత్నాకర్, డాక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
30 ఆగస్టు 2025

# 5.44 లక్షల మందికి నిమ్స్ వైద్యసేవలు

## నిమ్స్ డైరెక్టర్, డాక్టర్లు, సిబ్బందిని అభినందించిన మంత్రి దామోదర

- ఎమర్జెన్సీ పేషంట్ల విషయంలో నిర్లక్ష్యం తగదు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** నిమ్స్‌లో పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష చేశారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. నిమ్స్‌లో ఈ ఏడాది తొలి 7 నెల్లలో (జనవరి నుంచి జులై) 5 లక్షల 44 వేల మందికి వైద్య సేవలు అందించామని బీరప్ప తెలిపారు. ఇందులో సగానికిపైగా ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్‌ఎస్ వంటి ప్రభుత్వ పథకాల కింద ఉచితంగా చికిత్స పొందారని ఆయన తెలిపారు. మెరుగైన వైద్య సేవలు అందుతుండడంతో, నిమ్స్‌కు వచ్చే పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని బీరప్ప వివరించారు. ఈ ఏడాది ఇప్పటికే వందకుపైగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు కూడా చేశామని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్, డాక్టర్లు, సిబ్బందిని మంత్రి అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో నిమ్స్‌కు వస్తున్న పేషెంట్ల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు.

వీలైనంత త్వరగా పేషెంట్లను అడ్మిట్ చేసుకుని, ట్రీట్‌మెంట్ అందించాలని సూచించారు. ఎమర్జన్సీ వార్డులో అవసరమైన చికిత్స అందించి, సంబంధిత వార్డుకు పేషెంట్‌ను షిఫ్ట్ చేయాలన్నారు. ప్రస్తుతం నిమ్స్ ఎమర్జెన్సీకి రోజుకు 80 నుంచి వంద మంది పేషెంట్లు వస్తున్నారని డైరెక్టర్ బీరప్ప తెలిపారు. ఇందులో సగం మందికిపైగా పేషెంట్లు ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో చికిత్స పొంది, పరిస్థితి విషమించాక చివరి నిమిషంలో నిమ్స్‌కు వస్తున్నారని బీరప్ప వెల్లడించారు. కొన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ ఆపరేషన్లు చేసి, పేషెంట్లు పూర్తిగా కోలుకోకముందే వారిని డిశ్చార్జ్ చేసి, నిమ్స్, ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌కు పంపిస్తున్నారని బీరప్ప వివరించారు. ఇలాంటి కేసుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఎమర్జన్సీకి వచ్చే పేషెంట్లలో నేరుగా నిమ్స్‌కు వచ్చే వారికి, ప్రభుత్వ హాస్పిటల్స్ నుంచి రిఫరల్‌పై వచ్చే వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు.

ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్ నుంచి వచ్చే పేషెంట్ల విషయంలోనూ సానుభూతితో వ్యవహరించి చికిత్స అందించాలన్నారు. ఆపరేషన్ల తర్వాత, చికిత్స మధ్యలో పేషెంట్లను డిశ్చార్జ్ చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఒక హాస్పిటల్ నుంచి మరో హాస్పిటల్‌కు పంపించేటప్పుడు ఆ పేషెంట్‌తో పాటు అవసరమైతే అంబులెన్స్‌లో ఒక డాక్టర్‌ను పంపించాలని మంత్రి సూచించారు. పేషెంట్ల అడ్మిషన్, రిఫరల్ విషయంలో డ్యూటీ డాక్టర్లు, ఆర్‌ఎంవోలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ వాణి, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజారావు డాక్టర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్ల పునరుద్ధరణ

- తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.22.71 కోట్లు
- శాశ్వత మరమ్మతుల కోసం రూ.352 కోట్లు అవసరం
- పంచాయతీ అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష



**హైదరాబాద్, ఆగస్ట్29 (జనంసాక్షి) :** రాష్ట్రంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంచాయతీరాజ్ రహదారులను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలకు రహదారులు దెబ్బతిన్న నేపథ్యంలో సీతక్క పంచాయతీరాజ్ ఇఎన్‌సి ఎన్.అశోక్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. దెబ్బతిన్న రహదారుల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 1291 ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నట్లు– ఇంజినీరింగ్ అధికారులు మంత్రికి నివేదించారు. వీటి తాత్కాలిక మరమ్మత్తుల కోసం రూ.22.71 కోట్లు–, శాశ్వత మరమ్మత్తుల కోసం రూ.352 కోట్లు–, మొత్తంగా గ్రామీణ రహదారుల పునరుద్ధరణకు రూ.374.71 కోట్లు– అవసరమని ప్రాథమికంగా అంచనా వేసినట్లు– తెలిపారు. మొత్తం 22 గ్రామాలకు రాకపోకలు దెబ్బతినగా, వాటిలో 14 గ్రామాలకు తాత్కాలికంగా రహదారులను పునరుద్ధరించామని వెల్లడించారు. మిగిలిన గ్రామాలకు పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నట్లు– ఇఎన్‌సి అశోక్ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా వీలైనంత త్వరగా రహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్న గ్రామాలకు యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. వర్షాలకు తడిచి కూలే ప్రమాదం ఉన్న పంచాయతీరాజ్ భవనాలను తక్షణం ఖాళీ చేయించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు వేగంగా చేపట్టాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# సాయం కోసం వచ్చిన బోటు బోల్తా

- ప్రమాదం నుంచి బయటపడ్డ ఆర్మీ జవాన్



**మెదక్, ఆగస్ట్29 (జనంసాక్షి) :** మెదక్ జిల్లాలో ఆర్మీ జవాన్లకి పెను ప్రమాదం తప్పింది. రెస్క్యూ కోసం ట్రయల్ వేస్తుండగా బోటు బోల్తా పడింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది జవాన్లను రక్షించేందుకు రంగంలోకి దిగారు. తాళ్ల సాయంతో జవాన్లను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కాగా ఈ నెల 27న వినాయకుని విగ్రహం కొనుగోలు చేసేందుకు కామారెడ్డి జిల్లా లింగంపల్లి గ్రామానికి చెందిన 8 మంది చిన్నారులు మెదక్ కు వచ్చారు. భారీగా కురిసిన వర్షాలతో పోచారం వరద ఎక్కువ కావడంతో మూడు రోజులుగా పోచమ్మరాల్ గ్రామంలో చిన్నారులు తలదాచుకున్నారు. మూడు రోజులుగా గ్రామస్థులు 8 మంది చిన్నారుల ఆలన పాలన చూసుకున్నారు. ఈ క్రమంలో చిన్నారులను ఆర్మీ అధికారులు వారి ఇంటికి పంపేందుకు ప్రయత్నం చేయగా విఫలం అయ్యింది. దీంతో తిరిగి మెదక్ లోని పునరావాస కేంద్రానికి చిన్నారులను తరలించారు. కాగా మెదక్ జిల్లాలో కుండపోత వర్షాలు వణికించిన విషయం తెలిసిందే. వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి.



# పెద్దధన్వాడలో నిలదీస్తారని ముందే అరెస్టులు

- కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ పర్యటన సందర్భంగా భారీగా పోలీసులు
- ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు హౌజ్ అరెస్ట్

**రాజోలి, ఆగస్ట్ 26 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దధన్వాడ పరిసర గ్రామాల్లో మరొకసారి భయాందోళనలు కమ్ముకున్నాయి. తుపాకీ నీడన బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాయి. తాజాగా ఊర్లోకి పోనివ్వకుండా.. బయటకు రానివ్వకుండా అడ్డుకున్నారు. వందలాది మంది పోలీసులు మోహరించడంతో ఒక్కసారిగా గ్రామాలన్నీ మళ్లీ ఉలిక్కిపడ్డాయి. ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ శుక్రవారం పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీగా బందోబస్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఇథనాల్ ఫ్యాక్టరీ కేసుల విషయంలో రైతులు బాధల్లో ఉన్నప్పుడు పరామర్శించని సంపత్ కుమార్.. ఇప్పుడెందుకు రావడమని గ్రామస్తులు ప్రశ్నించారు. సోషల్ మీడియాలో గో బ్యాక్ అంటూ ప్రచారం చేయడంతో పోలీసులు అప్రమత్తమై ఇథనాల్ వ్యతిరేక పోరాట సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు గ్రామస్తులను తీవ్రంగా హెచ్చరించినట్టు తెలిసింది. అయితే, కష్టాల సమయంలో రానివాళ్లు ఇప్పుడెందుకు వస్తున్నారో తమకు తెలుసని, రాబోయే స్థానిక ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం వస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.

### యూరియా కొరత, రైతుల అవస్థల పాపం బీజేపీదే : సంపత్ కుమార్



యూరియా కొరత, రైతుల అవస్థలకు బీజేపీ కేంద్ర ప్రభుత్వమే కారణమని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో ఇటీవల నిర్మించిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మొదటి విడత డబ్బులు జమవడంతో వాటిని పరిశీలించి వారికి సంబంధిత చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. పెద్ద ధన్వాడ ప్రాంత ప్రజల కోరిక మేరకు గద్వాల నుంచి చిన్న తాండ్రపాడు, పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, ప్రాంతాల మీదుగా ప్రభుత్వ బస్సు సౌకర్యం కల్పించాలని కోరిన వెంటనే గద్వాల జిల్లా డిపో మేనేజర్‌కు వినతి రాసి పంపారు.

# మహానగరంలో నిమజ్జనాలు ప్రారంభం

- ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలు అమలు

**హైదరాబాద్, ఆగస్ట్29 (జనంసాక్షి) :** హైదరాబాద్ మహానగరంలో గణేష్ నిమజ్జనాలు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో వినాయక నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. గణేష్ నిమజ్జనాల సందర్భంగా శుక్రవారం నుంచి సెప్టెంబర్ 5 వరకు ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నిమజ్జనానికి వచ్చే విగ్రహాలను బట్టి ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా పీవీఎన్‌ఆర్ మార్గ్‌లలో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి.ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలను కవాడిగూడ మీదుగా దారి మళ్లించారు. ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ స్టేడియం దగ్గర నిమజ్జనాల కోసం క్రేన్లను ఏర్పాటు చేశారు.

# టీవీ నటుడికి ఏడాది జైలు

- ర్యాష్ డ్రైవింగ్‌తో ఇద్దరు మృతి చెందటంతో జనగామ కోర్టు తీర్పు



**జనగామ, ఆగస్ట్29 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతితోపాటు పలువురు గాయపడటానికి కారణమైన టీవీ నటుడు ఖయూమ్ అలియాస్ లోబోకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ జనగామ కోర్టు తీర్పునిచ్చింది. జనగామ జిల్లా రఘునాథపల్లి పోలీసుల కథనం ప్రకారం.. 2018 మే 21న ఓ టీవీ ఛానల్ తరపున వీడియో చిత్రీకరణ కోసం లోబో బృందం రామప్ప, లక్నవరం, భద్రకాళి చెరువు, వేయిస్తంభాల ఆలయం తదితర ప్రాంతాల్లో పర్యటించింది. అనంతరం లోబో స్వయంగా కారు నడుపుతూ వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా.. రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద ఎదురుగా వచ్చిన ఆటోను ఢీకొట్టారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఖిలాషాపురం గ్రామానికి చెందిన మేడె కుమార్, పెంబర్తి మణెమ్మలు తీవ్ర గాయాలతో మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. కారు కూడా బోల్తా పడటంతో లోబోతో పాటు– బృంద సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో రఘునాథపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరి మృతికి కారణమైన లోబోకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.12,500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు పోలీసులు వివరించారు.

# కాళేశ్వరం వద్ద పోటెత్తిన గోదావరి

- పుష్కర ఘాట్లపై నుంచి వరద ప్రవాహం



**పెద్దపల్లి, ఆగస్ట్29 (జనంసాక్షి) :** భారీ వర్షాలకు మరోసారి గోదావరిలోకి వరద పోటెత్తింది. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇక్కడ వరద మొదటి ప్రమాదకర హెచ్చరిక స్థాయిని దాటింది. కాళేశ్వరంలో జ్ఞాన సరస్వతి, పుష్కర ఘాట్ల మెట్ల పైనుంచి వరద ప్రవహిస్తోంది. గోదావరి పరివాహక సమీప గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. మహదేవపూర్ మండలంలో పంట భూముల్లోకి నీరు చేరింది. అన్నారం, చంద్రుపల్లి, నాగేపల్లి, మద్దులపల్లి, పలుగుల, బలిజాపూర్ గోదావరి పరివాహక ప్రాంతాల్లోని వాగులు ఉప్పొంగడంతో వందల ఎకరాల పత్తి పంట నీట మునిగింది. రెండోసారి పత్తి పంటనష్టంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి 9,71,880 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దీంతో 85 గేట్లు ఎత్తి 9,71,880 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

# సిఎంను కలిసిన సందీప్ రెడ్డి వంగా

- రూ.10లక్షల చెక్కు విరాళంగా అందచేత



**హైదరాబాద్, ఆగస్ట్29 (జనంసాక్షి) :** టాలీవుడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా రూ.10 లక్షల విరాళాన్ని సీఎం సహాయనిధికి అందించారు. ఈ సందర్భంగా తన సొంత బ్యానర్ భద్రకాళి ప్రొడక్షన్స్ తరపున నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా, సందీప్ రెడ్డి వంగా పదిలక్షల చెక్కును సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. శనివారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి చెక్కుని అందించారు సందీప్ రెడ్డి వంగా. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా ఎడతెరుపు లేని భారీ వర్షాల కారణంగా ఎంతోమంది నష్టపోయారు. అందువల్ల దర్శకుడు సందీప్ రెడ్డి ఈ సహాయం అందించినట్లు సమాచారం. తెలుగులో అర్జున్ రెడ్డి సినిమాతో ట్రెండ్ సెట్ చేశాడు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా. టాలీవుడ్ లో హిట్ పడగానే బాలీవుడ్ కి మకాం మార్చి అక్కడ కూడా కబీర్ సింగ్, యానిమల్ సినిమాలతో హిందీ ప్రేక్షకులను ఫిదా చేశాడు. ఈ క్రమంలోనే ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' అనౌన్స్ చేసి టాక్ ఆఫ్ ది ఇంటర్నేషనల్ గా మారాడు. స్పిరిట్ విషయానికి వస్తే.. ఇప్పటికే, ఈ మూవీ స్క్రిప్ట్ వర్క్ కూడా కంప్లీట్ చేసుకుంది. త్వరలో షూటింగ్ షురూ కానుంది. ఇందుకు సంబంధించిన సన్నాహాలు చకచకా జరుగుతున్నాయి. ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ప్రభాస్ ఫ్యాన్స్. త్వరలోనే షూటింగ్ అప్డేట్ వచ్చే అవకాశం ఉంది.

# అప్పుడు మేం అడిగితే పట్టించుకోలేదు

- ఇప్పుడు మీరు అడుగుతున్నారా?
- 'పవర్ పాయింట్ ప్రజెంటేషన్'పై ఆది శ్రీనివాస్ ఎద్దేవా




**హైదరాబాద్, ఆగస్ట్29 (జనంసాక్షి) :** అసెంబ్లీలో కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి కోరడాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. గతంలో అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ శాసనసభా పక్షం అడిగితే పట్టించుకోలేదని ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పీసీ ఘోష్ కమిషన్‌పై అసెంబ్లీలో చర్చ జరిగితే వారి బండారం బయటపడుతుందని ఆ పార్టీ నేతలు భయపడుతున్నారని అన్నారు. కాళేశ్వరానికి కర్త, కర్మ, క్రియ తానేనని కేసీఆర్ చెప్పుకొన్నారు. అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి గొప్పలకు పోయారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ హయాంలో కట్టారు.. వారి హయాంలోనే కూలిపోయింది. పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రజల ముందు ఉంచడానికి అసెంబ్లీలో చర్చకు పెడుతున్నాం. ఆ నివేదికను ఆపాలని భారత రాష్ట్ర సమితి హైకోర్టుకు వెళ్లి భంగపడింది. మేడిగడ్డ బ్యారేజీ కూలిపోవడంతో తెలంగాణ ప్రతిష్ఠ గంగలో కలిసిపోయింది. మామ, అల్లుడు నీటిపారుదలశాఖ మంత్రిగా ఉండి ఏం సాధించారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే ప్రజలు పట్టించుకోలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన ఇంజనీర్ల వద్ద ఏసీబీ రూ.వందల కోట్లు– పట్టు–కుంది. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా మా ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తోంది. భారత రాష్ట్ర సమితి అసెంబ్లీలో అన్ని విషయాలు చెప్పుకోవచ్చని ఆది శ్రీనివాస్ అన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: వివేక్

**హైదరాబాద్, ఆగస్ట్29 (జనంసాక్షి) :** మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్ లో కార్యకర్తల భేటీలో పాల్గొన్న ఆయన.. మైనార్టీల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. అందరికీ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఒక్క సారి హామీ ఇచ్చామంటే తప్పకుండా నెరవేరుస్తామన్నారు. రహమాత్ నగర్ లో రూ. 20 కోట్ల పనులు మంజూరు చేశామన్నారు. తొందరలోనే ఆ పనులు మొదలుపెడతామని చెప్పారు. రహమత్ నగర్ లో ఉన్న శ్మశాన వాటిక సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు మంత్రి వివేక్. ఈ విషయం గురుంచి కలెక్టర్, వక్ఫ్ బోర్డు చైర్మన్ తో మాట్లాడి స్థలం కోసం సర్వే చేయమని ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. తొందరలోనే మీకు మంచి కబారస్థాన్ నిర్మాణం చేస్తామన్నారు. మంచి స్థలం రోడ్డు సమస్య లేకుండా కబారస్థాన్ నిర్మిస్తామన్నారు. మైనార్టీల కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందన్నారు.


# కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం

- అనుమతి కోరుతూ స్పీకర్‌కు బిఆర్‌ఎస్ వినతిపత్రం



**హైదరాబాద్, ఆగస్ట్ 29 (జనంసాక్షి) :** అసెంబ్లీలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కలిశారు. నేటి నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ద్వారా వివరించే అవకాశాన్ని బీఆర్‌ఎస్‌ఎల్పీకి కల్పించాలని స్పీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. స్పీకర్‌ను కలిసిన వారిలో అసెంబ్లీలో బీఆర్‌ఎస్ విప్ కేపీ వివేకానంద, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయ కార్యదర్శి ఎం రమేష్ కుమార్ రెడ్డి ఉన్నారు.

# సిఎంను కలిసిన ఓవైసీ బ్రదర్స్



**హైదరాబాద్, ఆగస్ట్29 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ, మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ సభ్యులు శక్రవారం ఆయన నివాసంలో కలిశారు. మిలాదున్ నబీ సందర్భంగా పురాతన మసీదులు, దర్గాలను అలంకరించాలని, ఉచిత్ విద్యుత్ సరఫరా చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 14 న రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలకు అనుమతి ఇవ్వాలని కమిటీ సభ్యులు కోరారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370